# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## (AIKMKS అనుబంధం)

# అఖిల భారత ఆదివాసీ సదస్సు

## సావనీర్ - 2023



**ఆదివాసులకు, ప్రజలందరకూ వ్యతిరేకమైన**
**అటవీ సంరక్షణ (సవరణ) చట్టం - 2023 రద్దుకై పోరాడుదాం**




## అటవీ సంపదను దోచుకుంటున్న బహుళజాతి సంస్థలను నిరోధించాలి

## ఆదివాసీ, కార్మిక, రైతు కూలీ, మేధావుల ఐక్యత వర్ధిల్లాలి



ఆదివాసులకు, ప్రజలందరకూ వ్యతిరేకమైన
అటవీ సంరక్షణ (సవరణ) చట్టం - 2023 రద్దుకై పోరాడుదాం



# అఖిల భారత ఆదివాసీ సదస్సు
# సావనీర్ - 2023



**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**

**(ఏఐకెఎంకెఎస్ అనుబంధం)**

# అఖిల భారత ఆదివాసీ సదస్సు సావనీర్ - 2023


ప్రతులకు :

**మైత్రి బుక్ హౌస్,**
**28-9-1, జలీల్ వీధి, కారల్ మార్క్సురోడ్,**
**విజయవాడ - 2**

వెల : **రూ. 25/-**



వివరాలకు :

**కామ్రేడ్స్ యస్.ఝాన్సి, ఎం.ఎస్. నాగరాజు;** అధ్యక్ష, కార్యదర్శులు
**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**
**తరిమెల నాగిరెడ్డి భవన్, న్యూ గిరిపురం, విజయవాడ.**
**సెల్ : 94403 19977**
email : **jhansircsap@gmail.com**




# అటవీ సంరక్షణ (సవరణ) చట్టం - 2023కు వ్యతిరేకంగా విశాఖపట్నంలో విజయవంతంగా జరిగిన అఖిల భారత ఆదివాసీ సదస్సు

**ఆదివాసీల** ఉనికికి, జీవన భద్రతకు, సాంస్కృతిక జీవనానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న అటవీ సంరక్షణ (సవరణ) చట్టం – 2023ను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఎఐకెఎంకెఎస్) ఆధ్వర్యంలో **విశాఖపట్నంలో సెప్టెంబరు 12, 13 తేదీలలో 'అఖిల భారత ఆదివాసీ సదస్సు'** విజయవంతంగా జరిగింది.

డాక్టర్ బి.డి. శర్మ ప్రాంగణంగా నామకరణం చేయబడిన సభాస్థలి (సుబ్బలక్ష్మీ కల్యాణ మండపం), సెప్టెంబరు 12వ తేదీ ఉదయం 10 గం॥లకే దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుండి వచ్చిన వేలాదిమంది ఆదివాసీలు, ప్రజాతంత్రవాదులు, పర్యావరణవేత్తలు, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది. ఉ॥ 10.30 ని॥లకు వివిధ కళారూపాలతో కార్యక్రమం ప్రారంభ మైంది. గిరిజన కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కళారూపాలు సభికులను ఎంతో ఉత్తేజపరిచాయి. గిరిజన బాలికలు అమరుడు 'రాంజీ గోండు' జీవిత బుర్రకథా గానంతో సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

## ప్రారంభ సభ

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ వర్మ వేదికపైకి అధ్యక్షవర్గాన్ని, ఉపన్యాసకులను సాదరంగా ఆహ్వానించారు. మొదటిరోజు ఈ సభకు ఎఐకెఎంకెఎస్ నాయకులు కా॥ ప్రసాదన్న (తెలంగాణ), కా॥ ఇల్లా రామిరెడ్డి (ఆం.ప్ర), కా॥ శంభు మహతో (జార్ఖండ్) అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

**ప్రముఖ పర్యావరణవేత్త, ప్రజాస్వామికవాది ప్రఫుల్ల సామంతరాయ్** ప్రారంభోపన్యాసం చేశారు.

**1967 నాటి నక్సల్‌బరీ ఉద్యమ మహిళా నాయకురాలు,** 81 ఏళ్ళ వయసులో కూడా పోరాట బాటను విడువని కా॥ శాంతీ ముండా ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇల్లెందు శాసనసభా నియోజక వర్గానికి పలుమార్లు ప్రాతినిధ్యం వహించిన **మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ ఉద్యమ నాయకులు కా॥ గుమ్మడి నర్సయ్య, ఎ.పి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ వై. కేశవరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ కె.వి.వి. ప్రసాదరావు** తమ సంఘాల తరఫున సందేశాలిచ్చారు.

**విశాఖ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి కా॥ ఆదినారాయణ** మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీ కరించబూనుకోవటానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎఐఎకెఐఎస్ నాయకులు కా॥ పి.ఎస్. అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కా॥ కర్నాకుల వీరాంజనేయులు** సదస్సునుద్దేశించి మాట్లాడారు.

**ఏఐకెఎంకెఎస్ నాయకులు కా॥ శంభు మహతో (జార్ఖండ్)** పోరాటం తప్ప మనముందు మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు.

ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన **ఎఐకెఎంకెఎస్ నాయకులు, తెలంగాణ రైతుకూలీ ఉద్యమ నాయకులు కా॥** ప్రసాదన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రారంభ సభను ముగించారు.

## బహిరంగ సభ

పోలీసులు ప్రదర్శనకు అనుమతి నిరాకరించటంతో వేలాది గిరిజనులు, రైతుకూలీలు మందగమనంతో చిన్న చిన్న దండులుగా సభాస్థలికి చేరుకున్నారు. ఎర్ర జెండాలను పైకెత్తి పట్టారు. రెండు జట్లుగా గిరిజన సాంప్రదాయ నృత్యాలతో సభాస్థలిని తమ నృత్య గానాలతో ధ్వనింపజేశారు. విశాఖపట్నంలోని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో జరిగిన బహిరంగ సభ వేదికపైకి ఉపన్యాసకులను **రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ శ్రీనునాయుడు** ఆహ్వానించారు. ఈ సభకు **రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ వర్మ** అధ్యక్షత వహించారు. ఆదివాసుల ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించటం పట్ల ఆయన తీవ్ర నిరసన తెలియజేశారు. ఈ సభలో **ఎఐఎఫ్‌టియు(న్యూ)అధ్యక్షులు కా॥ జి. విజయకుమార్, కొండమొదలు సర్పంచ్ కా॥ వేట్ల విజయ, ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥ కుంజం రామారావు, పార్వతీపురం మన్యంజిల్లా నాయకులు కా॥ ఊయక ముత్యాలు, ఆదివాసీ ఉద్యమనేత కా॥ శాంతి ముండా, ఆదివాసీ నేత గుమ్మడి నర్సయ్య, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు, ఏఐకెఎంకెఎస్ కో–కన్వీనర్ కా॥ ఎస్.ఝాన్సీ, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥గణేష్** పండా ప్రసంగించారు.

## ప్రతినిధుల సభ

సదస్సు రెండవరోజు సెప్టెంబరు 13న ఉదయం 10 గం॥లకు ప్రతినిధుల సభ ప్రారంభమైంది. పది రాష్ట్రాల నుండి 500 మంది ప్రతినిధులు ఈ సభలో పాల్గొన్నారు. ఈ ప్రతినిధుల సభ వేదికపైకి ఉపన్యాసకులను **రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ బాషా** ఆహ్వానించారు. పీడిత ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ అమరులైన వారికి మరియు వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, రాజ్య నిర్బంధంలో అమరులైన వారికి సభ జోహార్లర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించింది. **రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ఎం.ఎస్**

**నాగరాజు, చాషీములియా ఆదివాసీ సంఘం (ఒడిషా) నాయకులు కా॥పైడమ్మ, తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఆనంద్**లు ఈ సభకు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

**మాజీ వ్యవసాయశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ శ్రీవడ్డే శోభనాద్రీశ్వరరావు** ప్రతినిధుల సభను ప్రారంభిస్తూ ప్రసంగించారు.

అటవీ చట్టాలపై ప్రత్యేక అధ్యయనం చేసిన **న్యాయవాది శ్రీ పల్లా త్రినాథరావు** ఆదివాసుల జీవనం, సంస్కృతులకు ఏర్పడబోతున్న ముప్పు గురించి మాట్లాడారు.

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ** మాట్లాడుతూ అటవీ సంరక్షణ చట్టం రద్దుకు ఉద్యమిస్తున్న ఆదివాసీలకు తన సంఘీభావాన్ని తెలియజేశారు. **రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్.ఝాన్సీ** కేంద్ర ప్రభుత్వం చేసిన అటవీ సంరక్షణ సవరణ చట్టానికున్న నేపథ్యాన్ని, పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాలను, నిర్వహించాల్సిన కర్తవ్యాలను పేర్కొన్నారు. ఇంకా ఈ ప్రతినిధుల సభలో **ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఘాసిరాం సోరెన్, ఒడిషా ఏఐకెఎంకెఎస్ నాయకులు కా॥ శ్రీకాంత్ మెహంతి, కర్ణాటక రైతు రాజ్య సంఘ నాయకులు కా॥మాధవరెడ్డి, ఏఐకెఎంకెఎస్ కేంద్ర నాయకులు, (బీహార్) కా॥ అశోక్ బైతా, తెలంగాణ రైతుకూలీసంఘం రాష్ట్రకార్యదర్శి కా॥ ఉప్పలయ్య, ఏఐకెఎంకెఎస్ మహారాష్ట్ర నాయకులు కా॥ బాబురావు కుంభర్‌గావ్, తమిళనాడు నాయకులు కా॥విల్లి కృష్ణన్, కేరళ నాయకులు కా॥ రాజన్, ఏఐకెఎమ్‌కెఎస్ పశ్చిమబెంగాల్ నాయకులు కా॥ శ్రీధర్ ముఖర్జీ** ఆయా రాష్ట్రాలలో సాగుతున్న ఆదివాసీ, ప్రజా ఉద్యమాల నేపథ్యాన్ని వివరించారు.

## తీర్మానాలు

అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పోలవరం నిర్వాసితులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఏఐకెఎంకెఎస్ ఒడిషా నాయకులు కా॥ శ్రీకాంత్ మెహంతి తీర్మానాలను ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆ తీర్మానాలను ఆమోదించింది.

అంతర్జాతీయ శ్రామిక గీతంతో సభ ముగిసింది.

**(ఉపన్యాసాల, సందేశాల, తీర్మానాల పూర్తిపాఠాలు లోపలిపేజీల్లో....)**

మైత్రి బుక్‌హౌస్

**అభ్యుదయ, విప్లవ సాహిత్య కేంద్రం**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**

# ప్రారంభ సభ

## కా॥ ప్రసాదన్న, ఎఐకెఎంఎస్ నాయకులు, తెలంగాణ



ఎఐకెఎంఎస్ నాయకులు, తెలంగాణ రైతుకూలీ ఉద్యమ నాయకులు కా॥ ప్రసాదన్న ప్రారంభ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోడుపట్టాల పంపిణీ పేరుతో తెలంగాణా రాష్ట్ర పాలకులు సాగిస్తోన్న దందాను ఖండించారు. ప్రజాస్వామికవాదుల అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోవటంలేదన్నారు. కేంద్రం తీసుకు వచ్చిన అన్ని దుర్మార్గమైన చట్టాలకు తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ ఆమోదం తెలియజేశాడని, ప్రజలను దగా చేయటంలో పాలకులందరూ ఒకటేనని మరోమారు స్పష్టమవు తోందని అన్నారు. దుర్మార్గమైన ఈ సవరణ చట్టాలను అందరూ వ్యతిరేకించాలని, ఉద్యమించాలని కోరారు. సభకు హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిజేస్తూ ప్రారంభ సభను ముగించారు.

## శ్రీ ప్రఫుల్ల సామంతరాయ్, ప్రముఖ పర్యావరణవేత్త



మిత్రులారా! దేశంలో సంక్లిష్ట పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మతతత్వ పాలకులు దళిత వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక, పీడిత ప్రజా వ్యతిరేక విధానాలను శక్తివంతంగా అమల్లోకి తీసుకువస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ అటవీ సంరక్షణ సవరణ చట్టం-2023. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, ఈ సభను నిర్వహిస్తున్న అఖిల భారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ నాయకత్వానికి, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు, గిరిజన ప్రజానీకానికి నా హృదయ పూర్వక అభినందనలు. ఈ సభకు అధ్యక్షత వహిస్తున్న అధ్యక్ష వర్గానికి, వేదిక మీద ఉన్న వివిధ రాష్ట్రాల నాయకులకు, కేంద్ర నాయకులకు నా ప్రత్యేక అభినందనలు.

దేశంలో నెలకొని ఉన్న అత్యంత సంక్షుభిత, క్లిష్ట పరిస్థితుల్లో అటవీ సంరక్షణ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ సభ జరపటం చారిత్రకంగా ప్రాధాన్యం కలిగినది. చాలా ధైర్య సాహసాలతో కూడుకొన్నది. ఈ సదస్సులో పాల్గొనటానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒరిస్సా మొ॥ ప్రాంతాల నుండి అడవి, భూమి, నీరు కోసం పోరాటం చేస్తూ ఇక్కడికి వచ్చిన గిరిజన ప్రజానీకం అందరికీ పేరుపేరునా విప్లవాభినందనలు. ఈనాడు ప్రజల ప్రజాస్వామిక హక్కులకు విరుద్ధంగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కలిగించే విధంగా పరిపాలన సాగుతోంది. గత 9 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి పాలకులు క్రమంలో అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు చేశారు. వాటిలో అటవీ సంరక్షణ సవరణ చట్టం ప్రధానమైనది. తన జీవిత పర్యంతం గిరిజన ప్రజానీకపు శ్రేయస్సు కోసం పాటుపడిన మేధావి, ప్రజాతంత్రవాది, గిరిజన పక్షపాతి డా॥బి.డి. శర్మ గారి పేరు ఈ సభా ప్రాంగణానికి పెట్టినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు. డా॥ బి.డి.శర్మ గారికి జోహార్లు.

మనం ఈ రోజు మాట్లాడుకుంటున్న అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని గత నెలలో చట్టరూపంలోకి తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఇది కేవలం ఆదివాసీ ప్రజల మనుగడకు మాత్రమే ప్రమాదకారి కాదు. మన సహజ సంపదలన్నింటినీ బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయడానికి ఉద్దేశించినదే ఈ చట్టం. ఈ దశలో ఈ చట్టానికి విరుద్ధంగా ఒక కర్తవ్యం చేపట్టటానికి జరుగుతున్న ఈ సమ్మేళనం ఎంతో ప్రాముఖ్యత కలిగినది, చారిత్రాత్మకమైనది.

1980లో అటవీ సంరక్షణ చట్టం వచ్చింది. 1996లో 'అడవి'ని గురించి సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. వీటి ప్రకారం ఆదివాసీలకు హద్దులు నిర్ణయించి, కొన్ని వేల హెక్టార్ల భూమిని అటవీ భూమిగా డిక్లేర్ చేసింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు చేసిన ఈ సవరణ చట్టం ప్రకారం ఈ వేల హెక్టార్ల భూమిని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ అడవుల నుండి ఆదివాసీలను పూర్తిగా గెంటివేసే దుర్మార్గపు చర్యలను చేపడుతోంది. ఎటువంటిదీ అడవి? అపారమైన సహజ సంపద, ఖనిజ వనరులు విస్తారంగా ఉన్నటువంటి ప్రాంతం. ఆ సంపదలన్నింటినీ బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే పనికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంటోంది. 1980 చట్టం గానీ, 2006 అటవీ హక్కుల చట్టం గానీ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల మీద దయతో చేయలేదు. ఆదివాసీలు తమ మనుగడ కోసం ఎన్నో పోరాటాలు చేశారు, త్యాగాలు చేశారు ఆ పోరాటాల ఫలితంగానే ఈ చట్టాలు చేయక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది పాలకులకు. రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసేసుకుని, అటవీ సంపదనంతటినీ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఈ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే ఆదివాసీ ప్రజల మనుగడ మాత్రమే కాదు, మొత్తం దేశ ప్రజల మనుగడకే పెద్ద విఘాతంగా మారే ప్రమాదం పొంచి ఉంది.

మరో ముఖ్యమైన విషయం, ప్రపంచమంతా పర్యావరణం నాశనమవుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాతావరణంలో అననుకూలతలు నానాటికీ తీవ్రమౌతున్నాయి. ప్రజల జీవన భద్రత అపాయంలో ఉంది. దీనికి ప్రధాన కారణం లాభాలే పరమావధిగా సాగుతున్న పెట్టుబడిదారీ విధానాలే. ప్రపంచ పెట్టుబడిదారీ విధానపు దుష్ఫలితమే పర్యావరణ విధ్వంసం. తమ లాభాపేక్ష కొరకు పర్యావరణాన్ని వారు ధ్వంసం చేస్తున్నారు. మన దేశంలో మోడీ ప్రభుత్వం అటవీ భూములను, అటవీ సంపదలను పెట్టుబడిదార్లకు కట్టబెడుతూ పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటోంది.

గత పది సంవత్సరాల నుండి ఒరిస్సాలో కేంద్రంలోని బిజెపి పాలకులు, రాష్ట్రంలోని బిజెపి పాలకులు ఆదివాసీలకు నామమాత్రంగా ఉన్న హక్కులను కూడా కాలరాసి, ఎన్నో విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న అటవీ ప్రాంతాన్నంతా బహుళజాతి సంస్థలకు అప్పగించి

వేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఒరిస్సాలోని అనేక ప్రాంతాల్లో పోరాటాలు సాగుతున్నాయి. ఒరిస్సాలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వంతో కుమ్మక్కై గిరిజనులను తమ నివాసాల నుండి గెంటివేస్తున్నారు. వారిని నిర్వాసితులను చేస్తున్నారు. సంపదలను ప్రైవేటు సంస్థలకు దోపిడీ చేసుకోవటానికి కట్టబెడుతున్నారు. దక్షిణ ఒరిస్సాలోని కోరాపుట్, కలహండి జిల్లాలు, ఉత్తర ఒరిస్సాలోని మయూర్‌భంజ్. ఖైయుంజర్ జిల్లాల్లో వేలాది మంది గిరిజనులు తమ నివాసాల నుండి గెంటివేయబడుతున్నారు. ఈ గెంటివేతలకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో ఆదివాసీలు తమ మనుగడ కోసం ప్రతిఘటిస్తున్నారు. ప్రతిఘటిస్తున్న ఈ ఆదివాసీ ప్రజానీకంపై పాలకులు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. వారి ప్రాథమిక హక్కులపై దాడులు చేస్తున్నారు. పోలీసులు, కంపెనీల ప్రైవేటు గూండాలు గిరిజనులపై బహుముఖ దాడులు చేస్తున్నారు. వారిని నిర్బంధిస్తున్నారు. రాయగడ జిల్లాలోని కాశీపూర్ ప్రాంతంలో పోరాడుతున్న గిరిజనులపై ఉపా చట్టం కింద కేసులు పెట్టి, వారిని జైళ్ళల్లో నిర్బంధించారు. తమ మనుగడ కోసం ఆదివాసీలు చేస్తున్న ఈ పోరాటాలకు మనం సంఘీభావం తెలియజేయాలి.

మోడీ ప్రభుత్వపు ఫాసిస్టు తరహా నిర్బంధాలకు, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా మనమంతా పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంది. ఈ పోరాటాలతో మన అడవులను మనం రక్షించుకుంటూ, మన సంపదలను మనం కాపాడుకుంటూ మతతత్వ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం ఆసన్నమైంది. మోడీ నాయకత్వాన కేంద్ర పాలకులు ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేస్తున్నారు. మతతత్వంతో వ్యవహరిస్తూ ఇతర మతాలపై దాడులు చేస్తున్నారు. మత విద్వేషాలను పెంచుతున్నారు. పెట్టుబడిదారులు లాభాలు ఆర్జించటానికి వీలుగా ప్రజల శ్రమను లూటీ చేస్తున్నారు. ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించింది. అప్పుడు విద్యార్థిగా ఉన్న నన్ను కూడా నిర్బంధించి ఒక సంవత్సరం పాటు జైలులో ఉంచారు. ఇప్పుడు దానికి అనేక రెట్లు నిర్బంధం కొనసాగుతూ ఉంది. ఇది పరోక్ష పద్ధతుల్లో సాగుతున్న ఎమర్జెన్సీ తప్ప మరోటి కాదు. మనకు ఎన్ని భిన్నాభిప్రాయాలున్నా, వాటన్నిటినీ పక్కనబెట్టి మతతత్వంతో పరిపాలిస్తున్న, ఫాసిస్టు తరహాలో పరిపాలిస్తున్న నరేంద్ర మోడీని 2024 ఎన్నికల్లో గద్దె దింపాల్సిన అవసరం ఉంది. అదే విధంగా కేంద్ర పాలకులకు జతకూడి బహుళజాతి సంస్థలకు సేవలనందిస్తూ, ప్రజల ప్రజాస్వామిక హక్కులు కాలరాస్తూ, ప్రజాజీవితాలను ధ్వంసం చేస్తున్న ఒరిస్సాలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వాన్ని, తెలంగాణాలోని కెసిఆర్ ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్‌లోని జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉంది. ఏ పాలకులు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగ పరిరక్షణ కోసం, మన హక్కుల కోసం మనం పోరాడక తప్పదు.

**జల్, జంగల్, జమీన్ హమారా, హమారా !**

**ఇంక్విలాబ్ జిందాబాద్!**

(అటవీ సంరక్షణ సవరణ చట్టం గత నెలలో చట్టరూపం దాల్చింది. కానీ దాని అమలు మాత్రం ఏనాటి నుండో సాగుతోంది. ఒరిస్సాలోని రాయగడ జిల్లాలో, ఇంకా చాలా ప్రాంతాల్లో ఆదివాసీలను వెళ్ళగొట్టేసి అడవుల్లోని గనులన్నిటినీ ప్రైవేటు వారికి ఇచ్చేస్తున్నారు. తమ మనుగడ కోసం పోరాడుతున్న ఆదివాసులపై రకరకాల కేసులు పెట్టి జైళ్ళల్లో మగ్గబెట్టారు. ఆ ఆదివాసులకు అండగా నిలబడుతూ, వారి తరఫున పాలకులను ప్రశ్నిస్తూ, పోరాడుతున్న ప్రఫుల్ల సామంతరాయ్‌గారు ఈ పోరాటంలో ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తూ ఉన్నారు.

ఈ సదస్సు జరగటానికి పదిరోజుల ముందు ఆదివాసీలకు జామీను ఇవ్వటానికి రాయగడ వెళ్ళిన సామంతరాయ్ గారిని, ఆయన ఉంటున్న లాడ్జిలోకి పోలీసులు చొరబడి, ఆయన ముఖంపై ముసుగు వేసి, నిర్బంధించి తీసుకుపోయారు. ఇలాంటి కేసులకు మీరు రావద్దు అని తీవ్ర హెచ్చరికలు చేసి బరంపురంలోని ఆయన ఇంటికి పంపించేశారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా, నిర్బంధాలు పెట్టినా ఆయన ఆదివాసీల కోసం పనిచేస్తూనే ఉన్నారు.)

## కా॥ శాంతి ముండా, నక్సల్‌బరీ ఉద్యమ మహిళానాయకురాలు



కామ్రేడ్స్! నేడు విశాఖ సదస్సుకు హాజరయినటువంటి సోదర, సోదరమణులందరికీ విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ రోజు మన దేశ వ్యవస్థ చాలా కఠినంగా ఉంది. ఈరోజు మన భారతదేశం అర్థవలస, అర్థఫ్యూడల్ వ్యవస్థగా ఉంది. కానీ కొంతమంది పెట్టుబడిదారీ విధానం వచ్చేసిందని చెబుతూ ఉన్నారు. కానీ దేశంలో ఫ్యూడల్ దోపిడీ అత్యంత దుర్మార్గంగా కొనసాగుతుంది. అందుకే ఈ వ్యవస్థలో రైతులు, రైతుకూలీలు అనేక కష్టాలు పడుతున్నారు.

మనం ఫ్యూడల్ దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం లేదని కూడా చెబుతున్నారు. మనం ఆదివాసీలం, మన మీద దోపిడీ సాగిస్తూ తుపాకులతో మనల్ని చంపివేస్తున్నారు. ఈరోజు మణిపూర్‌లో జరుగుతున్నది అదే, పంజాబ్‌లో జరిగింది అదే, బెంగాల్‌లోని నందిగ్రామ్ మరియు సింగూర్ గిరిజనులపై తుపాకులతో దాడి చేసారు. ఈ దోపిడీ శక్తులకు అనుకూలంగా ఈ పాలకవర్గాలు మన ఆదివాసీలపై, మన పీడిత ప్రజానీకంపై దాడి చేస్తున్నపుడు మనం కూడా తిరిగి దాడి చేసే హక్కు మనకు లేదా?

కామ్రేడ్స్, మన మీద సాగుతున్న దాడులకు వ్యతిరేకంగా భూమిపై, అడవిపై హక్కుల కోసం మనం పోరాడాల్సిన అవసరం ఉంది. ఆదివాసీల మధ్య, దళితుల మధ్య, పేద రైతుల, అణగారిన పీడిత ప్రజల మధ్య మనం దిగబడి వారి సమస్యలు తీసుకుని నిరంతరం పోరాటాలు చేయాల్సిన కర్తవ్యం మనపై ఉంది.

నేను 70 సం॥రాల నుంచి కమ్యునిస్టు పార్టీలో పనిచేస్తున్నాను. నక్సల్బరీ పోరాటంలో నేను స్వయంగా పాల్గొన్నాను. భూమి కోసం పోరాడుతున్న మా పైకి పోలీసులు వ్యానులతో వచ్చి దాడి

చేయటానికి పూనుకున్నారు. మేము పోలీసుల్ని ప్రశ్నించాం. మాపై దాడి చేయటాన్ని అడ్డుకున్నాం, మేము ఉద్యమంలో అనేక కష్టనష్టాల్ని అనుభవించాం. భారతదేశంలో భూమి సమస్య పరిష్కారమవ్వాలంటే; భూమి మీద, అడవి మీద మొదలగు సహజ సంపదల మీద మనకు హక్కు రావాలంటే పోరాటం చేయక తప్పదు. పెట్టుబడిదారీ వర్గం మన భూమిని మనకు దక్కకుండా కాజేసి పెద్దపెద్ద సంస్థలకి అప్పచెబుతున్నారు. అందుకోసం మనం అందరం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఈ సదస్సులో అనేకమంది మహిళా కామ్రేడ్స్ చురుగ్గా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. మనమందరం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని నేటి పరిస్థితులు మనకు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం నా వయస్సు 81 సం॥లు. ఈ వయస్సులో కూడా నా శక్తి కొలదీ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేస్తున్నాను. మీరందరూ కూడా పోరాటానికి సమాయత్తమవ్వాలి. మన భూమి, అడవి, నీరుని కాపాడుకుందాం. జీవావరణ, పర్యావరణాన్ని దోపిడీ శక్తుల కబంధ హస్తాల నుండి రక్షించుకుందాం.

## కా॥ గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే



సభా అధ్యక్ష వర్గం, వేదిక మీద ఉన్నటువంటి నాయకత్వం, ఈ సదస్సుకు విచ్చేసినటువంటి అన్నలూ, అక్కలూ, విద్యార్థులు, యువకులు అందరికీ విప్లవాభి వందనాలు. ఇంతకు ముందు మాట్లాడినటువంటి నాయకులు అనేక విషయాలను మీ ముందు ఉంచారు. మనం కూడా ఆ వెలుగులో సమాయత్తం కావలసిన అవసరం ఉంది. ఈ రోజు ఈ సదస్సు ప్రాధాన్యత ఏంటనే విషయం మీరందరూ గమనించే ఉంటారు. నిజంగా దేశంలో, రాష్ట్రాల్లో ఉన్నటువంటి పాలకులు, ప్రభుత్వాలు ప్రజల హక్కుల్ని కాలరాస్తున్నాయి అనే విషయం ఎవరికీ తెలియంది కాదు. మనందరం ఆ పాలనలో మగ్గుతున్నాం. దాన్ని ఎదుర్కొనడం కోసం చేస్తున్నటువంటి ప్రయత్నాలే మనం నిర్వహించే పోరాటాలు. అది భూపోరాటం కావచ్చు, లేదా కార్మికుల, కర్షకుల పోరాటాలు కావచ్చు. వాటిని నిర్వహిస్తుంటే అణచివేసే కార్యక్రమాలు పాలకులు నిర్వహిస్తున్నారు. దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ నిర్బంధ విధానాల్ని మనకి చవిచూపించారు. కర్షక వర్గం ఇండియాలో 2021లో ఢిల్లీని ముట్టడించిన విషయం మనకు తెలిసిందే. సంవత్సర కాలంపాటు విరామం లేని పద్ధతుల్లో వందల్లో వేలల్లో కాదు లక్షల్లో ఢిల్లీని ముట్టడించారు. కారణం ఏంటి, విషయం ఏంటని చూసినప్పుడు నరేంద్రమోడీ తీసుకువచ్చినటువంటి రైతు వ్యతిరేక చట్టాలు. వాటిని విరమించుకుంటామని చెప్పి పచ్చి అబద్ధాలు చెప్పి ఆ ఉద్యమాన్ని నీరుకార్చడం కోసం ప్రయత్నం చేశారు తప్ప దాన్నుండి పూర్తిగా విరమించుకోలేదు. దాన్ని అమలు చేయడం కోసం ఇంకా ప్రయత్నాలు చేస్తున్నాడు.

అదే విధంగా కార్మిక వర్గానికి సంబంధించి, వాళ్ళకి ఉన్నటువంటి హక్కుల్ని కాలరాయడం కోసం చట్టాలు చేస్తున్నారు. ఇవాళ మనం ఎదుర్కొంటున్న విషయాలు అడవిలో ఉన్నటువంటి అదివాసీలైనటువంటి అట్టడుగు వర్గం ఏదైతే ఉందో వాళ్ళని అక్కడి నుంచి వెళ్ళగొట్టడానికి చేస్తున్నటువంటి కుట్రలు అంతా ఇంతా కాదు. నిజంగానే మన దేశం సుసంపన్నమయిన దేశం. అన్ని వనరులు ఉన్నటువంటి దేశం. వాటిని ఎలా దోపిడీ చేయాలా అనే విషయంలో తలమునకలై అక్కడ జీవిస్తున్నటువంటి అక్కడ అడవులపై హక్కు కలిగినటువంటి ఈ ఆదివాసీలను అడవిలో నుంచి వెళ్ళగొట్టుట కోసం చేస్తున్నటువంటి దుర్మార్గపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కామ్రేడ్స్, మనం ఈ దేశ సంపదని ఈ దేశ పౌరులకు, ఈ దేశ ప్రజలకి ఉపయోగపడే పద్ధతుల్లో ఆ సంపదను ఉపయోగించమని అంటున్నాం. కానీ ఇక్కడున్న పాలకులు చేస్తున్న నిర్వాకం దాన్ని ఎట్లా ఎత్తుకుపోవాలా, ఎవరి ఇంట్లో కుప్పపోయాలా ఏ పద్ధతుల్లో దాన్ని ఉపయోగించుకోవాలా అని చూస్తున్నారు తప్ప, అమూల్యమైనటువంటి ఓటు హక్కుని వినియోగించి అధికారం ఇచ్చినటువంటి ప్రజల్ని వాళ్ళ బ్రతుకులను ఛిద్రం చేయడం కోసం పూనుకుంటున్నారు. నిజంగానే ఈ సంపదను కాపాడుకోవాలి. ఈ వనరులను కాపాడుకోవాలి. ఈ వనరులన్నీ కూడా మనవి, మనకు సంబంధించినవి. కానీ జరుగుతున్నటువంటి పరిణామం ఏంటి? అనేదానికొస్తే ఇవాళ ఓటును అమ్ముకుంటున్నారు మన జనం. ఓటును కొనుక్కుంటున్నారు బహుళజాతికి సంబంధించినటువంటి వర్గం. వాడికి ఎంతసేపూ దోచుకోవడం తప్ప ఇంకొకటి తెలవదు. మనం దోపిడీ కావడమేనా అనే ఆలోచన మనకు రావకపోవడం ఇక్కడ ఉన్నటువంటి విషయం. ఇక్కడ ఉన్నటువంటి వామపక్ష పార్టీలన్నీ కూడా ఏకం కావలసిన అవసరం ఉంది. ప్రజలందర్నీ మేలుకొల్పాల్సిన అవసరం ఉంది. ప్రజలు మేల్కొంటే, ప్రజలు ఆలోచిస్తే ప్రజలు చైతన్యవంతులు అయితే ఈ దోపిడీ వర్గానికి అడ్డుకట్ట వేయవచ్చు. అది చేయకుండా మనం ఇక్కడ ఎన్ని గంతులు వేసినా ఉపయోగం లేదు అనే విషయాన్ని మనం గమనించాలి. అందుకు వామపక్ష భావాలు కలిగినటువంటి కమ్యూనిస్టులందరూ కూడా ఈ ప్రజల తరపున పోరాడాల్సినటువంటి, పోరాట స్ఫూర్తితో ప్రజలను మేల్కొల్పాల్సినటువంటి అవసరం ఉంది. దేశంలో దొంగకు తాళం ఇచ్చినట్లుగా, ఆ దొంగలు పరిపాలన చేసి మన ప్రాణాలకు హాని చేసేటటువంటి వాళ్ళను అధికారంలోకి తెచ్చే దిశగా ఇవాళ పరిణామాలు కొనసాగుతున్నాయి. అందుకే కామ్రేడ్స్ ఇవాళ ఇక్కడ సదస్సు జరుపుకుంటున్నాం అంటే మనం ఇంతమంది ఇక్కడకు వచ్చామంటే, ఆ పాలకులకు వణుకు పుడుతున్నటువంటి పరిస్థితి, ఆ వణుకులో భాగంగానే మనల్ని ఇక్కడ నుండి తరిమేయాలని, ఎట్లా ఇక్కడ నుండి బయటకు పంపివేయాలా లేదూ ఇందాక మన కామ్రేడ్స్ చెప్పినట్లుగా జైళ్లకు పంపించాలా అనే దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారు. 1996లో ఎప్పుడో చేసినటువంటి చట్టం ఉండనే ఉంది. కానీ ఇక్కడున్నటువంటి సంపదను కొల్లగొట్టాలి అంటే సవరణ పేరుతో ఇంకో సంస్కరణగా తీసుకొని రావాలన్నటువంటి ఆలోచన చేస్తున్నారు. అటువంటి

ఆలోచనలు ఆ చట్టాలను సవరణ చేస్తే వచ్చేటటువంటి ముప్పేంటనే దానికి వస్తే, ఇక్కడ మనం జీవించలేము. ఇక్కడ మన దగ్గరుంటున్నటువంటి అటవీ సంపద మనకు మిగలదు. అందుకే ఈ సంపదను కొల్లగొట్టడం కోసం చేస్తున్నటువంటి కుట్రలు, కుతంత్రాలు ఇక చాలు అని చెప్పాల్సిన అవసరం ఉంది. ఆ విధమైనటువంటి పద్ధతుల్లో ప్రజలందర్నీ చైతన్యవంతులను చేయాలి. దేశ ప్రజలందర్నీ మేలుకొల్పాలి. ఇవాళ ఈ ఆదివాసీల పేరుతోటి ఎన్ని చట్టాలు చేశారు. ఆనాడు 200 సం॥లు పరిపాలించిన బ్రిటీషోడు చట్టాలు చేశాడు. ఆనాడు జరుగుతున్నటువంటి పోరాటాల ఫలితంగా వచ్చినటువంటి చట్టాలు ఉన్నాయి. ఇవాళ ఇక్కడ జరుగుతున్న పోరాటాల ఫలితమే 1/70 చట్టం. ఇక్కడ జరిగిన పోరాటాల ఫలితమే, వచ్చినటువంటి ఆదివాసీల హక్కుల చట్టం. ఇవన్నీ కూడా చట్టాలు చేయడం, దాని కోసం పోరాడుతున్నటువంటి వాళ్ళని, సద్దుమణిగించడం కోసం, బుజ్జగించడం కోసం, వాళ్ళ ఉధృతిని నీరుగార్చడం కోసం చేస్తున్నటువంటి చర్యలు తప్ప ఎక్కడైనా వాటిని అమలు చేశారా? అమలు జరుగుతున్నాయా అంటే లేదు. ఆ చట్టాలను ఖచ్చితంగా అమలు చేయమంటున్నాం. ఆ చట్టాల రూపకల్పన ఏదైతే ఉందో ప్రజలకు, ఆదివాసీలకు ఉపయోగపడేటటువంటిది. ఆ ఉద్దేశంతో చేస్తున్నటువంటి చట్టాలను చాప కింద పెట్టేస్తున్నారు. వాళ్ళు విచ్చలవిడిగా దోపిడీ విధానాలను ప్రదర్శించుతున్నటువంటిది మనం చూస్తున్నాం. ఆదివాసీల అటవీ హక్కుల చట్టం కూడా, ఆనాడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోజు ఉన్నటువంటి అవకాశాన్ని వినియోగించుకోవడానికి, ఆ ప్రజల ఓట్లను కాజేయడానికి చేసినటువంటి ప్రయత్నమే తప్ప దాన్ని అమలు చేసి, ఆదివాసీలకు ఉపయోగపడే పద్ధతుల్లో చేయలేదు. ఇయాళ జరుగుతున్నటువంటిది ఏంటి? ఆ చట్టమేం చేసింది కాదు. దాన్ని మేం అమలు చేయాల్సిన అవసరం లేదని కెసిఆర్ నిండు అసెంబ్లీలో దాని కోసం మాట్లాడిన వాళ్ళను దూషిస్తూ మాట్లాడాడు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు భట్టి విక్రమార్క, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సున్నం రాజయ్య వాళ్ళు ఈ చట్టం గురించి మాట్లాడుతూ పోడు దున్నుకుని బ్రతికేటటువంటి ఆదివాసీ రైతులకు సంబంధించి మాట్లాడినప్పుడూ, మీరందరూ చేయబట్టి అడవి నాశనం అయ్యింది ఆ అడవిని కాపాడవలసిన అవసరం ఉంది అని చెప్పి కెసిఆర్ మాట్లాడటం జరిగింది. అడవిని నాశనం చేయడం కనబడుతుంది. కానీ ఆదివాసీల బతుకు మాత్రం ఆలోచించవు. ఆదివాసీలకు సంబంధించినటువంటి చర్యలు ఏమీ చేపట్టవు. మంచిది. అడవిని పెంచుదాం. అడవిని కాపాడుదాం. కానీ అక్కడ ఇప్పటిదాకా బ్రతుకుతున్నటువంటి వారి బ్రతుకుదెరువేంటో చూడాలి అనే ఆలోచనే రాదు. ఆ పద్ధతుల్లో తెలంగాణా రాష్ట్రంలో గానీ, ఆంధ్ర రాష్ట్రంలో గానీ పోడు దున్నుకొని బ్రతికేవాళ్ళకు ఏం చేస్తున్నారు, ఏం చేయబోతున్నారు అనేదానికి వస్తే, ఎంత సేపటికీ ఈ ఆదివాసీలకు బ్రతుకుదెరువైనటువంటి ఆ భూమిని, వాళ్ళందరికి పనిచేసుకోవడానికి పని కల్పించి, వాళ్ళు బ్రతకడానికి భూమి కల్పించి ఈ దేశానికి తిండి పెట్టేటువంటి రైతులను కాపాడుకోవడం కోసం చర్యలు తీసుకోమంటే అటువంటి ఆలోచనలు ఎవరికీ రావు. కానీ ఇప్పుడు ప్రజలకు మంచి అవకాశం దగ్గరికి వస్తోంది. ఎన్నికల టైం వచ్చేస్తోంది. ప్రజలందర్నీ మనం మేల్కొల్పాల్సినటువంటి, ప్రజలందర్నీ మనం నిలబెట్టాల్సినటువంటి అవసరం ఉంది. ఆ విధంగా వామపక్ష భావాలు కలిగినటువంటి మనందరం ఖచ్చితంగా రాబోయే ఎన్నికల్లో ఈ పాలకులకు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉంది. మన ఓటు 5 సం॥రాలు పని చేస్తుంది. కానీ వాళ్ళు డబ్బులు ఇస్తేనో, బుజ్జగిస్తేనో, భయపడితేనో, మరి ఇంకో రకంగా ఏదో ప్రయత్నం చేస్తే దానికి లొంగిపోతేనో, వెనకపడితేనో నిజంగానే ఎక్కడ వేసిన గొంగడి అక్కడలాగే మన జీవితాలు ఉంటాయి. అందుకే ప్రజలను మేల్కొల్పాల్సిన అవసరం ఉంది. ఈ ఆదివాసీల హక్కులైనటువంటి వాటిని కూడా సక్రమంగా అమలు చేయమని చెప్పి డిమాండ్ చేయవలసిన అవసరం ఉంది. చట్టాలు చేయడం కాదు. చాపకింద చుట్టడం కాదు. వాళ్ళ అవసరాలు ఏవైతే ఉన్నాయో వాళ్ళ సమస్యలు ఏవైతే ఉన్నాయో వాటిని పకడ్బందీగా నెరవేర్చాల్సినటువంటి అవసరం ఉందని చెప్పి డిమాండ్ చేస్తూ మనం ముందుకు పోవాలి. ప్రజలందర్నీ ముందుకు నడిపించాలి. ప్రజలందర్నీ ఉద్యమ రూపంలో నిలబెట్టాల్సినటువంటి అవసరం ఉందని తెలియజేస్తూ ఈ అవకాశం ఇచ్చిన అధ్యక్ష వర్గానికి విప్లవ అభినందనలు.... నమస్తే.

## కా॥ వై. కేశవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపి రైతు సంఘం



వేదిక మీద ఉన్న అధ్యక్షత వహించిన నాయకులు, ఇతర సోదర సంఘాల నాయకులు అందరికీ అభినందనలు. వేదిక ముందున్నటువంటి గిరిపుత్రులైన సోదరీ, సోదరులందరికీ నా వందనాలు. అఖిల భారత కిసాన్ సభ తరపున మీ అందరికి జేజేలు పలుకుతున్నాను. అడవి ఉంటేనే భూగోళం మీద పర్యావరణం కాపాడబడుతుంది. ఆ అడవిని కాపాడేది గిరిపుత్రులైనటువంటి గిరిజనులే. ఈ మాట మనం చెప్పేది కాదు. 2018లో ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం 2006 చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, ఆ చేయడానికి ఒక వాక్యం రాసింది. దేశానికి అవసరమైనటువంటి కలప, దేశానికి అవసరమైనటువంటి ఖనిజాలు, దేశానికి అవసరం అయినటువంటి సరుకులు అడవి నుంచి రావాల్సినంత రావడం లేదు. కాబట్టి అడవిని మన డిపార్టుమెంటులో కాకుండా ప్రయివేట్ కంపెనీలకు అప్పగిస్తే వాళ్ళు బాగా ఉత్పత్తి చేసి, దేశానికి ఇస్తారు అని చెప్పి ఒక వాక్యం రాశారు. 2006 చట్టం ఏం చెప్పింది? గిరిజనులకు భూమి మీద హక్కు కల్పించి పట్టాలు ఇవ్వమని చెప్పింది. కానీ ఈ చట్టంలో ఏం చెప్పారు? అడవి నుండి అవసరమైన ఉత్పత్తులు బయటకు రావడం లేదు. కాబట్టి అడవులను కంపెనీలకు అప్పచెబితే, ప్రభుత్వం జాయింట్‌గా గానీ, విడిగా గానీ కంపెనీలకు అప్పచెబితే అవసరమైనంత ఉత్పత్తులు బయటకు వస్తాయని చెప్పింది. అంటే భూమిని, వృక్షాలను, ఖనిజాలను, అక్కడున్న వనరులన్నింటిని వాళ్ళకు ధారాదత్తం చేయడానికి ఒకే

పేరాలో రాసినటువంటి ఉపోద్ఘాతం. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆజాదీ అమృతోత్సవం జరుపుతోంది. అంటే స్వాతంత్ర్యం వచ్చి 75 సం॥రాలు అయ్యింది. అమృతం కురుస్తుంది ప్రజల ముందని చెప్పి. ఏ ప్రజలకు కురుస్తుంది? గిరిజనుల పరిస్థితి ఏంటి? ఈ రోజున ఒక గిరిజన బిడ్డ పురిటి నొప్పులు పడుతూ ఉంటే, డోలీ కట్టుకొని మోసుకురావాల్సిన దుస్థితి ఇప్పటికైనా తప్పిందా? ఒక వ్యక్తికి సరైన వైద్యం లేదు, విద్య లేదు, ఎక్కడన్నా ప్రాజెక్టు కడితే నిర్వాసిత రైతులకి, గిరిజనులకు పునరావాసం పూర్తి చేయకుండా వారి మానాన వారిని వదిలేసినటువంటి దుస్థితి ఉన్నది. ఈ మధ్యనే పోలవరం నిర్వాసితులంత బెజవాడ వస్తే నేను అడిగితే వరద వచ్చి గోదావరి ఒడ్డున లక్ష కుటుంబాలు మునిగిపోతే మంచినీళ్ళ ప్యాకెట్ ఇవ్వడానికి కూడా ఆధార్‌కార్డు చూపిస్తే ఇచ్చారు. ఇది గిరిజనులకు వచ్చిన ఆజాదీకా అమృతోత్సవాలు. ఇలా చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ఉన్న చట్టాలను కూడా నిర్వీర్యం చేసి గిరిజనులను కూడా భూముల నుండి వెళ్ళగొట్టడానికి ప్రయత్నాలు అన్నీ చేస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రయత్నాలలో ఒక భాగంగానే మణిపూర్‌లో రగిలించిన హింసాకాండ – అక్కడ ఉన్న గిరిజనులను ఖాళీ చేయించడానికి ఆ భూములను కంపెనీలకు అప్పజెప్పడంలో భాగమే. అందువల్ల వీటన్నింటిని వ్యతిరేకించవలసిన అవసరం ఉంది. నేను ఒక్క విషయం చెబుతున్నాను. గిరిజనులు ఇప్పుడేదో చేస్తున్న పోరాటం కాదు. బ్రిటీష్‌వాడు వచ్చి ఆక్రమించిన తర్వాత తొలి పోరాటం, ప్రజా పోరాటం సంతాల్ తిరుగుబాటు. సంతాల్ గిరిజనులు 50 వేలమంది పోరాడారు. పాతిక వేలమంది ప్రాణాలు కోల్పోయారు. అనివార్యంగా సంతాల్ ప్రజలను గుర్తించే వరకు పోరాడారు. బ్రిటీష్ సైన్యాలు పారిపోవలసి వచ్చింది. సంతాల్ గిరిజనుల ముందు అటువంటి పోరాట చరిత్ర ఉంది. అంతేకాదు, బిర్సాముండా నాయకత్వాన జరిగిన పోరాటాన్ని అణచడానికి బ్రిటీష్‌వాళ్ళు ఎన్ని మార్గాలు అనుసరించారో ఏమిటో కూడా చరిత్ర చూస్తే తెలుస్తున్నది. అంతేకాదు, కొమరం భీమ్ ఉద్యమం, అల్లూరి సీతారామ రాజు ఉద్యమం ఇవి అన్నీ స్వాతంత్ర్యోద్యమం బాగా జరుగుతున్న కాలంలో జరిగి ఏ రకంగా బ్రిటీష్ పాదాల కింద నలిగిపోయాయో చూసాం. వీటిని ధిక్కరిస్తూ గిరిజనులు పోరాడారు. స్వాతంత్ర్యానికి ముందు మహారాష్ట్రలో గిరిజన మహిళలు అందరు కూడా దాసీలుగా భూస్వాముల ఇళ్ళలో, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్ళలో, జమీందారుల ఇళ్ళలో చేరిపోతే వాళ్ళను విడగొట్టడానికి గోదావరి పరులేకర్ నాయకత్వాన జరిగిన ఉద్యమం పెద్ద జయప్రదం అయినటువంటి ఉద్యమం. వేలాదిమంది మహిళల్ని ఇళ్ళు, వాకిళ్ళ నుండి బయటకు తీసుకువచ్చినటువంటి ఉద్యమం. ఇట్లాంటి ఉద్యమాలు గిరిజనులు నిర్వహించారు. ఈ రోజున ఈ భూములు కాపాడుకొనడానికి ఈ సభ సన్నాహం చేస్తోంది.

ఇక్కడ మరొక అంశము చెప్పదలుచుకున్నాను. ఈ రోజు గిరిజనులు ఒంటరిగా లేరు. మొన్న ఆగస్టు 24 ఢిల్లీలో, 540 రైతుకూలీ సంఘాలు, 12 అఖిల భారత ట్రేడ్ యూనియన్‌లు వాటి వెనుక ఉన్నటువంటి వేలాది సంఘాలతో కలిగి ఉన్నటువంటి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ కమిటీ సదస్సు జరిపింది. ప్రభుత్వం మీద పోరాటానికి సమాయత్తం చేసింది. పోరాటం చేసి హక్కులను సాధించుకోవడమా? లేక ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడమా? అనే సూత్రంతో ముందుకు సాగాలని పిలుపిచ్చి ఉన్నాయి. అందుకు ఈ రోజున రైతు సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలు, గిరిజన సంఘాలు, ఇతర వృత్తి సంఘాలు, ట్రేడ్ యూనియాన్ సంఘాలు ఉన్నాయి. అడవి పుత్రులైన గిరిజనులే కాదు. మైదాన ప్రాంత రైతాంగ ప్రజానీకంతో సహా ప్రభుత్వాన్ని నిలబెట్టగల్గిన సత్తా గల ఉద్యమం, ఢిల్లీ ఉద్యమం చూపించింది, నేర్పింది. దానికి అనుగుణంగానే కార్మికవర్గం కూడా ముందుకు వచ్చింది. కాబట్టి ఇదే అనువైన సమయం. ఈ ప్రభుత్వాన్ని ఓడించి, ఈ ప్రభుత్వాన్ని దించి తమ హక్కులను కాపాడుకొనడమా? ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడమా? వచ్చే ప్రభుత్వం దగ్గరైనా సాధించుకొనడమా? అనేక సమస్యలు ముందుకు వచ్చాయి. అందుకు ఈ రోజున జరుగుతున్నటువంటి సదస్సు వాటిపై పోరాడుతోంది. ఇంకా మనకు తెలియని అనేక సంఘాలు గిరిజనులలో పని చేస్తున్నాయి. మైదాన రైతాంగంలో పనిచేస్తున్నాయి. వ్యవసాయ కూలీలలో పనిచేస్తున్నాయి. వృత్తిదారులలో పని చేస్తున్నాయి. ఆయా సంఘాలన్నిటిని మరింత విస్తృతంగా కూడగట్టి ఈ పోరాటాలన్నీ గిరిజనులతో భుజం భుజం కలిపి ముందుకువెళ్ళాలి. కావున గిరిజనులు ఒంటరిగా లేరు. దానిని మనం గ్రామ గ్రామాన గిరిజనులలో, ఇతర రైతు వ్యవసాయ కార్మికులలోకి తీసుకెళ్ళి కూడగట్టాలి. ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళి కొనసాగించవలసిన అవసరం ఉంది. అందుకు ఈ సదస్సు మంచి సన్నాహంలో భాగం. ఈ సదస్సుకు పది రాష్ట్రాల నుంచి వచ్చారు అని సోదరి ఝూన్సీగారు చెప్పారు. ఈ పది రాష్ట్రాలకే కాదు. ఇంకా మిగిలిన రాష్ట్రాలకు కూడా విస్తృతంగా ఈ నినాదాన్ని తీసుకువెళ్ళాలి. ఈ విశాఖపట్నంలోనే కాదు. గ్రామ గ్రామాన, పల్లె పల్లెలలో గిరిజన పల్లెల్లో అన్నింటిలో కూడా ఈ నినాదం మారుమోగాల్సినవసరం ఉంది. ఇతర ప్రాంతాలలో ఉన్న రైతాంగాన్ని, రైతు కూలీలను, గిరిజనుల్ని, కార్మికుల్ని కూడగట్టి పైచేయి సాధించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు ఉన్నటువంటి పాలకవర్గం ఎంత దుర్మార్గమైనదో చూస్తూ ఉన్నాం. చిన్న ఉద్యమం, నోరు ఎత్తితే చాలు పోలీసుల్ని దించడం, అరెస్టు చేయడం, కేసులు లేకుండానే జైల్లో నిర్బంధించడం, ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఇప్పటికీ అనేక వందల మంది జైళ్ళల్లో మగ్గుతూనే ఉన్నారు. అటువంటి దానికి వ్యతిరేకంగా పోరాడటానికి సకల జనాన్ని సమీకరించుకొనేటువంటి కర్తవ్యం మన అందరి ముందుకు వచ్చింది. అందులో మా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, అఖిల భారత కిసాన్ సభ భాగస్వామి అవుతుందని మరోసారి మీ అందరికీ చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.

అడవిపై జీవించే హక్కు ఆదివాసీలకే

## కా॥ కెవివి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి, ఏపి రైతు సంఘం



**శ్రమజీవుల తోన....**
**ఉద్యమాల హోరులోన...**
**పుట్టిన పులి బిడ్డరా...**
**మన పోరు జెండా...**
**ఎర్రెర్రని జెండా...**

ఆ జెండా నీడలో ఈ రోజు జరుగుతున్నటువంటి ఆదివాసీ గిరిజన ఉద్యమం, ఈ సదస్సులో పాల్గొన్నటువంటి ఆదివాసీ అన్నలు, అక్కలు అందరికీ కూడా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పక్షాన, అఖిల భారత కిసాన్ సభ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నాను. మన ముందు ఈ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి బెంగాల్ నాయకురాలు, అత్యంత మహోధృతంగా మనందర్ని కూడా ఉత్తేజపరిచేట్లుగా ఉపన్యాసించారు. మిత్రులారా! నిజంగా ఈ రోజు నరేంద్రమోడీ ప్రభుత్వం గిరిజనులను, గిరిజన హక్కుల్ని హరిస్తూ, కార్పోరేట్‌లకు గిరిజన సంపదను, అటవీ సంపదని, అటవీ ప్రాంతాల్లో ఉండేటటువంటి ఖనిజ సంపదను దోచిపెట్టడానికే ఈ చట్టాలు చేసింది. గతంలోనే మన దేశ వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. ఈ దేశంలో ఉన్న రైతు సంఘాలు ఏకోన్ముఖంగా 270 రైతు సంఘాలు ఇంకా అనేక కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వీళ్ళందరూ కలిసి మూడు వ్యవసాయ చట్టాలు రద్దయ్యే వరకు ఆందోళన సాగిస్తామని చెప్పి పోరాటాన్ని కొనసాగించారు. సం॥ పైగా సాగినటువంటి పోరాటం ఏ దశకు చేరుతుందోనన్న భయాందోళనలు మనందరికీ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఒక పెద్ద నాయకుడు ముర్మ గారి స్థానం తర్వాతి స్థానంలో ఉన్నటువంటి వ్యక్తి, ఒకసారి మేము ఆయన్ని కలవడానికి వెళితే ఈ ప్రధానమంత్రి చాలా మూర్ఖుడు. అతను ఈ చట్టాలను రద్దు చెయ్యడు. ఏదైనా పునరాలోచన చేసి రైతు సంఘాల నాయకులు ఈ చట్టాలకు సవరణలు తీసుకొచ్చి అవి అమలు కాకుండా ఉండేటటువంటి పద్ధతులు ఏమైనా ఆలోచించండి అప్పుడు కాని అతను స్పందించడు అని చెప్పాడు. ఈ మాట అన్న నెలరోజులు కాకముందే ఉత్తరప్రదేశ్‌లో, మరో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలొచ్చాయి. ఎక్కడ ఈ రాష్ట్రాల్లో ఓడిపోతామేమోనని భయంతో నరేంద్రమోడీ ఈ దేశ ప్రజానీకానికి, రైతులకు క్షమాపణ చెబుతూ మూడు చట్టాలను రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించాడు. ఇది ఈ ప్రజలందరి విజయం కాదా? ఒక్క రైతు సంఘాలు, కార్మిక సంఘాలే కాదు. ఇవాళ మన సోదరులైనటువంటి గిరిజనుల యొక్క భాగస్వామ్యం కూడా ఉంది. అందువల్ల మిత్రులారా! ఇప్పుడు కేంద్రం తెచ్చినటువంటి చట్టం అటవీ సంరక్షణ చట్టంలో సవరణలు. ఏమిటి ఈ సవరణలు ఎవరిని ఉద్ధరించడానికి, గిరిజనుల హక్కులను కాపాడడానికి చేస్తున్నారా? ఆ గిరిజనులు ఏదైతే అటవీ భూములను సంరక్షిస్తున్నారో, అడవుల్లో ఉండేటటువంటి ఖనిజ సంపదలను కాపాడుతున్నారో వాళ్ళకు అండగా ఉండటానికి ఈ చట్టాలు చేశారా? కానే కాదు. మిత్రులారా! మనకు కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది మణిపూర్ వ్యవహారం. ఎవరైతే కుకీలు, నాగాలు అక్కడ గిరిజన ప్రాంతంలో ఉన్నారో, మైదాన ప్రాంతంలో ఉండే మరో తెగకు సంబంధించిన మైతీలను రెచ్చగొట్టి, కొన్ని వందల మందిని ఇప్పటికే హత్యలు గావించారు. ఈ ప్రభుత్వానికి నిజంగా సిగ్గు ఉంటే, నిజంగా ప్రజల మీద ప్రేమ ఉంటే నీ ప్రభుత్వాన్ని అక్కడ దించాలి, నీ సైన్యాన్ని అక్కడ నుంచి ఉపసంహరించాలి. ఏదైతే రోజూ మారణహోమం జరుగుతూ ఉందో, మైతీలకు తుపాకులు ఇచ్చి ఇంకొకళ్ళని కాల్చమంటారా? ఏం దౌర్భాగ్యమిది? ఈ దేశానికి పట్టినటువంటి ఈ దౌర్భగ్యాన్ని మార్చటానికి, పాలకుల నడ్డి విరగొట్టడానికి మనమందరం కూడా ప్రయత్నం సాగించాలి. ఆ రకంగా భవిష్యత్తులో గిరిజన హక్కులు కాపాడుకోవడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి కాన్‌స్టిట్యూషనల్ కాంటాక్ట్ పేరుతో కొంతమంది మేధావులందరూ ఈ చట్టం దేశానికి ప్రమాదం కాబట్టి ఈ చట్టాన్ని విత్‌డ్రా చేసుకోండని ఇప్పటికే లేఖలు రాశారు. ఇవాళ మేధావులే కాదు అందరూ మొన్న విజయవాడలో జరిగినటువంటి ఎస్‌కెఎం సదస్సులో ఇక్కడ పాల్గొన్న ఝూన్సీగారే ఒక తీర్మానం పెట్టారు. ఈ చట్టాలు ఏవిధంగా ప్రమాదకరమో, ఆ తీర్మానంలో చెప్పారు. ఆ తీర్మానాన్ని మేమందరం కూడా ఏకగ్రీవంగా ఆమోదించాం. రాబోయే రోజుల్లో ఈ చట్టాలను రద్దుచేసే వరకు, మనం ఏదైతే మూడు వ్యవసాయ చట్టాల రద్దు కొరకు ఎలా ఆందోళన కొనసాగించామో, అదే పద్ధతుల్లో ఈ గిరిజన హక్కులకు భంగం కలగకుండా ఈ గిరిజన ప్రాంతాల్లో ఉండేటటువంటి అడవులను రక్షించుకోనే దానికి, పర్యావరణాన్ని కాపాడుకునే దానికి అటవీ ప్రాంతాల్లో ఉండేటటువంటి ఖనిజ సంపదలను కాపాడుకునేందుకు మనందరం కూడా ముందుకు రావాలి. నిన్ననే జి 20 సదస్సు జరిగింది. పాపం మన ప్రధానమంత్రిగారు దాన్ని ఉపయోగించి నేను విశ్వగురువు అని చెప్పుకుంటున్నాడు. ఏమిటీ విశ్వ గురువు ఈ జి 20 దేశాల యొక్క ఆదాయాల్ని, తలసరి ఆదాయాల్ని ఒకసారి పరిశీలన చేస్తే ఈ 20 దేశాల కన్నా అట్టడుగు స్థాయిలో నీ ప్రభుత్వ హయాంలో ఇవాళ మన తలసరి ఆదాయం ఉంది. నిజంగా నువ్వు ఎలా బ్రహ్మాండంగా నేను అధ్యక్షత వహిస్తున్నానని చెప్పుకోవడం కాదు. నిజంగా సిగ్గుపడాలి ఈ ప్రధానమంత్రి. దాంట్లో మొట్టమొదటి తీర్మానంలో ప్రపంచవ్యాపితంగా జి20 దేశాలు కలిసి పర్యావరణాన్ని రక్షించడానికి దృష్టి సారించాలి. ఏమయ్యా ఇక్కడొక పక్క పర్యావరణాన్ని సర్వనాశనం చేయడానికి ఇవాళ చట్టాలు తయారు చేస్తావ్ నీ దేశంలో. కానీ జి20 దేశాల్ని కూడగట్టి పర్యావరణాన్ని కాపాడాలని నువ్వు తీర్మానాలు చేస్తావా? ఎవర్ని మభ్యపెట్టడానికి ఈ తీర్మానాలు చేస్తున్నావు? ఆలోచన చేయాలి మిత్రులారా! ఇందాక పెద్దలు రాయ్‌గారు మాట్లాడుతూ చెప్పారు. ఈ దుర్మార్గమైనటువంటి ప్రభుత్వాన్ని, ప్రజల హక్కుల్ని హరింపచేసేటటువంటి ప్రభుత్వాన్ని దించి తీరాలి. రాబోవు కొద్ది నెలల్లోనే మనం ఎన్నికలకు పోతున్నాం. ఇప్పటికే ప్రజలు ఆలోచిస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలొస్తాయా, ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని ఈ దేశంలో లేకుండా తరిమి కొట్టడానికి

ఏ విధంగా చేయాలా అని ప్రజలందరూ కూడా ఆలోచిస్తున్నారు. ఇక్కడ మేధావులు, గిరిజన సోదరులు, అన్ని వర్గాల ప్రజలు కూడా ఇవాళ అదే కోవలో మనం ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. రాబోయేటటు వంటి 2024 ఎన్నికలకు సమాయత్తం కావాలి. ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని, మతోన్మాదానికి ఊతం ఇచ్చేటటువంటి ప్రభుత్వాన్ని గద్దె దించటానికి, మన హక్కుల్ని కాపాడుకోవడానికి అందరం కలిసికట్టుగా ముందుకు రావాలి. ఏ ఉద్యమమైనా కమ్యూనిస్టులతోనే అది ప్రారంభం అవుతుంది. పోరాటాల ద్వారా చట్టాలు తెచ్చేది కమ్యూనిస్టులు, ఆ చట్టాల అమలుకు కూడా పోరాడేది మనమే. కాబట్టి భవిష్యత్తులో కూడా అదే పద్ధతుల్లో పోరాట కార్యక్రమాల్ని కొనసాగించడానికి మన పార్టీలు, రైతు సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలని, చేస్తామని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్వాహకులకు ధన్యవాదాలు... సెలవు.

## కా॥ వీరాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం



అధ్యక్షా, కామ్రేడ్స్, ఆదివాసీలకు స్వయంపాలన అధికారాలు లేకుండా మనము అడవులను రక్షించు కోలేము. ఎందుకంటే భారతదేశంలో 200 సం॥లు తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడినటువంటివాళ్ళు ఎవరైనా ఉన్నారు అంటే వారు గిరిజనులని ఆం.ప్ర. రైతుకూలీ సంఘం గర్వంగా చెబుతుంది. ఎందుకంటే అడవులను వ్యాపార అవసరాలకు అనుగుణంగా వాడుకోవటానికి చట్టాలు చేసి, ఆదివాసీలను అడవుల నుండి దూరం చేయాలని ఆనాడు తెల్లవాళ్ళు కంకణం కట్టుకొన్నారు. అందుకే నేనేమంటానంటే ఇవాళ నరేంద్ర మోడీ లాంటి వారికి వ్యతిరేకంగా పోరాడాలంటే భారతదేశంలో ఉన్నటువంటి అన్ని గిరిజన సంఘాలు, భారతదేశంలో ఉన్నటువంటి అన్ని విప్లవ పార్టీలు ఒక వేదిక మీదకి వచ్చి ఆలోచిస్తే తప్ప మనం అనుకున్నటువంటి హక్కులేవైతే ఉన్నాయో స్వయంపాలన గానీ, కొండపోడు గానీ, భూములు గానీ ఏవీ రక్షించుకోలేం. అందుకే మేం ఏమంటామంటే గిరిజనులకు ప్రత్యేక చట్టాలు కావాలి. ప్రత్యేక హక్కులు కావాలి. ఇవాళ భారతదేశంలో చట్టాల గురించి, ఆదివాసీల గురించి, ఆదివాసీ హక్కుల కోసం ఎవరైనా పోరాడితే, మాట్లాడితే ఉపా చట్టాలు, అర్బన్ నక్సల్స్ అని చెప్పి అనేక కేసులు పెట్టి సం॥ల తరబడి జైల్లో కుక్కుతున్నటువంటి పరిస్థితి. ఇవాళ భారతదేశంలో విప్లవ ఉద్యమాల గురించి మనకు తెలుసు, ఏ స్థాయిలో ఉన్నామో మనకు తెలుసు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏరకంగా వాటిని అణచివేస్తున్నాయో మనకు తెలుసు. కాబట్టి నేనేమంటానంటే సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి పార్టీ అనేక డిమాండ్స్ మీముందు ఉంచుతుంది. అనేక విషయాలు, స్వయంపాలన మంచి చెడులన్నీ కూడా నా దగ్గర ఉన్నాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన మీ అందరికీ సిపిఐ (ఎం-ఎల్) జనశక్తి తరపున విప్లవ ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ డి.ఆదినారాయణ, కార్యదర్శి, స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్



అధ్యక్ష వర్గానికి; భారతజాతి సంపదని, సంస్కృతిని కాపాడుతున్న, సుదూర ప్రాంతాల నుంచి వచ్చినటువంటి ఆదివాసీ ప్రతినిధులకు నాయకత్వం వహిస్తున్నటువంటి, వేదిక మీద ఉన్నటువంటి నాయకులకు అభినందనలు. ఇక్కడ విశాఖలోనే పెద్ద సదస్సు జరగడమనేది చాలా గర్వించదగ్గ విషయం. ఎందుకంటే మోడీగారు గత సంవత్సరం విశాఖ నగరంలోనే జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు లక్షల మందిని పోగేస్తే ఎక్కడైతే ఛత్తీస్‌ఘడ్ నుండి విశాఖ అదానీ పోర్టుకి ఆరు రోడ్ల మార్గం వేసి మొత్తం ఖనిజ సంపదను లాజిస్టిక్ బిజినెస్ చేయాలని చూస్తున్నారు. మొత్తం అడవులను ధ్వంసం చేసి అడవుల్లో ఉన్నటువంటి సహజ వనరులు అన్నింటిని భారతదేశం నుండి తరలించే వ్యాపారం చెయ్యాలని శంకుస్థాపన చేశాడు అన్నమాట. అటువంటి ప్రదేశంలోనే మనందరం ఇక్కడ సమావేశం అవుతున్నామంటే ప్రధానమంత్రిగారికి అర్థం కావాలి. మన విశాఖ ఉక్కుది పెద్ద పోరాట చరిత్ర. విద్యార్థులు, యువకులు 32 మంది బలయ్యారు. 26 వేల ఎకరాల భూమిని రైతులు దానం చేశారు. కేవలం 460 కోట్లకు ఛత్తీస్‌ఘడ్ నుంచి ఐరన్‌ఓర్ గనులు ఇస్తామన్నారు. గనులు ఇవ్వలేదు. కానీ 26 వేల మంది నిర్వాసితులు అయినారు. ఇక్కడ పెద్దలందరికీ తెలుసు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, పోలవరం నుంచి గోదావరి జలాలని విశాఖకు తేవాలని 66లోనే కమ్యూనిస్టులు పోరాటం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని సుదీర్ఘ పోరాటాలు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ద్వారా పారిశ్రామికంగా కొన్ని లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పి పోరాట యోధులు అందరూ అంగీకరించి విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేశారు. 26 వేల ఎకరాల్లో 20 మిలియన్ టన్నులు కర్మాగారం పెట్టాలన్నారు ఆ రోజు. కర్మాగారం పెట్టినప్పుడు తప్పకుండా పర్యావరణాన్ని కాపాడాలి. ఈ పొల్యూషన్ కంట్రోల్ కావాలని చెప్పి ఒక టన్నుకి ఒక చెట్టు పెంచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. అటువంటి చట్టాన్ని ఉల్లంఘించి ఈ రోజు భూములమ్ముకోండని చెపుతున్నారు. ఇక్కడి నిర్వాసితుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు 8000 మందికి ఉపాధి దొరికింది. ఇంకా 8000 వేల మంది పాచి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. 4500 కోట్ల రూపాయల పెట్టుబడి పెడితే ఇవాళ 4 లక్షల కోట్ల రూపాయల ఆస్తి అయ్యింది విశాఖ స్టీల్ ప్లాంట్. ఎక్కడిదంటే ఈ సంపద 32 మంది అశువులు బాశారు. ప్రజలు పోరాటాలు చేశారు,

ఈ సంపద వాళ్ళది. అదే సంపదలో విశాఖ ఉక్కు కర్మాగారంలోనే 4500 మంది రిజర్వేషన్స్‌తో, అందులో ఆదివాసీలు 1500 మంది కార్మికులు ఉన్నారు. భారతదేశంలో ఏ ఒక్క పరిశ్రమలో కూడా 1500 మంది ఆదివాసీలు ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం దొరకలేదు. అదే ఆదివాసీ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రపంచమంతా ఉద్యోగాలు చేస్తున్నారు. ఉన్నత చదువులు చదువుతున్నారు. మరి ఆరోజు ఆ పోరాటాలు చెయ్యబట్టే ఈ ఫలితాలు వచ్చాయి. ఇటువంటి పరిశ్రమని పెద్దఎత్తున మోడీ గారి ప్రభుత్వం అదానీకి అప్పజెప్పి మొత్తం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మూసివేస్తామని చెప్పి పార్లమెంటులో చెబుతున్నారు. దానికి వ్యతిరేకంగా 945 రోజుల నుండి పోరాడుతున్నాం. రాష్ట్రంలోని ప్రజలందరూ పోరాడు తున్నారు. ముందుతరం వారు త్యాగాలు చేశారు కనుకనే ఇవాళ ఈ పోరాటాన్ని నిలబెట్టాం. విశాఖ కర్మాగారానికి 4500 కోట్ల రూపాయలు ఇస్తే 4 లక్షల కోట్ల ఆస్తి పెరిగింది. 10 లక్షల మంది విశాఖ, ఉత్తరాంధ్రలో బ్రతుకుతున్నారు. ఇవాళ ఇది మూస్తే 10 లక్షల మంది ఎక్కడికి పోవాలి? కొంతమంది పాలకులు ఉద్యోగుల సమస్య అంటున్నారు. ఉద్యోగస్తులలో చాలా మందికి విఆర్‌లు ఇచ్చి, అనేక పరిశ్రమలు మూసివేశారు. ఇంటికి పోతారు పావలా, రూపాయి ఇచ్చి, కార్మిక చట్టాలు ఉన్నాయి గనుక. కానీ ఇవాళ షాపుల్లో పనిచేసే వాళ్ళు కానీ మంగలి గాని, చాకలి గానీ ఇంకా అనేక లక్షల మంది విశాఖను వదిలి వలసలు పోవాల్సివస్తుంది. మన రాష్ట్రంలో ఉన్న పాలకులు దాన్ని ఆలోచించడం లేదు. భారతదేశ సంపద, భారతదేశంలో పరిశ్రమలు ఉండాలంటే ఖచ్చితంగా ఖనిజ సంపద ఉండవలసిందే. ఆ ఖనిజ సంపద ఉంటేనే భారతదేశంలో స్వయం సమృద్ధి, సంపాదన, పరిశ్రమలు వస్తాయి. ఈరోజు మనకు పోలవరం ప్రాజెక్టు వస్తే జలవిద్యుత్ కేంద్రాలు చాలా పెట్టొచ్చు. మన రాష్ట్రంలో, దేశంలో ఉన్నటువంటి నదుల్ని అన్నింటిని కాపాడు కుంటే అనేక జలవిద్యుత్ కేంద్రాలు వస్తాయి. ఇవాళ మణిపూర్‌ని ఎందుకు తగలబెట్టాలి. ఇదేమైనా పాలకులు ఆలోచిస్తున్నారా అంటే ఆలోచించడం లేదు. తప్పకుండా ఆదివాసీలు, కార్మికులు, మనకున్నటువంటి మేధావులు రానున్నకాలం 2024 ఎన్నికల్లో మోడీ గారిని ఇంటికి నెట్టాలి. భారతదేశాన్ని రక్షించి, భారతదేశం యొక్క సంపదను కాపాడాలి. చివరిగా ఏదైతే విశాఖ కర్మాగారం ఉందో దానికి మీరందరూ, అనేక పార్టీలు కలిసి సమైక్యంగా పోరాడు తున్నాం. నిర్వాసితులంతా కలిసి పోరాడుతున్నాం. ఈ రోజు జరుగుతున్న సదస్సులో ఇవాళ ప్రజా ఉద్యమంగా మార్చడానికి కావాల్సినటువంటి తీర్మానాన్ని కా॥ ఝాన్సీ గారికి ఇస్తాము. తప్పకుండా మనం విశాఖ కర్మాగారాన్ని కాపాడుకుందాం. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం. అన్ని రాష్ట్రాల ప్రజలు ఉద్యోగులుగా ఈ ప్లాంట్‌లో ఉన్నారు. ఇది ఆంధ్రుల యొక్క త్యాగం – కమ్యూనిస్టుల యొక్క త్యాగం, పోరాట ఫలితంగా ఉన్నటువంటి విశాఖ కర్మాగారాన్ని మనం కాపాడుకోవాలి. ఇవాళ జార్ఖండ్ రాష్ట్రంలో ఉన్నటువంటి స్టీల్ ప్లాంట్‌ను 79 పంచాయితీలకు చెందిన గిరిజనులందరూ కలిసి ఏ ఒక్కర్ని కూడా రానీకుండా అడ్డుకుంటున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని 950 రోజుల నుండి అదానీ కాదు కదా మరియెవ్వర్ని కూడా రానీకుండా విశాఖ ప్రజలందరూ కలిసి పోరాడుతున్నాం. మనం భుజం భుజం కలిపి, ఏదైతే బిజెపి ప్రభుత్వం ఉందో దాన్ని మనం తరిమికొట్టవలసిన అవసరం ఉంది. భారతదేశ సంపదని ఇవాళ మేకిన్ ఇండియా అంటాడు లేకపోతే భారత్ అంటాడు. కానీ ప్రజలంతా ఒక్కటే భారతదేశంలోని ప్రజలకు కావాల్సింది త్రాగునీరు, సాగునీరు, తిండి, బట్ట, విద్య, వైద్యం అందించాలని పోరాడేటటువంటి సంస్థలేమున్నాయంటే ఆదివాసీ సంఘాలున్నాయి. ఆదివాసీ సంఘాలతో పాటు విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు ఐక్యం అయ్యి, ఈ సదస్సు జయప్రదం చేయటంతోపాటు విశాఖ ఉక్కుని, భారత సంపదని, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి పూనుకోవాలి. అందరం సమైక్యంగా పోరాడుదామని చెప్తూ సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ పి.ఎస్. అజయ్‌కుమార్,

### అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, ఏఐఏఐకెఎస్



మిత్రులారా, అటవీ హక్కుల చట్టం కింద ఆ భూమిలో సాగులో ఉన్నటువంటి ఆదివాసీల పట్టా హక్కులు క్లెయిమ్ చేయడానికి అవుతుంది. అది రిజర్వు ఫారెస్ట్‌గా మారకపోయినా, సోషల్ ఫారెస్ట్‌గా మారకపోయినా ఫారెస్ట్‌గా ప్రకటించ దలచుకున్నాము అని చెప్పిన కారణంగా దాన్ని అటవీ భూమిగా ఆ చట్టం గుర్తిస్తుంది. అయితే సమస్య ప్రభుత్వానికి వస్తుంది. ఒకసారి అటవీ భూమిగా గుర్తించిన తర్వాత దాన్ని అటవీయేతర భూమిగా మళ్ళించాలంటే ఇదిగో ఈ 1980 చట్టం అడ్డంకిగా మారుతుంది. అందుకోసం లైన్ క్లియర్ చేయడం కోసం సెక్షన్ 4 నోటిఫికేషన్ కింద ఉన్నటువంటి భూము లన్నింటినీ కూడా ఎలాంటి ఆటంకమూ లేకుండా పరిశ్రమల అవసరాల కోసం ప్రభుత్వం తీసుకోవాలనేది దీని ఉద్దేశం. ఇక మనవాళ్ళు చెప్పారు అటవీ సంరక్షణ చట్టము ఎక్కడైనా అటవీ భూమిని సెక్షన్ 4 నోటిఫికేషన్ కింద ఇచ్చినా సెక్షన్ 15 రిజర్వు ఫారెస్ట్ నోటిఫికేషన్ కింద ఇచ్చినా, సెక్షన్ 24 సోషల్ ఫారెస్ట్ నోటిఫికేషన్ కింద ఇచ్చినా ఏ భూమినైనా సరే అటవీ స్వభావం నుంచి అటవీయేతర స్వభావం కింద మార్చాలంటే ప్రభుత్వం ఖచ్చితంగా ఈ పద్ధతులు పాటించాలి అని చెప్పి ఈ చట్టం 1980లో వచ్చింది. ఆ చట్టం రాక ముందు, అప్పటివరకూ అటవీ భూములు ఎంత మారాయని చూస్తే కోటి ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వం సునాయాసంగా అటవీయేతర అవసరాలకు మళ్ళించగలిగింది. 1980లో ఈ చట్టం వచ్చిన తర్వాత ఇప్పటికీ 43 సం॥లలో కేవలం 25 లక్షల ఎకరాలు మాత్రమే అది మార్చగలిగింది. అందువలన ఇది అడ్డంకిగా వాళ్ళకి కనిపిస్తుంది. అంటే డీమ్డ్ ఫారెస్ట్ భూమిలోకి ఎంటర్ అవ్వాలి. ఈ ప్రవేశించడానికి అటవీ, పర్యావరణ చట్టాలు అడ్డంకిగా ఉండకూడదు. మూడోది మనందరికీ తెలుసు పోడు

భూములకు పట్టాలిచ్చే అటవీ హక్కుల చట్టం. ఈ అటవీ హక్కుల చట్టం కూడా అడ్డంకిగా మారిందని గుర్తించారు. ఏమిటి అడ్డంకిగా మారింది? ఒకసారి అటవీ భూమిగా నోటిఫై అయిన తర్వాత రిజర్వ్ ఫారెస్ట్ కానీయండి, డీమ్డ్ ఫారెస్ట్ లేదా సోషల్ ఫారెస్ట్ కానీయండి. ఒక్కసారి అది అటవీ భూమి అని చెప్పి దానికి నామకరణం జరిగితే, ఖచ్చితంగా అటవీ హక్కుల చట్టం కింద ప్రొసెస్ కంప్లీట్ చేయాలి. గ్రామసభ అనుమతి కావాలి. అందుకోసం వాళ్ళకు అది అడ్డంకిగా కనిపించింది. ఇక మూడో అడ్డంకి 1996 సం॥లో టిఎన్ గోదావర్మన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు తీర్పులో సుప్రీంకోర్టు ఇంకొక అడుగు ముందుకేసింది. అసలు ఒక భూమిలో అటవీ భూమి అని పేరు పెట్టారా లేదా సంబంధం లేదు. సెక్షన్ 4 కింద చెప్పారా, సెక్షన్ 24 కింద చెప్పారా సంబంధం లేదు. రికార్డులో అడవిగా ఉంటే, దాన్ని మీరు అడవిగా భావించాలి. ఎప్పుడైతే అలా చెప్పారో ఉదాహరణకు మా ఊరి దగ్గర ఒక కొండ ఉంది. ఆ కొండ నిండా ఒక అడవి ఉంది. కానీ అది రిజర్వ్ ఫారెస్ట్ కాదు. సోషల్ ఫారెస్ట్ కాదు, డీమ్డ్ ఫారెస్ట్ కాదు. రెవెన్యూ రికార్డులో చూస్తే పోరంబోకు అని ఉంటుంది. మరి మైనింగ్ పర్మిషన్ ఇవ్వొచ్చా? ఇవ్వకూడదు. ఎందుకోసం రికార్డులో ఏమున్నదనేది కాదు. భూమి మీద ఏముంది? భూమి మీద అడవి ఉంది కాబట్టి దాన్ని అటవీ భూమిగా భావించాలి. అటవీ చట్టాలన్నీ మళ్ళీ అడ్డంకిగా మారుతాయని చెప్పి సుప్రీం కోర్టు 1996లో ఇచ్చిన జడ్జిమెంట్ వాళ్ళకి అడ్డంకిగా మారింది. ఆఖరిలో మరొక అడ్డంకి అది పంచాయితీరాజ్ షెడ్యూల్ ఏరియా ఎక్స్‌టెన్షన్ యాక్ట్ కింద షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అటవీ భూమైనా, అటవీ భూమి కాకపోయినా మైనర్ మినరల్‌కి సంబంధించి ఏ చర్య తీసుకోవాలన్నా గ్రామసభ అనుమతి కావాలి. అది అడ్డంకిగా మారింది. అందుచేత ఈ అడ్డంకులన్నిటినీ తొలగించడం కోసం వాళ్ళు ఒక్కొక్క దాన్ని నరుక్కుంటూ రావడం మొదలు పెట్టారు. నిజానికి ఇవన్నీ కూడా ఒక దానికి ఒకటి లింక్ అయ్యి ఉన్నాయి. వాటిన్నింటినీ సోదాహరణగా చర్చించడానికి మనకి సమయము సరిపోదు. కానీ మళ్ళీ నేనొకసారి లిస్ట్ అవుట్ చేస్తాను. అటవీ చట్టం 1927, అటవీ సంరక్షణ చట్టం 1980, టిఎన్ గోదావర్మన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి జడ్జిమెంట్, అటవీ హక్కుల చట్టం, పంచాయతీరాజ్ షెడ్యూల్డ్ ఏరియా ఎక్స్‌టెన్షన్ యాక్ట్. ఈ ఐదింటిలో ఆదివాసీలకు ఇవ్వబడిన హక్కులు దానికి ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ ఈ హక్కులన్నింటినీ ఒకదాని తర్వాత ఒక దాన్ని తీసివేసి బుల్డోజ్ చేసేసి, బుల్డోజర్ గవర్నమెంట్ కదా, కార్పోరేట్ కంపెనీలకు అటవీ ప్రాంతాల్లోకి ఆదివాసీ ప్రాంతాల్లోకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలనేది మోడీ సర్కార్ యొక్క ఉద్దేశం. అందుకోసం వారు స్టెప్ బై స్టెప్ వెళుతున్నారు. అది వాళ్ళ ప్రణాళిక స్పష్టంగా కనబడుతుంది, దానికి వ్యతిరేకంగా మనం ఏం చేయాలి. నేను మూడు సూచనలు వారి ముందు పెట్టాను. ఒకటి భారతదేశంలో ఉండే రైతు సంఘాలు, ఆదివాసీ సంఘాలు అన్ని కలిపి ఒక వేదికగా తక్షణం తమతమ విబేధాలను పక్కనపెట్టి ఈ ఐదు విషయాల మీద ఒక దగ్గరకు రావాల్సి ఉంది. రెండు ఇప్పుడు ఇండియా అలియన్స్ ఏర్పడింది కాబట్టి మనందరం కలిసి వాళ్ళకు ఒక పేపర్ సబ్మిట్ చేసి ఈ మోడీ గవర్నమెంట్ ఇలా చేయబోతుందీ, ఇండియా అలియన్స్‌గా మీరు ఏం చేస్తారు అని డిమాండ్ చేయవలసి ఉంది. అక్టోబర్ 2 గాంధీ జయంతి జరపబోతున్నటువంటి సందర్భంలో మనం పర్యావరణ అంశాన్ని తీసుకొని మొట్టమొదటిగా అన్ని ప్రాంతాల్లో ఉమ్మడిగా ఈ 5 అంశాలపైన కార్యక్రమాలను రూపొందిస్తే బాగుంటుందని మీ అందరికీ సూచిస్తూ సెలవు తీసుకుంటున్నాను. జై ఆదివాసీ!

## కా॥ శంభు మహతో,

### ఏఐకెఎంకెఎస్ నాయకులు, జార్ఖండ్



స్వాతంత్ర్యం మన భారత దేశానికి రాకముందు ఆదివాసీలనే వాళ్ళు సామ్రాజ్యవాదానికి, ఫ్యూడల్ శక్తుల యొక్క దోపిడీకి గురయ్యారు. స్వాతంత్ర్యం వచ్చింది అని చెప్పుకున్న తర్వాత స్వాతంత్ర్యం పేరుతోటి ఆదివాసీలను రక్షిస్తాం అనే పేరుతోటి రకరకాల చట్టాలు చేశారు. మా ఊరులో మా రాజ్యం గానీ, ఇంకా అనేక రకాలైన అటవీ రక్షణ చట్టాలు గానీ, ఇవన్నీ పేరుకే చేశారు. ఆ చట్టాలు కూడా అక్కడ ఆదివాసీలు చేసినటువంటి అనేక ఉద్యమాల ఫలితంగా వచ్చినవే. అలాగే డా॥ బిడి శర్మగారి లాంటి మేధావులందరూ కూడా ఇక్కడ 'మా ఊర్లో మా రాజ్యం' అనేటువంటి నినాదం చేశారు. ఈ చట్టాల వలన కొన్ని సదుపాయాలు వచ్చినా కూడా ఈరోజు జార్ఖండ్‌లో ఉండే పరిస్థితి ఏంటంటే సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఉండేటటువంటి బహుళజాతి సంస్థలన్నీ కూడా అక్కడ దోచుకుతింటున్నాయి. అక్కడుండేటటువంటి మొత్తం ఖనిజ సంపదలు అన్నీ కూడా వాళ్ళ చేతుల్లోనే, వాళ్ళ స్వాధీనంలోనే ఉన్నాయి. కనుక ఇప్పుడు మనం అది మార్చుకోవాలని, అంటే దాని నుండి మనం బయటపడాలి అని, అంటే ఇక్కడి సామ్రాజ్యవాదానికి, వలస శక్తులకు, ఫ్యూడల్ శక్తులకు ఉన్నటువంటి సంబంధాలను మనం అర్థం చేసుకొని, ఈ రెండింటిని ప్రధాన శక్తులుగా ఎంచి, వాటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున మనం ఉద్యమం చేసినప్పుడే ఆదివాసీల సమస్యల పరిష్కారం కానీ, ఆదివాసీల హక్కులు గానీ వస్తాయి తప్ప ఈ సమాజాన్ని విడగొట్టేసి కేవలం ఆదివాసీ హక్కులంటే మనకు ఏం రాదు. వీటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు అని మైదాన ప్రాంత ప్రజలు అనుకుంటే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదు. ఆదివాసీల సమస్యలైనా, మైదాన ప్రాంత సమస్యలైనా ఈ అర్థవలస, అర్థఫ్యూడల్ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. కనుక మనందరం కలిసి ఆవైపుగా సామ్రాజ్యవాదానికి, ఫ్యూడల్ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ఆ పోరాటాల్లోనే ఆదివాసీలకు విముక్తి అనేటువంటి విషయాన్ని చెప్తూ, పోరాట అభినందనలు తెలియజేస్తున్నాను.

# బహిరంగ సభ

## కా॥ గుర్రం విజయ కుమార్, జాతీయ అధ్యక్షులు, ఏఐఎఫ్‌టియు (న్యూ)



సభాధ్యక్షులు, వేదికపై ఉన్నటువంటి వివిధ సంఘాలకు సంబంధించినటువంటి నాయకులు అలాగే ఈ సభకు విచ్చేసినటువంటి ఆదివాసీ మిత్రులు, అలాగే ఇతర ప్రజా సంఘాల మిత్రులు అందరికి అభినందనలు. ఇంకొక ఏడెనిమిది మాసాల్లో భారతదేశంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికల్లో ఓట్లు వేసేవాళ్ళందరూ ఓట్లు వేస్తారు. ఓట్లు వేసేటటువంటి వాళ్ళల్లో ఒక పాలక పార్టీని ఎన్నుకునేటటువంటి వాళ్ళు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. పాలకులందరూ ప్రజాస్వామ్యానికి గుర్తుగా ఎన్నికల గురించి మాట్లాడుతున్నారు. 5 సం॥లకొకసారి పాలకవర్గాల్లో ఎవరు పరిపాలించాలన్న దాన్ని ఎన్నుకోవడం ప్రజాస్వామ్యానికి అత్యద్భుతమైన చిహ్నంగా, గుర్తుగా పాలకులు మాట్లాడుతున్నారు. అయితే ఒక ఏడెనిమిది మాసాల్లో జరగబోతున్న ఎన్నికలు మన ముంగిట ఉన్నప్పటికీ, ఆ ఎన్నికల్లో ప్రజల అవసరం తెలుసుకోకుండా ముఖ్యంగా ఆదివాసీల అభిప్రాయం తెలుసుకోకుండా ఆదివాసీలను అడవి నుండి గెంటివేసేటటువంటి, ఆదివాసీలను వాళ్ళ పంట భూముల నుండి, ఆదివాసీలను వాళ్లు పుట్టిన స్థలాల నుండి, వాళ్ళు నివాసం ఉంటున్నటువంటి ఇళ్ళ నుండి, గుడిసెల నుండి గెంటివేయడానికి కావలసినటువంటి అటవీ హక్కుల చట్టంలో సవరణలను పాలకులు హడావిడిగా ఆమోదించారు. పార్లమెంటులో గొడవలు జరుగుతున్నాయి, ఆ గొడవలకు వ్యవధి ఇవ్వాలి. చట్టం ప్రకారం ఇవ్వాలి. సాంప్రదాయం ప్రకారం ఇవ్వాలి. కానీ ఆ గొడవలను పరిష్కరించకుండా పాలకులు ఆ చట్టాలను ఆమోదించారు. దాన్ని వాళ్ళు అమలు జరపబోతున్నారు. ఇవాళ భారతదేశంలో అనేక ప్రజాస్వామిక అంశాలు ఉన్నటువంటి చట్టాలు ఆదివాసీ ప్రజానీకమో, కార్మికవర్గమో, రైతాంగమో పోరాడి సంపాదించుకున్నటువంటి హక్కులు. అటువంటి హక్కుల్ని రద్దు చేసేటటువంటి పనిలో పాలకులు ఉన్నారు. ఆ పనిలో భాగంగా కార్మికవర్గం హక్కుల్ని సమాధి చేసేలా 44 చట్టాల్లోని హక్కుల్ని రద్దు చేస్తూ, ఆ హక్కుల స్థానంలో కార్మికవర్గం వేతన బానిసలుగా పని చేయాల్సినటువంటి నాలుగు రకాల కోడ్‌లను తెచ్చారు. అట్లాంటి ప్రక్రియలో భాగంగానే ఈ చట్ట సవరణ చేశారు. అడవిపైన ఆదివాసీలకు తప్ప ఇంకెవరికీ హక్కు లేదు, ఆదివాసీకి తప్ప ప్రభుత్వానికి హక్కు లేదు, ఆదివాసీకి తప్ప పరాయివాడికి హక్కు లేదు అని అనేక సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులను కూడా ఖాతరు చేయకుండా, ఆ హక్కులకి పంగనామాలు పెట్టే విధంగా కొత్త సవరణలు తీసుకొచ్చారు. ఆ విధంగా పాలకులు సామ్రాజ్యవాదులకి, బహుళజాతి సంస్థలకు, వాళ్ళకి తోడుగా ఉండేటటువంటి వ్యాపార సంస్థలకి, పారిశ్రామిక సంస్థలకి భారతదేశంలోని అన్ని రంగాల్ని, అన్ని ప్రాంతాల్ని, దేశ వనరులన్నింటిని, ఆఖరికి శ్రమశక్తిని వాళ్ళ పాలు చేయడానికి చట్టాలన్నింటిలో మార్పులు తెస్తున్నారు. చట్టాలు వాళ్లకు అవసరం లేనిచోట వాళ్ళు ఇష్టం వచ్చినట్లు పరిపాలన చేయడానికి పూనుకుంటున్నారు. దాంట్లో భాగమే ఈ ఆదివాసీ హక్కుల చట్టాల్లోని మార్పులు. కనుక ఇవాళ భారతదేశంలోని ప్రజలు – వాళ్ళు కార్మికులు కావచ్చు, రైతులు కావచ్చు, ఆదివాసీలు కావచ్చు, యువజనులు కావచ్చు, వాళ్ళు మరొక తరగతికి చెందిన ప్రజానీకం కావచ్చు – వాళ్ళందరూ కలిసికట్టుగా పోరాడితేనే వాళ్ళ మనుగడ కొనసాగుతుంది. లేకపోతే వాళ్ల జీవితాలను విధ్వంసం చేసి పాలకులు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు దేశ సంపదలన్నింటిని సామ్రాజ్యవాదులకు, బహుళజాతి సంస్థలకు దేశంలో ఉన్నటువంటి కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి పూనుకున్నారు. ఆ పూనుకున్న పాలకుల చర్యలను ప్రశ్నించడానికి మనం అందరం కదులుతున్నాం. దాంట్లో భాగంగానే ఇవాళ మనం అడవిపైన ఆదివాసీలకు మాత్రమే హక్కు ఉంది ఇంకెవరికీ హక్కు లేదు అని చాటి చెప్పడానికి జల్, జంగిల్, జమీన్ ఆదివాసీదే అని చాటి చెప్పడానికి ఈ సదస్సును జరుపుకున్నాం. ఈ సదస్సును జరుపుకోవటం ద్వారా ఆదివాసీ హక్కులని మనం చాటుతున్నాం. ఆదివాసీ హక్కులని మనం సమర్థిస్తున్నాం. కనుక ఈ పాలకులకు ఇప్పటికైనా ఏమైనా ఇంగితం ఉంటే, వాళ్ళు దురాక్రమణకొచ్చారని భావించుకొని మన వాళ్ళ ఆస్థులను ఆక్రమించడానికి, మన వాళ్ల జీవనాధారాన్ని ధ్వంసం చేయడానికి వాళ్ళు వచ్చారన్నది భావించుకొని ఈ చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలి. వాళ్ళు ప్రజలందరి హక్కుల్ని కబళించడానికి కాకుండా తిరిగి ప్రజల హక్కుల్ని పునరుద్ధరించడానికి పూనుకోవాలి. రైతు చట్టాలను వాళ్ళు వెనక్కి తీసుకున్నారు. కానీ రైతు చట్టాలను వెనక్కి తీసుకున్నప్పటికీ పాత చట్టాలను వాళ్ళు అమలు జరుపడానికి కావాల్సిన చర్యలు తీసుకోవడం లేదు. అట్లానే కార్మికులందరూ కలిసి పాత 44 చట్టాలను పునరుద్ధరించమని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయమని అడుగుతున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరుతున్నట్లుగా చేయడానికి సిద్ధంగా లేదు. అలాగే, ఈ ఆదివాసీ హక్కుల చట్టాలలో తీసుకొచ్చిన మార్పులను, సవరణలను రద్దు చేయమని మనం అడుగుతున్నాం. అడిగినప్పటికీ ఈ ప్రభుత్వాలు చేస్తాయన్నటువంటి నమ్మకం లేదు. ఈ ప్రభుత్వం ఈ చట్టం యొక్క సవరణలు తీసుకొస్తున్నప్పుడే ఆదివాసీ హక్కుల్ని గౌరవించాలని కానీ, ఆదివాసీ చట్టాలను (పాత) గౌరవించాలని కానీ ఈ పాలకులకు లేదు. ఈ ప్రభుత్వాలకు లేదు అని మనం గమనించవచ్చు. ఈ పరిస్థితులలో జల్, జంగిల్, జమీన్ మనదేనని చెప్పి, అడవి పైన సర్వహక్కులు ఆదివాసీలవేనని చెప్పి, భారతదేశంలో ఉన్నటువంటి అన్ని అడవుల పైన ఆదివాసీలకే హక్కులు ఉన్నాయి, ఇంకెవరికి హక్కులు లేవనే విషయాన్ని పాలకులు గుర్తించే దాకా, పాలకులచేత గుర్తింపచేసేదాక మనం సంఘటితంగా పోరాడుదాం. ఈ పోరాటంలో కార్మికవర్గం కూడా మీకు తోడుగా ఉంటుందని, ఏఐఎఫ్‌టియు(న్యూ) మీకు తోడుగా ఉంటుంది. మీ పోరాటం విజయం సాధించాలని,

మీరు ఆందోళన పథంలో, పోరాట పథంలో మరింత ముందుకు సాగాలని నేను కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ జె. కిషోర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి, ఏఐఎఫ్‌టియు(న్యూ)



సభకు హాజరైన మిత్రులారా! వేదిక మీది కామ్రేడ్స్! గిరిజనులు అడవి మీద తమకున్నటువంటి హక్కుని కోల్పోతున్నారు అన్న అంశం ఈ రోజు జాతీయ మీడియాలో ప్రధానమైనటువంటి అంశం కావాలి. రైతు వ్యతిరేక చట్టాల్ని చేసినప్పుడు ఢిల్లీ చుట్టూతా పంజాబ్, హర్యానా, ఉత్తరాది రైతులందరూ కూడా కూడి ఢిల్లీలో ప్రభుత్వాన్ని నిగ్గదీశారు. నిలేశారు. దాని భగ్నం చేయడానికి ఎత్తుగడలు ప్రభుత్వం చేసింది, అయినా రైతాంగం నిలబడింది. ఇప్పుడు దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కందిపప్పు, ఉప్పు, చింతపండు, నిన్నటిదాకా టమాటాలు 200 రూ॥ అమ్మినాయి. ఇవి ఏమీ ప్రధాన మీడియాలో చర్చనీయాంశం కావడం లేదు. కేంద్రం ఇప్పుడు ఇండియా అనే పేరు ఉంచాలా, భారత్ అనే పేరుకు మార్చాలా అనే విషయంపై చర్చిస్తుంది. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడ్ని ఎట్లా అరెస్టు చేసి జైల్లో పెట్టారో అనే విషయం చుట్టూతా, దానికి అనుకూలంగా లేక వ్యతిరేకంగా మీడియా అంతా విడిపోయి నడుస్తూ ఉంది. సగటు మనుషుల సమస్యలేవీ, దేశ ఆర్థికవ్యవస్థకు సంబంధించి, వ్యవసాయానికి సంబంధించి లేదా పరిశ్రమలకు సంబంధించినటువంటి ఏ అంశాలు కూడా ఈ రోజు ప్రధాన మీడియాకు చర్చనీయాంశాలు కాకపోవడం అన్నది విషాదకరమైన విషయం. 155 లక్షల కోట్ల అప్పుని మోడీ ప్రభుత్వం ఈ రోజు మన ప్రజల ముందుంచింది. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాతనే 90 లక్షల కోట్ల అప్పు చేశాడు. జగన్ ప్రభుత్వం 7.44 లక్షల కోట్ల అప్పు చేశాడని పురందేశ్వరీ ప్రకటించింది. అందువలన ఈ అప్పులన్నీ ఎవరు తీర్చాలి? అసలు దేశానికి ఇంత అప్పులు ఎందుకు అవుతున్నాయి? అదానీలాంటి, అంబానీలాంటి వాళ్ళ ఆస్తులు లక్షల కోట్లకు పెరుగుతూ ఉంటే, వాళ్ళు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరుతూ ఉంటే మరి ప్రజలెందుకు దరిద్రులవుతున్నారు? ఇది మనం వేస్తున్నటువంటి ప్రశ్న. “ఈ దేశం ఎవడిదిరా ఈ దేశం మనదేరా” అని చనిపోయిన గద్దర్ ఒక పాట పాడేవాడు. మనం వేస్తున్న ప్రశ్న అదే. ఈ దేశం అదానీలదా, అంబానీలదా, టాటాలదా, బిర్లాలదా, పెట్టుబడిదారులదా లేక ప్రజలదా? కష్టం చేస్తున్నదంతా మనం. సంపదలన్నీ వాళ్ళు జేజిక్కించుకుపోతున్నారు. 1947 తర్వాత 75 ఏళ్ళు పరిపాలన చేసిన తర్వాత ఇప్పటికి కూడా ఈ దేశంలో స్వదేశీ పరిశ్రమలు ఎన్ని ఉన్నాయో, సొంత కాళ్ళ మీద ఎంత నిలబడుతున్నామో పరిశీలించాలి.

ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది అని రష్యావాడు ప్రకటించగానే మనకు ఇక్కడ ఆయిల్ ప్యాకెట్‌ల మీద 20 రూ॥ రేటు పెరిగింది. రెండోవైపు నుండి రష్యా తన చమురు అమ్ముడుపోక మన దేశానికి పెట్రోల్, డీజిల్‌ని దిగుమతి చేసింది. ఆ పెట్రోల్, డీజిల్‌ని ఎవరికిచ్చారు? మనకి 110 రూ॥ పెట్రోల్ అమ్ముతుంటే, రష్యా నుండి గానీ పెట్రోల్ మనకు ఇచ్చుంటే, అది మనకు 70 రూ॥లకి వచ్చి ఉండేది. కానీ మోడీ ప్రభుత్వం ఎవరికిచ్చింది? ఆ పెట్రోల్‌ని రిలయన్స్ వాడికి, నయారా అనే కంపెనీవాడికిచ్చి వాళ్ళు ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవడానికి తద్వారా లక్షల కోట్లు సంపాదించుకోవడానికి వాళ్ళకు అవకాశం ఇచ్చింది. అందువల్ల ప్రభుత్వాలు మొత్తంగా ప్రజలను బలి చేస్తూ ప్రజల దైనందిన సమస్యలను, ప్రజల ఉద్యోగాలు గానీ, ఉపాధి గానీ ప్రజలకు సంబంధించినటువంటి నిత్యావసర సరుకుల ధరలు వంటి వేటినీ కూడా పట్టించుకుంటున్నటువంటి పరిస్థితి లేదు. రైళ్ళన్నీ ఈ రోజు వలస కూలీలతో నిండిపోతూ ఉన్నాయి. గిరిజన ప్రజానీకం అడవుల్లో బ్రతకలేక అడవుల నుండి బయటకు వచ్చి కూలీలుగా వలసలు పోతున్న పరిస్థితి ఉంది. అందువల్ల ఈ రోజు మన ప్రశ్న అడవులను అటవీయేతర కార్యకలాపాలకు ఇవ్వాలా? వద్దా? ఇవ్వొద్దూ అని గిరిజనులంతా కోరుతూ ఉన్నారు. ఈ దేశ అభ్యుదయవాదులంతా, పర్యావరణవేత్తలంతా కోరుతూ ఉన్నారు. అడవిని అడవిగా రక్షించుకోలేనటువంటి దుస్థితి వలనే ఈ రోజు గ్లోబల్ వార్మింగ్ లాంటి హెచ్చరికలు ఉన్నాయి. సెప్టెంబర్ వచ్చినా కూడా ఈ నెలలో కూడా ఎసిలు లేకుండా ఇళ్ళల్లో పడుకోలేనటువంటి దుస్థితి. దేనికారణంగా? అడవులను నాశనం చేసుకుంటున్నటువంటి కారణంగా. ఇప్పుడు ఈ చట్టం వస్తే ఇంకా పెద్ద ఎత్తున లక్షల హెక్టార్ల అటవీ భూమిని పరిశ్రమలకు, అటవీయేతర అవసరాలకి కేటాయించడానికి కావలసినటువంటి అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. అందువల్ల సగటు మనుషులను పట్టించుకోని దోపిడీ పాలకులలకు వ్యతిరేకంగా మనం సంఘటితం కావాలి. రైతాంగం, కార్మికవర్గం, గిరిజన ప్రజానీకం, అట్టడుగున ఉన్నటువంటి కులాలు, అట్టడుగున ఉన్నటువంటి మతాలు, అట్టడుగునున్నటువంటి పేద ప్రజలు అందరం కలిసి ఈ పాలకవర్గాలకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవ అవగాహనతోటి మనం “దున్నే వాడికే భూమి” అన్న నినాదంతోటి ‘జల్, జంగిల్, జమీన్ హమారా హై’ అనే గిరిజన నినాదంతోటి ఈ రోజు ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవలసినటువంటి అవసరం ఉంది. దాని కోసం అందరం పూనుకుందామని చెప్పి, ఈ ఉద్యమానికి కార్మికవర్గం తరపున ఏఐఎఫ్‌టియు(న్యూ) మద్దతుంటుందని చెప్పి తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

**అడవి, భూమి, నీరుపై ఆదివాసీలదే హక్కు**

**కా॥ ఎస్.ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షులు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**



అధ్యక్షా! కామ్రేడ్స్

ఇక్కడ మనం ఆదివాసీ సమస్యల మీద ఒక జాతీయ సదస్సు ఈ రోజు, రేపు కూడా జరుపుకోబోతున్నాం. ఈ సదస్సు ప్రధానంగా దేని మీద జరుగుతున్నది, ఏమిటి అనే విషయం ఉదయం నుంచీ మీరు వింటూ వున్నారు. మనందరికీ అర్థం అయినటువంటి విషయమే. అదే అటవీ సంరక్షణ చట్టానికి సంబంధించినటువంటి కొన్ని సవరణలు కేంద్ర ప్రభుత్వం చేయటం తోటి మొన్న పార్లమెంటులో అంటే అక్కడి రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ ఆ చట్టాన్నీ ఆమోదించారు. ఇంకా ముర్ముగారు సంతకం పెట్టారో లేదో మనకు తెలియదు. కానీ కొన్ని రోజుల తర్వాత అది చట్టం అయిపోతుంది. అయిపోయిందని వాళ్ళు ప్రకటిస్తూ ఉన్నారు. ఈ చట్టం వల్ల జరిగేటటువంటి నష్టం ఏమిటీ అనే విషయాన్ని చూసుకుంటే ప్రధానంగా మూడు విషయాలను మనం గమనంలోకి తీసుకోవాలి. ఆదివాసీలు నాడు బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి, అడవి సంపదనంతా వాడు లాక్కుంటుంటే అది కాదు మేము కూడా బ్రతకాలి. మా సంపద మాకు కావాలి. మీరు ఎక్కడ నుంచో వచ్చారు. మీ యొక్క పాలన కింద మీ యొక్క దోపిడీ కింద ఉండేదేలేదు. మేము పోరాటం చేసి మొత్తం అడవిలో ఉండి, అడవిలో జీవిస్తాం. అడవి సంపద మా హక్కు, జీవనాధారం. మీకు ఇచ్చేది లేదు అని 1927కి ముందు నుంచి కూడా పోరాడినటువంటి చరిత్ర భారతదేశంలో ఆదివాసీలకుంది. ఆనాటి నుంచి ఈ నాటికీ కూడా ఆ సమాజంలో అడవిలో, అడవి సంపదలో మేం జీవిస్తాం, జీవిస్తూ ఆ సంపదని మేం కాపాడుతాం. మాక్కూడా అక్కడున్నటువంటి నీరు మీద, భూమి మీద, సంపదలన్నిటి మీద హక్కు ఉంటుంది. వాటిని మేం నాశనం చెయ్యం. మేము వాటిని సంరక్షిస్తాం, మేం మా జీవితాలను కాపాడుకుంటాం, మేము ఆత్మగౌరవంతో జీవిస్తాం అనే విషయాన్ని చెబుతూ ఆదివాసీలు సంవత్సరాల కొలది పోరాడుతున్నారు. ఒక ప్రక్కన ఆ పోరాటాలను రక్తపుటేరులలో ముంచుతూనే, మరోప్రక్కన అక్కడక్కడ బుజ్జగిస్తూ, అక్కడక్కడ కొన్ని కొన్ని నామమాత్రపు చట్టాలను చేసుకుంటూ వస్తున్నారు. అయితే కామ్రేడ్స్ ఏ చట్టం చేసినా ఏ చట్టాన్ని అమలు చేయాలని చెప్పినా కూడా ఒక భయంకరమైనటువంటి, భీకరమైనటువంటి ఉద్యమాల ద్వారానే ఆ చట్టాలు సాగుతూ ఉన్నాయి. చట్టాలను అమలు చేయాలని చెప్పేటువంటిది కూడా చేస్తావా లేదా అన్నటువంటిదానికి కూడా ఉద్యమాలే అవసరంగా ఉన్నాయి. ఉద్యమిస్తే తప్ప ప్రజల హక్కుల్ని గుర్తించే పాలకులు లేరు అనేటటువంటి విషయాన్ని చరిత్ర మనకు తెలియజేస్తుంది. అయితే మనం ఇప్పుడు ఈ సదస్సు ఎందుకు పెట్టుకున్నాం ఏమిటి అన్న విషయాన్ని చూసుకుంటే ఒక్కసారి మీకు గుర్తు చేస్తాను. ఈ రోజు భారతదేశం అంతా కూడా హడావిడిగా ఉంది. అదేమిటంటే ఎవరు అధికారంలోకి రావాలి, ఎవరికి ఎన్ని సీట్లు రావాలి, ఎవరు ఎవర్ని కొనుక్కోవాలి. అన్నటువంటి దానిపై కిందామీదా పడుతూ ఉన్నారు. కానీ వాళ్ళెవరికీ కూడా ఈ దేశంలో ఉండేటటువంటి పేద ప్రజల సంపద ఏమిటి? ఎందుకు అక్కడుండేటువంటి రైతాంగం పోరాటం చేస్తున్నారు? ఢిల్లీలో సంవత్సరం కాలంపాటు వర్షానికి, ఎండకి, చలికి చచ్చిపోయి, ఎంతో మంది జబ్బుపడి ఆ పోరాటం చేసారు. మోడీగారు మీరు చేసినటువంటి మూడు నల్ల చట్టాల్ని వెనక్కు తీసుకుంటారా లేదా లేకపోతే మేము ఢిల్లీ వీధుల నుంచి మేం కదిలేది లేదు అంటూ భీష్మించారు. అక్కడే కాదు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అంటే అటు కేరళ నుండి మొదలుపెడితే ఇటు ఉత్తరప్రదేశ్, ఉత్తర భారతదేశమంతా కూడా రైతాంగం పెద్దఎత్తున కదిలింది. నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటారా లేదా అని చెప్పి ఒక పోరాటం సాగింది.

ఇది ఒక పోరాటం అయితే, మరి భారతదేశంలో ఉండేటటువంటి పెద్ద పెద్ద ప్రైవేటు, పబ్లిక్ సంస్థలన్నింటిల్లో పనిచేసే కార్మికులకు సంబంధించినటువంటి వాళ్ళ హక్కుల్ని కాలరాస్తూనే 4 లేబర్ కోడ్‌లను పెట్టి ఇంక ఇక్కడ మీకేమీ చట్టాలు వర్తించవు. మీరేమీ సమ్మెలు చేయడానికి వీలు లేదు, మీరు యూనియన్‌లు పెట్టడానికి వీలులేదు అని చెప్పి మరొక చట్టం చేశారు. మరోప్రక్కన ఓడరేవులు, విమానాశ్రయాలు వంటి వాటన్నింటినీ కూడా బహుళజాతి సంస్థలకి, ప్రైవేటు సంస్థలకు "నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్" అని ఒక విధానం తీసుకొచ్చి, వాటి ద్వారా ఎక్కడికక్కడ ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేస్తున్నటువంటి పరిస్థితి. బాధాకరమైన విషయం ఏంటంటే ఈ రోజు మనం విశాఖపట్నంలో ఈ మీటింగ్ జరుపుకుంటున్నాం. చాలా మంది వచ్చినటువంటి వాళ్ళు విశాఖ చాలా అందంగా ఉంటుంది, సుందరంగా ఉంటుంది. విశాఖని మేం చూద్దాం, తిరిగొద్దాం అనుకుంటున్నాం. కానీ కామ్రేడ్స్ మరొక 5 సంవత్సరాలు అయిన తర్వాత సముద్రాన్ని చూడటానికి మనల్ని వెళ్ళనివ్వరు. ఎందుకంటే పోర్టుని అమ్మేస్తున్నారు. విమానాశ్రయాన్ని కొంత అమ్మేశారు. అది కాకుండా చక్కటి ఎత్తైనటువంటి ఆంధ్రదేశంలోనే పేరు ఉన్నటువంటి ఈ కొండల్ని కూడా ప్రైవేటు వాళ్ళకు అమ్మేస్తున్నారు. ఇక వాటి దగ్గరకు ఎవరూ కూడా వెళ్ళడానికి వీలులేదు. ఈ రోజు ఇక్కడ ఊరేగింపు తీయొద్దని పోలీసోళ్ళు చెప్పారు. పాపం రేపు ఆ పోలీసుల్ని కూడా అక్కడ వాళ్ళు తీసుకున్నటువంటి అడవుల దగ్గరికి మీరు కూడా ఇక్కడికి రావడానికి వీలులేదు. మా పోలీసులు మాకున్నారు, మా సెక్యూరిటీ మాకుంటుంది. అడవి వైపు మీరు చూడటానికి వీలులేదు అనేటు వంటిది ఒక భయంకరమైనటువంటి చట్టాన్ని, దుర్మార్గమైనటుంటి విధానాలను ఇప్పుడున్నటువంటి ఈ పాలకులు తీసుకురాబోతున్నారు. విశాఖ ఏజెన్సీ అడవిలో ఉండేటటువంటి సంపదలను, గనులను, బాక్సైట్‌ల వంటి వాటన్నింటిని అమ్మివేస్తున్నారు. అన్నింటికంటే విచార కరమైనది ఏమిటంటే 50 సం॥ల నాడు 32 మంది అమరులై ఇక్కడి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పోరాడి సాధించుకుని, అక్కడ పని చేస్తూ ఉంటుంటే ఈ విశాఖ స్టీల్ ప్లాంట్ కూడా మీకు అవసరం

లేదు, మేం ప్రైవేటు సంస్థలకు అమ్మివేస్తున్నాం అని చెప్పారు. అమ్మివేశారు కూడా, బయటకు చెప్పే సాహసం లేదు. ఇవి ప్రజలు ఈ రోజు ఎదుర్కొంటున్నటువంటి ప్రధానమైనటువంటి సమస్యలు. మరి ఇంతటితోటే కాకుండా కార్మికులు, రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, ఆదివాసీలు, మహిళలు ఇంతమంది ఇన్ని సమస్యలు ఎదుర్కొంటూ ఉంటే పాలకులు ఏం చేస్తున్నారు. మీ పార్టీ వాళ్ళు ఈ ప్రజల సమస్యలు పట్టించుకోవడానికి, ఈ ప్రజల సమస్యల గురించి చర్చించడానికి మీకు సమయం లేదా? మరి 20 సం॥లు అయ్యింది పోలవరానికి సంబంధించిన దాంట్లో ప్రాజెక్టు కడతామన్నారూ, ప్రజల్ని గెంటేశారు. 3 లక్షల మంది ఆదివాసీలు అక్కడ నుండి బయటకు వచ్చేస్తే వారి పునరావాసం ఏమిటి? ఈరోజు 70% లేక 80% మందికి అక్కడ భూములు లేవు, ఇళ్ళు లేవు, భృతి లేదు. మరి ఏమైనట్టు? రేపు ఏం చేయాలి వీళ్ళందరూ. అంటే ఇక్కడ మనకొకటే ప్రశ్న. ఎన్ని పార్టీలు గుద్దుకుంటున్నా, మన ప్రజల యొక్క సమస్యలను చర్చించు కునేటటువంటి పార్టీలు ఏమున్నాయి. వాళ్ళు ఏం చేస్తున్నారు. ప్రజలను దోచుకుంటున్నారా లేకపోతే, ప్రజల సమస్యలను వీళ్ళు పట్టించుకుంటున్నారా వీళ్ళు ప్రజల సమస్యలకు చెబుతున్నటువంటి పరిష్కారాలేంటి? అని అంటే. ఏమీ లేదు. కుల తగాదాలు, కులాలు పెట్టి కొట్టుకోండి, తెగలకు తెగలకు మధ్య గొడవలు పెట్టి కొట్టుకోండి లేకపోతే ఆదివాసీలకు దళితులకు మధ్య గొడవలు పెట్టి కొట్టుకోండి, లేకపోతే మహిళలను అవమానపరచండి, కించపరచండి, నగ్నంగా ఊరేగించండి. ఇక ఏ మహిళ కూడా ఇది నా హక్కు అని చెప్పి రోడ్డు మీదకు రావడానికి వీలులేనటువంటి పద్ధతుల్ని ఈ పాలకులు కల్పిస్తూ ఉంటుంటే 75 సం॥ల ఈ స్వాతంత్ర్య భారతదేశంలో ప్రజలందరూ చాలా చక్కగా ఉన్నారు. ఆనందంగా ఉన్నారూ అని చెప్పి, ఎసి రూముల్లో కూర్చుని మాట్లాడుతూ ఉంటుంటే ప్రజలు వినాలా? చూడాలా? నమ్మాలా? ఏం చేయాలి? ఈ రోజు మనం చెప్పుకుంటే ఎవ్వరికీ ప్రశాంతత లేదు. ఉద్యోగస్థులు, కార్మికులు, రైతులు, ఆదివాసీలు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరు కూడా తమ సమస్యలతోటి సతమతమౌతున్నారు. అయితే ఆ సమస్యలు ఎందువలన వస్తున్నాయి? ఎక్కడ మనం పోరాటం చేయాలి? ఇప్పుడు పాలకులు మనకు ఏం చెపుతున్నారు? మన కష్టాలు ఏమిటనే విషయం మనకు అర్థం కానటువంటి అయోమయ పరిస్థితి ఉంది. అందుకే కామ్రేడ్స్ రోజూ ఏదో ఒక మూల విద్యార్థులు, మరొకప్రక్క రైతులు, మరొక దగ్గర మహిళలు, వేరొక దగ్గర కార్మికులు, ఇంకొక దగ్గర అప్పులపాలైనటువంటి పేదవాళ్ళు; ఎక్కడో ఒక చోట ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. చచ్చిపోతూనే ఉన్నారు. దానికి ఎవ్వరూ ఏమీ పట్టించుకోలేనటువంటి పరిస్థితే కనిపిస్తుంది. కనుక ఇటు ఈ పరిస్థితి ఉంటే మరొక వైపు డబ్బులు సంపాదించుకొని వేల లక్షల కోట్ల రూపాయలు సంపాదించుకుంటు న్నటువంటి వాళ్ళు మా భవిష్యత్తుకు ఏం ఫర్వాలేదు. మా పిల్లలకేమీ ఫర్వాలేదు అని అనుకుంటున్నారు. మాదొకటే ప్రశ్న పర్యావరణ మనేటువంటిది సర్వనాశనం అయ్యింతర్వాత రేపు మీకు డబ్బులున్నా మీ పిల్లలకు నీరిస్తారా? మీ పిల్లలకు గాలి ఇస్తారా? మీ పిల్లలకు ఒక ఆరోగ్యకర వాతావరణం ఇస్తారా? మీ పిల్లలకు ఒక సరైనటు వంటి సంస్కృతి ఇవ్వగలుగుతారా? అంటే ఏమీ చెయ్యలేరు. దేశాన్ని, రాష్ట్రాన్ని వీళ్ళంతా కూడా సర్వనాశనం చేసి దోచుకుంటూ పోతూ ఉన్నారు. కనుక కామ్రేడ్స్ ఇప్పుడు దేశం చాలా కష్టకాలంలో ఉంది. కష్టకాలంలో ఉండేటటువంటి పేద ప్రజలందరూ ఎంతటి కష్టాలు పడుతున్నారో, ఆ కష్టాలకి ఈ రాజ్యాంగంలో గానీ, ఈ పాలకుల పరిపాలనలో గానీ ఎక్కడ కూడా పరిష్కారాలు దొరకడం లేదు. కనుక ఎక్కడ పరిష్కారం దొరుకుతుంది అంటే ప్రజలు చైతన్యవంతులై 'ఏం చేస్తున్నారు మీరు? మీరెందుకు ఇంత దోపిడీ చేస్తున్నారు? మా మీదెందుకు ఇంత దౌర్జన్యం చేస్తున్నారు? మీరు చేయడానికి వీలు లేదు. మేము సహించం, మిమ్మల్ని భరించం. తప్పకుండా మేము ఉద్యమిస్తాం, ముందుకెళ్తాం' అనే దగ్గర మనం నిర్ణయించుకుని ఒక పద్ధతిలో, మనకు కావాల్సిందేమిటి? మనం పోరాటం చేయాల్సిందేమిటి? దేన్ని వ్యతిరేకించాలి, ఎవర్ని తిట్టాలి. ఎవర్ని కొట్టాలి. ఎవడు మనవాడు, ఎవడు మన పేద ప్రజలకు సహాయపడేవాడు అనేటటువంటి విషయాన్ని నిర్ణయించుకొని ఒక చైతన్యంతో అందరం ముందుకెళ్ళాల్సినటువంటి అవసరం ఉందని చెప్పి తెలియజేస్తున్నాను. అదే విషయాలను చర్చించుకోవడం కోసం ఈ రోజు మనం ఇక్కడ సభ పెట్టాం. కనుక కామ్రేడ్స్ ఇక్కడికి వచ్చినటువంటి వాళ్ళు తప్పకుండా ఈ రోజు ఏం జరుగుతోంది. మన గ్రామాల్లో ఏం జరుగుతోంది. మన అడవి ఏమైపోతుంది. మన భూమి ఏమైపోతుంది. మన నీరు ఏమైపోతుంది అనేటటువంటి విషయాల్ని చాలా సీరియస్‌గా చర్చించి, ఆ వైపుగా ఉద్యమించడం కోసం ప్రతి ఒక్కరు కూడా చైత్యవంతంగా నడుస్తారని, ఆ చైతన్యం వైపు నడవడం తప్ప మరొక మార్గం లేదని చెప్తూ కామ్రేడ్స్ ముగిస్తున్నాను.

## **కా॥ శాంతి ముండా,** నక్సల్‌బరీ ఉద్యమ మహిళానాయకురాలు



ఇప్పుడు భారతదేశంలో అమలవుతున్నటువంటి రాజ్యాంగం ఏ మేరకు కూడా పేద ప్రజల వైపున లేదు, శ్రామికుల వైపున లేదు. ఎవరైతే వ్యవసాయ కూలీలుగా ఉంటారో లేకపోతే కౌలుదారులుగా ఉంటారో వాళ్ళవైపు అది లేదు. ఈ రాజ్యాంగం అనేటువంటిది కొంతమంది సంపన్నవంతుల చేతులలో ఉంది. మనం మన హక్కుల కోసం పోరాడి ఈ రాజ్యాంగంలో లేనటువంటి దాన్ని ఈ రాజ్యాంగం ఎవరి వైపుందో తేల్చుకునే విధంగా మనం పోరాటం చేసి, ఈ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, మన పేద ప్రజల వైపున, కార్మికుల వైపున, కర్షకుల వైపున ఉండేటటువంటి రాజ్యాంగం కోసం మనం పోరాడాల్సిన అవసరం ఉంది. ఇదే మీకు నేను ఇచ్చే సందేశం కామ్రేడ్స్.

## కా॥ గణేష్ పండా, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏఐఎఫ్‌టియు(న్యూ)



అధ్యక్షా! తోటి మిత్రులు, దూర ప్రాంతాల నుండి వచ్చిన అక్కలూ, అన్నలూ! అడవి హక్కులు సర్వనాశనం అవుతున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గాలు చేసింది, లంచగొండితనం అయ్యింది, కనుక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని బిజెపి చెపితే నరేంద్ర మోడీని అధికారంలో తీసుకొచ్చాం. బిజెపి అధికారంలోకి వస్తే, సం॥నికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది మందిని రోడ్డు మీద పెట్టారు. మీకందరికి తెలుసు. ఒకప్రక్క రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేయలేదు. మొత్తంగా చూస్తే 7 నిమిషాలకొక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారు. తర్వాత విద్యార్థుల సంగతి చూస్తే నూతన విద్యావిధానం తీసుకొచ్చి మీ అందరికి చదివిస్తానన్నారు. ఇప్పుడు చూస్తే అదానీ, అంబానీలకు విద్యారంగాన్ని అప్పగించడానికి తప్ప మనకు కాదు. మన జగన్‌మోహన్‌రెడ్డి కూడా మన రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారని మాట్లాడుతున్నారు. ఆ మెడికల్ కాలేజీలు ఏంటిరా అంటే ఈ మెడికల్ కాలేజీలు మనకోసం కాదు డబ్బులున్నోళ్ళకు తప్ప, సామాన్యులకు దాంట్లో ఎటువంటి అవకాశాలుగానీ, రిజర్వేషన్లు గానీ ఉండవని చెబుతున్నారు. అందుచేత ఈ పాలక వర్గాలను మొత్తం 75 సం॥లు మనం చూసి వచ్చాము. వీళ్ళందరూ తోడుదొంగలే తప్ప రెండోది కాదని మనందరం గుర్తుపెట్టుకోవాలి. కానీ చంద్రబాబును ఓడించాము, జగన్‌మోహన్ రెడ్డిని ఎక్కించాము. రేపు జగన్‌మోహన్ రెడ్డి పోతే ఏం చేస్తాము? భారత్ బచావో, భారత్ బచావో అంటే ఏమైనా మార్పు వచ్చిందా? కానీ మనం నేర్చుకోవసిందేమిటంటే పాలకవర్గాలు మారినంత మాత్రాన సమస్యలు ఎట్టి పరిస్థితుల్లో పరిష్కారం కావు. గతంలో చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక దేశంలో పబ్లిక్ సెక్టార్ పెట్టారని. ఈ పబ్లిక్ సెక్టార్ ఎవరి దగ్గరకు వెళ్ళింది అని ఆ రోజు నాగిరెడ్డిగారు చెప్పారు. బాగా దృష్టిలో పెట్టుకోండి భారతదేశంలో స్వాతంత్ర్యం రాలేదు. ఈ దేశంలో పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు స్వాతంత్రం వచ్చింది, మన కోసం కాదూ అని చెప్పారు. దానిలో భాగంగానే పబ్లిక్ సెక్టార్ పెట్టారు. ఈ పబ్లిక్ సెక్టార్ కూడా రేపో ఎల్లుండో ప్రైవేటు సెక్టార్‌కు వెళ్ళుతుంది అని అన్నా. ఇప్పుడు అదే రీతిలో భారతదేశంలో పబ్లిక్ సెక్టార్ అంతా సర్వనాశనం అయ్యింది. మన స్టీల్ ప్లాంట్ కూడా ఏమైంది? స్టీల్ ప్లాంట్ కూడా గతంలో మనది అయిపోయింది. మనమే పరిపాలిస్తున్నాము. కానీ ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ఏం అయ్యింది? ఈ స్టీల్ ప్లాంట్ కోసం మనం ఏం చెయ్యాలి? పబ్లిక్ లేక ప్రైయివేట్ సెక్టార్‌లో కార్మికులు బ్రతకాలంటే మార్గం ఏమిటి? కార్మిక కర్షకులతోటి మనం ఆందోళన చేయ్యాలి. సమస్యల పరిష్కారానికి ఆందోళన చేయాలి. ఆందోళనలు, నిరాహార దీక్షలు చేసి, ఫోటోలు తీసుకుంటే పబ్లిక్ సెక్టార్‌గా అవ్వదు. అన్నీ డ్రామాలు ఆడుతుంది ఎవరు? పాలకవర్గాలే డ్రామాలాడుతున్నాయి. నిన్న మొన్నటి దాకా ఏమైంది మన దేశంలో చూస్తే ఇప్పుడు అవసరమా? చంద్రబాడునాయుడు లేక జగన్‌మోహన్‌రెడ్డి వీళ్ళు తప్ప సమస్యలు లేవా రాష్ట్రంలో. దేశం కోసం పాలకవర్గాలు ఎవ్వరూ మాట్లాడటం లేదు. దేశంలో తినటానికి తిండి లేదు. కట్టుకోవడానికి బట్టలేదు. ఉండటానికి ఇల్లు లేదు. రైతులకు గిట్టుబాటు ధర లేదు. ఈ పాలకవర్గాలందరూ ఏం చేస్తున్నారని ప్రశ్నించాలి. ప్రతి ఒక్కరు అడగాలి ఈ పాలకవర్గాల విధానాలేంటని అడగాలి. రెండో పక్కన భారత బచావో అంటున్నారు. రేపు రాహుల్ గాంధీ గానీ, సోనియా గాంధీగానీ, రేపు ఏ పాలక వర్గాలైనాగానీ ఎవ్వరైనా దమ్ము ధైర్యంతో చెప్పగలుగుతున్నారా? రేపు మాకు ఓటు వేయండి. ఓటు వేస్తే పబ్లిక్ సెక్టార్‌ని ప్రయివేటు చేయము. ప్రయివేటు సెక్టార్ రద్దు చేస్తాము అని ఒక్కళ్ళు కూడా చెప్పగలుగుతున్నారా? కానీ అవేమి చెప్పరు. మాకు ఓటు వేయండి, మాకు గెలిపిస్తే మీకు ఏదో ఉద్ధరిస్తాం అని చెప్తారు. వీళ్ళంతా దొంగలు తప్ప ఇంకొకటి కాదు. అందుచేత వీళ్ళని నమ్మితే మనం మోసపోతూనే ఉంటాము. ఇప్పటికే 75 సం॥రాలు మోసపోయాము. అందుచేత బాగా ఆలోచించండి, పోరాటదారిలో మనమంతా కలిసికట్టుగా పోవాలని ఇంతటితో ముగిస్తున్నాను.

## కా॥ గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే



సభాధ్యక్షులు, వేదిక మీద ఉన్నటువంటి నాయకత్వం, ఈ సభకు వచ్చినటువంటి ప్రియమైన ప్రజలారా! అన్నలారా! అక్కలారా! ఈ రోజు మనం జరుపుకుంటు న్నటువంటి ఈ సభ రాబోవుకాలానికి విజయసంకేతం కావాలని కోరు కుంటున్నాను. దాన్ని నిరూపిం చాల్సింది మీరేనని చెప్పి భావిస్తున్నాను. ప్రతి ఒక్కడు ప్రజల క్షేమం కోసమని ఉచ్ఛరిస్తుంటారు. ఇవాళ మన మీద జరుగుతున్నటువంటి దుర్మార్గాలన్నింటికీ కారకు లైనటువంటి వాళ్ళు దేశాన్ని, రాష్ట్రాలని పరిపాలిస్తున్నారు.

ఇక్కడి పర్యావరణం దెబ్బతింటుంది. ఈ ప్రజలు పోడు భూములను నరుక్కుంటూ వ్యవసాయానికి భూమి కావాలని, పంటలు పండించడానికి భూములు కావాలని, అడవులను నాశనం చేస్తే పర్యావరణం దెబ్బతింటుందని అంటున్నారు. మనం గమనించాలి అడవిని మనం కాదు ధ్వంసం చేసింది, ఇక్కడున్నటు వంటి పాలకులు, ప్రభుత్వాలు, దానికి సంబంధించినటువంటి ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అడవులను ధ్వంసం చేస్తున్నారు. అడవులంతా బరాబత్ అయినటువంటి భూములను మనం దున్నుకొని బ్రతుకు తున్నాం. దానికి అప్పు కావాలంటున్నాం. వాటిలో ఉన్నటువంటి

నీటి వనరులని వ్యవసాయానికి ఉపయోగపడే పద్ధతుల్లో చర్యలు చేపట్టమంటున్నాం. డ్యాంలు కట్టాల్నా, లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టాల్నా, ఇంకా ఏం చేయాల్నో చేస్తే మనం దున్నుకుంటున్నటువంటి పోడు భూముల్లో ఇంకా మెరుగైనటువంటి పంటల్ని పండించి దేశానికి ప్రపంచానికి తిండిపెట్టవచ్చు. ఇవాళ మనం దున్నుకొని బతుకుతుంటే గిట్టనటువంటి వాళ్ళుగా వ్యవహరిస్తున్నటువంటి వీళ్ళు దేశాన్ని అమ్ముకుంటున్నారు. ఇవాళ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని చెప్పి కొట్లాడి తెచ్చుకొని నిర్మించుకున్నటువంటి ఉక్కు ఫ్యాక్టరీని ఇక్కడున్నటువంటి ఈ రాష్ట్ర ప్రభుత్వం, దేశాన్ని పరిపాలిస్తున్నటువంటి పాలకులు కలిసి అమ్ముకో చూస్తున్నారు. దాన్ని కాపాడుకోవాల్సి నటువంటి బాధ్యత మనందరి మీద ఉంది. ఇవాళ ప్రజలందర్ని, ఆదివాసీలందర్ని ఈ ప్రాంతంలో జీవిస్తున్నటువంటి ప్రజలను ముంచేందుకు పోలవరం కడుతున్నారు. అదే సమయంలో ఇక్కడున్నటువంటి ఆర్‌టిసిని అమ్మజూసారు. మనం రవాణా చేసే ప్రయాణ ప్రాంగణాన్ని అమ్మజూసారు. మన ప్రజా ఆందోళన కార్యక్రమం వలన వాటికి బ్రేకులు పడ్డాయి. ఇవాళ సింగరేణిలో బొగ్గును బయటకు తీసి దేశానికే వెలుతురునిస్తున్నటువంటి ఆ సంస్థని అమ్మజూస్తున్నారు. ఈ రకంగా మనల్నందర్ని అడవి నుండి వెళ్లగొట్టటం కోసం ఆ ప్రాంతంలో ఉన్నటువంటి సంపదలను అమ్ముకోవడం కోసం ప్రయత్నం చేస్తుంటే, మన అమూల్యమైనటువంటి ఓటు హక్కుతోటి గద్దెనెక్కి, అధికారాన్ని చేజిక్కించుకున్న వీళ్ళు దేశాన్ని, మనల్ని తాకట్టు పెట్టేటువంటి, అమ్మజూస్తున్నటువంటి ప్రయత్నాలను మనం అనుభవిస్తున్నాం. అందుకనే ఈ విధానాలకి వ్యతిరేకంగా పోరాడవలసినటువంటి, ఎదురు తిరగాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉంది. ఈ రోజున మీరందరూ కలిసొస్తారని, ఇవాళ ఈ పాలకులని ఎదుర్కొనేటటువంటి ఉద్యమాన్నే కాకుండా వాళ్ళకు సరైనటువంటి గుణపాఠం చెప్పేటటువంటి సమయం ఆసన్నమయ్యింది. తస్మాత్! జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉంది. ఈ విధంగా ఎవరికి పడితే వారికి ఓటు ఇచ్చి, వెర్రివాళ్ళలాగా ఎడ్డి బతుకులు బతికే కన్నా విలువైనటువంటి ఓటుని ఎవరికిస్తే ఉపయోగమో ఆలోచించే సమయం మనకు ఆసన్నమయ్యింది. అట్లా మీరందరూ ఆలోచించాలని, అట్నే మనందరి తరపున పోరాడుతున్నటువంటి కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ పార్టీలు ఏకం కావాలి. ఏకంగా నిలబడి మనందర్ని ఒక తాటి మీదకు తెచ్చి ఈ వ్యవస్థలో మార్పుకు తోడ్పడాలని చెప్పి సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ వేట్ల విజయ, కొండమొదలు సర్పంచ్



కామ్రేడ్స్! అధ్యక్షా! అలాగే వేదిక మీద ఉన్న పెద్దలు ఈ సభకు వచ్చినటువంటి అన్నలూ, అక్కలూ, అలాగే మేధావులు, కామ్రేడ్స్ ఈ రోజు గిరిజన ప్రజలకు అన్యాయం జరిగే చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. అలాగే పోలవరం ప్రాజెక్టు కూడా గిరిజనులకు అన్యాయం చేసింది. ఎందుకంటే గిరిజన ప్రజలు ఐక్యంగా ఉండి, నిలదీసి అడిగినటువంటి గిరిజనులకు పునరావాసం ఎంతోకొంత కల్పించటం జరిగింది. ఆ పాలకులే గిరిజనులకు గిరిజనులకు మధ్య చిచ్చులు పెట్టి చీల్చి ఐక్యం కాకుండా చేసి వాళ్ళకు సరైన పునరావాసం ఇప్పటికింకా ఇల్లు గానీ, భూమి గానీ ఇవ్వకుండా దిక్కూదివానం లేని పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఈ రోజు తీసుకొచ్చారు. అలాగే మనం ఇప్పటికే ఎన్ని సార్లు అధికారుల చుట్టూ తిరిగినా, ఇప్పటికింకా గిరిజనులకు పునరావాసం ఈ పాలకులు ఇవ్వడం లేదు. అలాగే గిరిజనులకు నష్టం కలిగించే చట్టం ఒకటి మనకు వద్దు అని ప్రతి రాష్ట్రం నుండి వచ్చిన మన గిరిజనులంతా కలిసి ఐక్యంగా పోరాడాలి. మన ఆదివాసీలైన గిరిజన స్త్రీలను మణిపూర్‌లో మానభంగం చేయడం జరిగింది. అలాగే గిరిజన యువకులను చిత్రహింసలు పెట్టి చంపేయడం జరిగింది. మనం నిలదీసి అడిగితే మన గిరిజనులకు అణచివేయడానికి పాలకులు పూనుకుంటున్నారు. గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి, భారతదేశంలో ఉన్న గిరిజన తెగలంతా ఐక్యం కావాలని మీ అందరికి తెలియచేస్తున్నాను. ఎందుకంటే మేము పోలవరం ప్రాజెక్టు పేరుతో చాలా నష్టపోయి ఉన్నాం. అడవులలో ఉండే సంపదలను కూడా ఈ పాలకులు దోచి పెద్ద పెద్ద కంపెనీలకు, అంబానీ, అదానీలకు ఇస్తుంటే మనం చూస్తూ ఊరుకోవద్దు. మనమంతా పోరాటానికి సిద్ధం కావాలని చెప్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ ఊయక ముత్యాలు,

### పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు



అధ్యక్షా! కామ్రేడ్స్ విశాఖపట్నంలో ఇంతకుముందు కూడా ఇదే ప్రదేశంలో గిరిజనులను అడవి నుండి గెంటివేసే సుప్రీంకోర్టు తీర్పుని వ్యతిరేకిస్తూ ఇక్కడే సభ జరిగింది. ఈ రోజు 2023 అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇక్కడ బహిరంగ సభ జరుగుతోంది. ఈ సభలన్నీ గిరిజనుల కోసమనేది కాకుండా ఈ రోజు కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ చట్టాలు తీసుకురావడం వల్ల అడవులు నాశనం కావడం వల్ల గిరిజనులకే కాకుండా, ఈ దేశ ప్రజలందరికీ పర్యావరణమనేది పెద్ద సమస్యగా మారుతుంది. కాబట్టి ఒక్క గిరిజన హక్కులే కాదు దేశ ప్రజలందరికీ నష్టం జరుగుతుంది. కాబట్టి ఈ చట్టాలకు వ్యతిరేకంగా అందరూ కదలాలి. ఈ రోజు రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్న పాలకులు ఈ చట్టాలని గిరిజనులకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చి అడవులను జిరాయితీ భూముల్లాగా ఎకరాలకు ఎకరాలు వారికి కట్టబెట్టటానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుంది. దానికి అనుకూలంగానే ప్రధాని నరేంద్రమోడీగారు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాబట్టి

ఈ రోజు గిరిజనులందరం అడవుల నుండి బయటకురామని ప్రతిజ్ఞ పూనుతున్నాం. దీనికి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నాం. గిరిజనులు బ్రిటీష్ కాలం నుండి పోరాటాలు చేయకుండా ఏ హక్కులను నిలుపుకోలేదు. ఈ రోజు మనం ఓట్లు వేస్తే గెలిపించిన ప్రభుత్వాలే గిరిజనులకు గిరిజనులకు మధ్యన చిచ్చులు రేపడానికి, రిజర్వేషన్ల పేరుతో గిరిజనులకు, ఇతర వర్గాలకు మధ్య తగాదాలు పెట్టి సమస్యలను సృష్టించి, గిరిజనులను అడవుల నుండి ఖాళీ చేయిస్తున్న సంఘటనే ఇప్పుడు మణిపూర్‌లో కనిపిస్తుంది. అక్కడ అడవిలో శుభ్రంగా పోడు కొట్టుకొని జీవిస్తున్న గిరిజనులపైకి మైదాన ప్రాంతంలో ఉన్న వాళ్లను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వాలు చేశాయి. అక్కడ జరిగిన ఘోరాలు దేశం మొత్తం కళ్ళారా చూసింది. బట్టలు లేకుండా వేలాది మంది మధ్యలో మహిళలను ఊరేగించారు. దేశం మొత్తం ఈ పరిస్థితికి తలదించుకోవలసిన పరిస్థితి వచ్చింది. కాబట్టి రాష్ట్రంలో కానీ, కేంద్రంలో కానీ మనకు అనుకూలంగా చట్టాలేమీ లేవు. మన రాష్ట్రపతి ద్రౌపతి ముర్మగారు ఉన్నారు, ఆమె ఒక గిరిజన మహిళ. మా మన్యం జిల్లా పీడిక రాజన్నదొర గిరిజన మినిస్టర్. ఈ మినిస్టర్ గానీ, రాష్ట్రపతి గానీ గిరిజనుల తరపున మాట్లాడే పరిస్థితి కనబడటంలేదు. కాబట్టి ఇక్కడ మైదాన ప్రాంత ప్రజలు, మేధావులందరి సహకారంతోటి గిరిజనులందరూ ఐక్యమత్యంగా ఉండి, ఈ హక్కుల కోసం పోరాటం చేయాలి. దుర్మార్గపు చట్టాలను వ్యతిరేకిస్తూ, పోరాటం చేయాలి. మా అడవిని మేమే కాపాడుకుంటాం తప్ప వేరే వాళ్ళు కాపాడరు. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు కాపాడరు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులు మాత్రమే అడవిని, పర్యావరణాన్ని కాపాడుతారని మనమందరం ఐక్యమత్యంగా ఉండి ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి అడవిని, హక్కుల్ని రక్షించుకుందామని కోరుతూ ముగిస్తున్నాను.

## కా॥ కుంజం రామారావు,

### ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు, పశ్చిమగోదావరి జిల్లా



కామ్రేడ్స్! అడవులు ఆదివాసీలకు అతిముఖ్యమైనటువంటి ఆధారం. అడవులను దఫదఫాలుగా కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా గిరిజన సంఘంగా వాళ్ళు చేస్తున్న చట్టాలకు వ్యతిరేకంగా మనం అనేక కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్నాం. ఆదివాసీలకు కొన్ని హక్కులున్నాయి అని అంటే భూమి కోసం, అడవి కోసం చేసినటువంటి అనేక పోరాటాల ఫలితంగానే మనం 5వ షెడ్యూల్‌లో ఉండడం వలన ఇవాళ అనేక చట్టాలను తీసుకొచ్చారు. అవి 1/70 చట్టం కావచ్చు, ఇంకా అనేక చట్టాలు కావచ్చు. ఇవన్నీ కూడా మనలాంటి సంఘాలు, ఆ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్కడున్న భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి, ఆ భూములను స్వాధీనపరుచుకొని ఆ భూములను అనుభవిస్తున్న పరిస్థితి ఉంది. ఇవాళ ఇవి కూడా మనం అడగకపోతే, భూములను స్వాధీన పరుచుకొనే పరిస్థితి లేకపోతే గనుక ఏ ప్రభుత్వాలైనా కానీ గిరిజనులకు ఏం చేయడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం చేయలేదు. ఇవాళ్టి వైసిపి ప్రభుత్వం చేయడం లేదు. చేయకపోగా ఇవాళ 5వ షెడ్యూల్ మొత్తం ఎత్తేసి గిరిజనులను జీవించడానికి వీలులేని విధంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని చట్టాలను తీసుకువచ్చింది. ఇందాక మన కామ్రేడ్స్ చెప్పారు. మరి ఇవన్నీ ఎందుకు తెస్తున్నారు. తీసుకు రావాల్సిన అవసరం ఏమిటి అనేది మనం చూసుకుంటే ఇవాళ గిరిజనులు కూడా జీవించడానికి వారికున్నటువంటి ఉత్పత్తులు గానీ, వనరులు గానీ వాళ్ళు స్వతహాగా బ్రతకడానికి అవకాశం లేని పరిస్థితిని కల్పిస్తున్నారు. రోజువారీగా ఏపూటకాపూట కొని తెచ్చుకొని బ్రతికే విధంగా చేయడం కోసం ఈ ప్రభుత్వాలు పూనుకుంటున్నాయనే విషయం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. కాబట్టి మనం వీటికి వ్యతిరేకంగా పోరాడాలి. పోరాడగలిగితేనే మనం మన అడవిని, జీవితాల్ని నిలబెట్టుకోగలుగుతాము. ఇవాళ కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు వీరందరూ కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారు. ఇవాళ అతి ముఖ్యమైనవి అడవులు గనుక లేకపోతే దేశానికే నష్టం అనే విషయం అనేకమంది మనకు చెబుతున్నటువంటి దారుణ పరిస్థితులే రాబోతున్నాయి. అయితే ఇవాళ గిరిజనులు 5వ షెడ్యూల్ సాధించుకోబట్టి ఈ పరిస్థితులలోనైనా ఉన్నాం. లేకపోతే ఇంకా దయనీయ స్థితిలో ఉండేవారం. ఈ ప్రభుత్వాలు కేవలం వ్యాపారం చేసకుంటున్నాయే తప్ప కనీసం ఇక్కడున్నటువంటి ప్రజలకు సంబంధించిన వనరులేంటి, ఆధారాలేంటి వాటిని అభివృద్ధి పరచవలసిన అవసరం ఏంటనేది పట్టించుకోవడం లేదు.

ఇంకో విషయం ఏంటంటే పోలవరం ప్రాజెక్టు గురించి ఇందాక చెప్పారు. పోలవరం ప్రాజెక్టు కింద ఎక్కువగా బలయ్యే ప్రజలు గిరిజనులే. ఆ గిరిజనులకు పూర్తి పునరావాసం ఇవ్వకపోగా వాళ్ళని ఎక్కడెక్కడకో తీసుకుపోయి వాళ్ళకి అరకొరగా ఇళ్ళ నిర్మాణం చేసి వదిలేశారు. ఇప్పటికీ వారికి ఏరోజుకారోజు పనులు చేసుకోవాల్సిన పరిస్థితి. లేకపోతే వలసలు పోతున్న పరిస్థితి తప్ప అక్కడికి, వెళ్ళిన తర్వాత కూడా వారు తింటున్నారా లేదా వాళ్ళు ఎట్లా బ్రతుకుతున్నారు, వాళ్ళకి భూములు ఇచ్చామా లేదా అని ప్రభుత్వాలు ఏరోజు కూడా పట్టించుకోవడం లేదు. పట్టించుకోకపోగా వాళ్ళకు వాళ్ళకు మధ్య గొడవలు సృష్టించి, ఎన్నికల ద్వారా మరలా అధికారంలోకి రావడం కోసం వైసిపి, ఇంకొపక్క టిడిపి కలిసి గొడవలు పెడుతున్నాయి. నిన్నగాక మొన్ననే చంద్రబాబును అరెస్ట్ చేసినటువంటి పరిస్థితి చూస్తే, ఇవాళ ఎన్ని సమస్యలు ఉన్నాయో. ఇవాళ అడవులలో బ్రతుకుతున్న గిరిజన సమస్యలేంటి, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులేంటి వాటి గురించి ఏం మాట్లాడాలి, ఏం చేయాలి అనేది లేకుండా ఈ కేసు చుట్టూ తిప్పుతున్నారు. ఎందుకని ప్రజల సమస్యలు వాళ్ళకు పట్టడం లేదు. ప్రజలను గాలికొదిలేసి ఏరోజు కారోజు వాళ్ళు పిలిస్తే పలికేలాగ చిన్న చిన్న పథకాలిచ్చి, ప్రజలను ఆ రకంగా బుజ్జగించి, సంతృప్తి

పరిచే విధంగా చేస్తున్నారు తప్ప ఏ విషయాన్నీ గ్యారెంటీగా గిరిజనులకు ఆ ప్రాంతాల్లో ఉన్నటువంటి వనరులను అభివృద్ధిపరిచి, గిరిజనులు మనుషులుగా జీవించడానికి కావలసిన పద్ధతులలో చేద్దామనేటు వంటిది ఈ ప్రభుత్వాలకి లేదు. కాబట్టి వీటికి వ్యతిరేకంగా మనం పోరాడవలసిన అవసరం ఉంది. అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు గానీ, అడవులకు సంబంధించిన విషయాల మీద పార్లమెంటులో ఒక ముసాయిదా తీసుకొచ్చినప్పుడు గానీ, అటవీ సవరణ చట్టం తెచ్చినప్పుడు కానీ ఇలా అనేక సందర్భాల్లో కూడా మనం సంఘంగా ఆందోళనలు చేస్తున్నాం. ఆరకంగా మనం ప్రజలను కదిలించి మనం వీటికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉంది. పోరాడుదాం అని చెప్పేసి ఈ సందర్భంగా నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినటువంటి మన కామ్రేడ్స్‌కి ధన్యవాదాలు తెలియచేస్తూ నేను ముగిస్తున్నాను.

# ప్రతినిధుల సభ

## కామ్రేడ్ ఎమ్.ఎస్. నాగరాజు,

రైతుకూలీసంఘం( ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి



నిన్న ప్రారంభసభ, బహిరంగసభలను ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకున్నాము. ఈరోజు ప్రతినిధుల సభలో ఏపీతో సహా 10 రాష్ట్రాల నుండి 500 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. అలాగే అటవీ పరిరక్షణ సవరణ చట్టాన్ని వ్యతిరేకించే మేధావులు, ప్రజాతంత్ర వాదులు కూడా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు.

ఏఐకేఎంకేఎస్ ఆధ్వర్యంలో 2019లో అడవుల నుండి ఆదివాసులను తొలగించాలనే తీర్పును నిరసిస్తూ మాడభూషి శ్రీధర్‌గారిని ఆహ్వానించి విశాఖపట్నంలోనే సదస్సు నిర్వహించుకున్నాం. నిరంతరాయంగా ఆదివాసుల అటవీ హక్కుల సమస్యలపై ఆందోళనలను నిర్వహిస్తున్నాం. 2020 సంవత్సరంలో జాతీయ జనాభా పట్టిక (ఎన్.పి.ఆర్) పేరిట మూలవాసులైన ఆదివాసులను హిందువులుగా చూపించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకించాం. ఎన్.పి.ఆర్, పౌరసత్వ సవరణ చట్టం (సి.ఏ.ఏ) వంటివన్నీ ఆదివాసులను అడవుల నుండి గెంటివేసే కుట్రలో భాగంగానే సాగిస్తూ వస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పాలకులు దొడ్డిదోవన అడవులను ప్రైవేట్ కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు దోచిపెడితే నేడు బిజెపి బాహాటంగా కార్పొరేట్లకు, విదేశీ బడా కంపెనీలకు దోచిపెడుతోంది. ఆదివాసుల కనీస హక్కులను సైతం కాలరాస్తున్నది. ఉమ్మడి సివిల్ కోడ్ పేరిట ఆదివాసి సమాజాలపై,మత మైనారిటీలపై బిజెపి ప్రభుత్వం దాడులు చేస్తోంది. మణిపూర్లో మతోన్మాదాన్ని తలకెక్కించుకున్న మైతేయి మూకలతో నాగ కుకీ వంటి ఆదివాసి సమూహాలపై జాతి హనన మారణకాండ సాగిస్తూ వారిని ఆ ప్రాంతం నుండి పారద్రోలి అక్కడి విలువైన ఖనిజ సంపదలను కార్పొరేట్లకు, ఎంఎన్‌సిలకు కట్టబెట్టేందుకు బరితెగించి హింసకాండకు పాల్పడుతోంది. మన రాష్ట్రంలో పాలకులు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన ఆదివాసులకు శాస్త్రీయ, సమగ్ర పరిహారం కల్పించకుండానే వారిని నిర్వాసితులను చేశారు. దీనికి వ్యతిరేకంగా ఒక నిర్దిష్టమైన నిరంతరాయ ఆందోళనను సాగిస్తూ వస్తున్నాం.

ఈ నేపథ్యంలో ముందుకొచ్చిన అటవీ పరిరక్షణ (సవరణ) చట్టం 2023 రద్దును డిమాండ్ చేస్తూ ఆందోళన సాగించటానికి వక్తల ఉపన్యాసాలు అన్నింటిని శ్రద్ధగా వినవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

## శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు,

మాజీ వ్యవసాయ శాఖా మంత్రి



ప్రతినిధుల సభకు అధ్యక్షత వహిస్తున్న మిత్రులు నాగరాజుగారు, వేదికనలంకరించిన సోదరీమణి ఝాన్సీగారు, వివిధ రాష్ట్రాల నుండి ప్రాతినిధ్యం వహిస్తూ వేదికనలంక రించిన పెద్దలు, నాయకులు, అలాగే ఈ రెండు రోజులు కార్యక్రమంలో పాల్గొనటానికి దేశ నలుమూలల నుండి వచ్చిన ఆదివాసీలు, గిరిజనులు, పేదలు, రైతుకూలీ సంఘం కార్యకర్తలు, నాయకులు అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.

అధ్యక్షులు నాగరాజుగారు ముందుగా చెప్పారు. ఆదివాసీలను అడవుల నుండి వెళ్ళగొట్టటానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టటానికి ఏఐకెఎంకెఎస్ ఏవిధంగా కట్టుబడి ఉందో చెప్పారు. అలాగే మూడు నల్ల చట్టాల గురించి కూడా వారు పేర్కొన్నారు. 13 మాసాలుగా ఢిల్లీ చుట్టుపక్కల, అదే విధంగా దేశవ్యాప్తంగా ఆ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఏఐకెఎంకెఎస్, దాని అనుబంధ సంస్థగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మాకు సహకరిస్తూ మాతోపాటు పాల్గొంటూ, ఆ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవటానికి ఎంతగానో సహకరించారు. వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

నిన్న మీరు ప్రారంభసభ, బహిరంగ సభ విజయవంతంగా నిర్వహించుకున్నారు. అనేకమంది పెద్దలు తమ విలువైన సందేశాలనిచ్చారు. ఈ సందర్భంగా కొన్ని విషయాలు క్లుప్తంగా సభ దృష్టికి తీసుకువస్తాను. 'ఫారెస్టు కన్జర్వేటివ్ యాక్ట్-1980'కి ఏదైతే సవరణ చేశారో, అలాగే 'బయో-డైవర్సిటీ యాక్ట్'కు సవరణలు చేశారో అవి కేవలం అడవులలో నివసిస్తున్న ఆదివాసీల హక్కులను హరించటమే కాదు, మొత్తం దేశానికే నష్టదాయకమైనవని అందరూ అర్థం చేసుకోవాలి. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు 'గ్లోబల్ వార్మింగ్' మూలంగా ఎలాంటి అనర్థాలు వాటిల్లుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా

వరదలు గానీ, తుఫానులు గానీ, అకాల వర్షాలు గానీ; వీటితో ఎంతో కష్టపడి రైతులు పండించిన పంట నేలపాలైపోతోంది. వందలాది ఇళ్ళు కొట్టుకుపోతున్నాయి. వేలాది మంది చనిపోతున్నారు. ఇవన్నీ చాలా సందర్భాల్లో మనం చూస్తున్నాం. మన దేశంలో హిమాలయ పర్వత ప్రాంత సానువుల్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ ఈ ఉపద్రవాలు మనం చూస్తూనే ఉన్నాం. ఎంత తీవ్రంగా నష్టపోతు న్నప్పటికీ ప్రభుత్వం వైపు నుండి మద్దతు గానీ, నష్టపరిహారం గానీ చాలా తక్కువగా ఉంటూ లక్షలాది మంది ప్రజలు మరింత పేదరికంలోకి జారిపోతున్నారు.

ఆ నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటే ఇప్పుడు అటవీ సంరక్షణను విస్తృతపరచటం అనే అర్థంలో తీసుకువచ్చిన సవరణ ఎంత బూతో చెప్పటానికి వీల్లేదు. 140 కోట్ల ప్రజల ప్రధానమంత్రి ఏమాత్రం నదురు బెదురు లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడు. అతను ఏదైతే చెబుతాడో దానికి పూర్తి విరుద్ధంగా చేసే మనిషి. ఏ ఆశయాలు సాధించటానికి ఈ చట్టంలో సవరణలు చేశామని చెప్పారో దానికి పూర్తి విరుద్ధమైన ఫలితాలను ఆశించి ఈ సవరణలు చేశారని మీకు ముందుగా తెలియజేస్తున్నాను. అందుకే ఈ సవరణలు తప్పనిసరిగా ఉపసంహరించి తీరాలి. కానీ ఈ మోడీ ప్రభుత్వం ఆ పనిచేయదు. వ్యవసాయ నల్ల చట్టాల విషయంలో మనం చూశాం. 750 మంది రైతులు చనిపోయారు, సంవత్సర కాలంపైగా ఢిల్లీ సరిహద్దులో సాగిన చారిత్రక రైతాంగ పోరాటంలో. లఖింపూర్ ఖేరీలో కేంద్రమంత్రి అజయ్ మిశ్రా కొడుకు రైతులపైకి కారు తోలి అక్కడికక్కడే నలుగురు రైతులు దుర్మరణం పాలవటం మనందరి గమనంలో ఉన్నదే. ఇంత దుర్మార్గానికి ఒడిగట్టిన దానికి బాధ్యతగా సదరు మంత్రిని కేబినెట్ నుండి తప్పించండని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసినా ఇప్పటికీ చెయ్యలేదు. ఉత్తరప్రదేశ్ ఎలక్షన్లు వచ్చినప్పుడు మాత్రం ఆ ఎలక్షన్లలో దెబ్బతింటామేమోనని "మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తున్నాం, భారత రైతాంగానికి క్షమాపణ చెబుతున్నా, త్వరలో మీ సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కారం చేస్తా"నని నోటిమాట కాదు కాగితం మీద రాసిచ్చాడు మోడీ. ఎన్నో నెలలైపోయింది. ఒక్కటి కూడా పరిష్కారం చెయ్యలేదు. అంతేకాదు మీతో సంప్రదించే విద్యుత్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతానన్నాడు. కానీ సంప్రదించకుండానే ప్రవేశపెట్టేశాడు. అది పాసవ్వకముందే రైతుల వ్యవసాయ విద్యుత్ మీటర్ల బదులు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడు. కేవలం రైతుల మీటర్లకే కాదు. భారతదేశంలో యావన్మంది ప్రజల యొక్క, సంస్థల యొక్క అందరి మీటర్లకి, ఇప్పటికున్న 24 కోట్ల మీటర్లని తీసి, కొత్తగా రైతుల మీటర్లను పెట్టి ఒక లక్షా యాభైవేల కోట్ల ఖర్చుతో 25 కోట్ల మీటర్లు పెట్టటానికి కార్యక్రమాన్ని మోడీ చేపడుతున్నాడు. ఇది ఎందుకు చెబుతున్నానంటే ప్రజలకు అనుకూలంగా చేస్తానని చెప్పినవేవీ మోడీ చెయ్యడు. నాకైతే ఆ నమ్మకం లేదు. కానీ ఆ ప్రజానుకూల చర్యలు జరగాలి అంటే మోడీ గద్దె దిగాల్సిందే. అందు కోసం ప్రయత్నం చేస్తున్నటువంటి – భారతదేశంలోని 540 రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక కలిసి ఇంత దుర్మార్గంగా, ప్రజావ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాలరాస్తూ, ప్రజల సంపదను తనకు కావాల్సిన అదానీ, అంబానీలకు కట్టపెడుతూ ఉన్న మోడీని గద్దె దించటానికి, పిలుపు ఇచ్చినటువంటి సందర్భంలో, వివిధ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఒక వేదిక మీదకు వచ్చి మోడీకి వ్యతిరేకంగా ఒక ప్రయత్నం చేస్తున్నారు. నేను ఇక్కడ చెప్పదలచినదేమంటే మనం వాళ్ళను డిమాండ్ చెయ్యాలి. మన డిమాండ్లు న్యాయమైనవి, రైతుల డిమాండ్లు కానీ, ఆదివాసీల డిమాండ్లు కానీ, ఈ ప్రజావ్యతిరేక చట్టాలను కానీ మీరు తిరస్కరించాలి. మీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సవరణలను మీరు వెనక్కు తీసుకోవాలి అని మనం డిమాండ్ చెయ్యాలి. మన డిమాండు నూటికి నూరుపాళ్ళు న్యాయమైనది. అటవీ సంరక్షణ చట్టం 1980కి సవరణ చేశారు. అడవి అనేటువంటిది ఉమ్మడి జాబితాలో ఉంది. డా॥బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో అనేకమంది దేశభక్తి పరులైన మేధావులు అనేక నెలలు శ్రమించి రాజ్యాంగాన్ని రూపొందించారు. అందులో కేంద్ర ప్రభుత్వ పరిధిలో కొన్ని అంశాలు, రాష్ట్రాల పరిధిలో కొన్ని అంశాలు, ఉమ్మడిగా కొన్ని అంశాలు పెట్టారు. ఆ ఉమ్మడి జాబితాలోని వాటిని రాష్ట్రాలతో సంప్రదించకుండానే కేంద్రం తన పరిధిలోకి తీసుకొంటుంది. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోనిది. దానిని కూడా లాగేసుకొని మూడు వ్యవసాయ చట్టాలు చేశారు. ఇప్పుడున్న వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు ముందు బీహార్‌కి చెందిన మంత్రి మూడు మోడల్ చట్టాలను రూపొందించాడు. మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని, ఇంకో రెండు చట్టాలు రూపొందించాడు.

కానీ కోవిడ్ టైంలో ఎప్పుడైతే ప్రజలు రోడ్లమీదకు వచ్చి నిరసన తెలిపే అవకాశం లేదో అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ మూడు వ్యవసాయ చట్టాలను చేసేసింది. అలాగే గౌతం అదానీకి 26 వేల మెగావాట్ల కరెంటు తయారు చేసే సంస్థలు ఉన్నాయి. అతను తయారుచేసే కరెంటుకు సంబంధించి 'విద్యుత్ బిల్లు 2020' వీటిని ఆర్డినెన్సు రూపంలో తీసుకువచ్చి భారత ప్రజల మీద రుద్దారు. కోట్లాది మంది ప్రజల సంక్షేమం గానీ, అభివృద్ధి గానీ, వారి అవసరాలు గానీ మోడీకి పట్టటం లేదు. ఎంతసేపూ కార్పొరేట్లకు మేలు చెయ్యాలి. అందులోనూ తనకు కావలసిన వాళ్ళకు లబ్ధి చేకూర్చాలి అనే దృష్టితో చేస్తున్నాడు. మరి ప్రజలకు ఒరిగేదేమిటి? మా సమస్యలు పరిష్కారం చేస్తారా లేదా అని అడగాల్సిన అవసరం ఉంది. ఈ 75 సం॥ల కాలంలో ప్రభుత్వాలను మార్చారు ప్రజలు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆశపడ్డారు ప్రజలు. ప్రజల ఆశలు నెరవేరాయా? ఇప్పటికీ కోట్లాదిమంది దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. మళ్ళీ మోసపోవటానికి వీల్లేదు. అడగాలి. సాధించుకోవాలి. పది అడిగితే కనీసం నాలుగైనా సాధించుకోవటానికి ప్రయత్నం చేయాలి.

అటవీ సంరక్షణ సవరణ చట్టం వల్ల అదివాసుల ఆశలు నెరవేరే అవకాశం లేదు. అటవీ విస్తీర్ణం ఇప్పటికే బోలెడంత తగ్గిపోయింది. 1950 నుండి 1980 వరకు అటవీ సంరక్షణ చట్టం రాకముందే 1927 చట్టం అమలులో ఉండగానే 45 లక్షల హెక్టార్ల అటవీ భూమి డైవర్షన్‌కు గురయ్యింది. పత్రికల్లో, ప్రచార సాధనాల్లో అడవుల్లో గిరిజనులు పోడు వ్యవసాయం చేయటం

మూలాన అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది అని ప్రచారం సాగింది. అటువంటి పరిస్థితుల్లో అటవీ విస్తీర్ణం తగ్గకుండా ఉండటానికి అటవీ భూమిని అటవీయేతర అవసరాలకు మళ్ళించేట్లయితే ఎంతయితే భూమిని మళ్ళిస్తారో దానికి రెట్టింపు విస్తీర్ణంలో అడవి బయట చెట్లను పెంచి కాంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ చెయ్యాలని చెప్పారు. 1980 తర్వాత దాదాపు 10 లక్షల హెక్టార్లు అటవీ భూమి మళ్ళించ బడింది. దాదాపు 12 లక్షల హెక్టార్లలో కాంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ వచ్చింది. అయితే ఈ మొక్కల పెంపకం అటవీ విస్తీర్ణంతో సమానం కానేకాదు. సహజంగా అడవిగా పెరిగినటువంటి ప్రదేశం, ఆదివాసులు తరతరాలుగా కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడినటువంటి అడవుల్లో కర్బనాన్ని ఇముడ్చుకునే గుణం కానీ, సారం గానీ ఈ కృత్రిమంగా మొక్కలు పెంచిన దానితో పోల్చటానికి వీల్లేదు. ఇది నేను చెప్పటం కాదు. శాస్త్రవేత్తలు చెప్పినదే. ఇప్పుడు ఈ 'అడవి' అనేదాని నిర్వచనాన్నే మార్చిపారేశారు. 1980 వరకు గానీ, ఆ తర్వాత గానీ ప్రభుత్వ రికార్డుల్లో పేర్కొన్న ఫారెస్టు ఏరియా వరకు మాత్రమే ఫారెస్టు. మధ్యలో మైనింగ్ కోసమో, ఇతర అవసరాల కోసమో రాష్ట్ర ప్రభుత్వం కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ ఏదైనా సంస్థకు అటవీయేతర అవసరాల కోసం ఇస్తే ఆ భూమి ఫారెస్టు కాదని చెప్పారు. అంటే అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. అంతేకాదు. ఇంతకు ముందున్న చట్టాల ప్రకారం ఫారెస్టు ఏరియాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో ఏదన్నా ప్రాజెక్టు టేకప్ చెయ్యాలంటే గ్రామసభల అనుమతి తీసుకోవాలి. ఇప్పుడు దానిని తీసేశారు. పర్యావరణ అనుమతుల కోసం అప్లై చేసేటప్పుడు గ్రామసభల ఆమోదం ఉండాల్సిన అవసరాన్ని ఎత్తివేశారు. అంటే ఇక ప్రభుత్వం అటవీ భూమిని ఎవరికి కావాలంటే వారికి ఇచ్చేయ వచ్చు. అంతేకాదు, ఇవాళ భారతదేశంలో అతివిలువైనటువంటి బయోలాజికల్ రిసోర్సెస్ ఉన్నటువంటి బయోలాజికల్ డైవర్శిటీ ఉన్నటువంటి ప్రాంతం ఈశాన్య ప్రాంతం. మణిపూర్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర ఆ బెల్ట్ అంతా చాలా విలువైనది. అక్కడ అంతర్జాతీయ సరిహద్దు నుండి 100 కిమీ లోపు ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రోడ్లో, రైల్వేలైనులో లేక రక్షణ కోసమో ఏదైనా అవసరాల కోసం ఇచ్చెయ్యొచ్చు. దాని కొరకు ఏ క్లియరెన్సులు అవసరం లేదు అని కూడా ఈ సవరణ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇక్కడ మీకో విషయం స్పష్టం చేయాలి. వ్యవసాయానికి సంబంధించిన విత్తనాల విషయాన్నే తీసుకుంటే తరతరాలుగా మన రైతులు ఎంతో జాగ్రత్తగా ఆనాటికి వాళ్ళకున్న తెలివితేటలతో విత్తనాలను రూపొందించుకుంటూ వచ్చారు. వాటిని ఇతర దేశాలు కానీ, కంపెనీలు గానీ ఉపయోగించుకోవాలన్నప్పుడు వాటి నుండి వచ్చే ఆదాయం, లాభం కొంత భాగం రైతులకివ్వాలి అని ఒక చట్టాన్ని రూపొందించటం జరిగింది. అలాగే అడవులలో ఉన్నటువంటి చెట్లు, వాటి ఫలాలు వీటిని వేరే కంపెనీలు వాడుకోవాలని అనుకుంటే ఒకటి, ముందుగా దాని కొరకు గ్రామసభ అనుమతి తీసుకోవాలి. రెండు, అందులో వచ్చిన లాభంలో కొంత ఆదివాసులకు పంచాలి. ప్రాఫిట్ షేరింగ్ అంటారు దానిని. అది కూడా ఎత్తిపారేసింది మోడీ ప్రభుత్వం.

ఈరోజు పేపర్లో ఒక వార్త చూశాను. అమెరికా శీతల గిడ్డంగుల్లో 10 సంవత్సరాలుగా నిల్వవున్న చికెన్ లెగ్స్ మన దేశంలోకి దిగుమతి చేసుకోవటానికి మొన్న జి20 సందర్భంగా బైడెన్‌ను సంతృప్తి పరచటానికి, అమెరికా పెట్టుబడిదారులను సంతృప్తిపరచటానికి మోడీగారు ఆమోదించి ఎర్రతివాచీ పరిచారు అనేది ఆ వార్త. ఇంతకు ముందే ఇటువంటి ప్రయత్నాలు జరిగినప్పుడు పౌల్ట్రీ అసోసియేషన్ వాళ్ళు, పౌల్ట్రీ రైతులు దానికి వ్యతిరేకంగా గొంతెత్తి అరిస్తే అప్పట్లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దానిని ఆపింది. ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో పెట్టుబడిదారుల విజ్ఞప్తులు తప్ప, మన కోట్లాది రైతులు చెప్పేది అతని చెవిలోకి దూరదు. మనం మనుషులుగా కనపడం. భారతదేశంలోని పౌల్ట్రీ రంగం కుదేలైపోయే పరిస్థితి వస్తోంది. అలాగే ప్రజలు కట్టిన పన్నుల్లోంచి, బ్యాంకుల్లో అప్పులు తీసుకుని, కోట్లాది మంది కార్మికుల శ్రమతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ రంగ సంస్థలను అంటే ప్రజల సంపదను కారు చౌకగా అదానీలకు, అంబానీలకు కట్టబెడుతున్నారు. మనం ఈ విధానాలను ఖచ్చితంగా వ్యతిరేకించాలి. పోరాటం చెయ్యాలి. అది ఒక్క ఆదివాసీలే కాదు. ప్రజలందరూ కలిసి పోరాటం చెయ్యాల్సిన అవసరం ఉంది. 1988 నేషనల్ ఫారెస్టు పాలసీకి కూడా వ్యతిరేకంగా ఉంది ప్రస్తుత సవరణ. ఏ ఆశయాలు, లక్ష్యాల కోసమని ఉపోద్ఘాతంలో వ్రాశారో దానికి విరుద్ధమైన ఫలితాలు వచ్చే విధంగా ఈ సవరణ ఉంది.

ఆదివాసీలు చాలామంది సరైన చదువు లేక, సరైన వైద్య సదుపాయాలు లేక ఎంత యాతనలు పడుతున్నారో తరచుగా మనం పత్రికల్లో చూస్తూనే ఉంటాం. అటువంటి ఆదివాసీలను ఈ మోడీ బిజెపి ప్రభుత్వం వాళ్ళ జీవనావకాశాలను దెబ్బతీస్తూ ఆ అడవులను మైనింగ్‌కి ఇచ్చెయ్యటమన్నది దుర్మార్గం. జార్ఖండ్‌లో అదానీకి సంబంధించిన పరిశ్రమ పెట్టటానికి, మైనింగ్ కొరకు కొన్ని వేల ఎకరాలు ఇవ్వటానికి ప్రయత్నం చేసినప్పుడు అక్కడి ఆదివాసీలు, గిరిజనులు వ్యతిరేకించారు. వాళ్ళ మీద పదివేల మంది మీద దేశద్రోహం కేసు పెట్టారు. నానా హింసలు పెట్టారు. అయినా వాళ్ళు వెనకడుగు వేయలా. 'పాతాళఘురీ' అనే పేరుతో ఉద్యమం చేసి ఎలక్షన్లలో బిజెపి ప్రభుత్వాన్ని మట్టికరిపించారు, ఆవిధంగా బుద్ధి చెప్పారక్కడ. మనం కూడా రాబోయే కాలంలో ఈ చట్ట సవరణను వెనక్కుతీసుకునే వరకు పోరాటం చెయ్యాలి. తర్వాత ఏ ప్రభుత్వం వచ్చినా, వాళ్ళతో పోరాడి మన లక్ష్యాన్ని సాధించాలని అందరికీ మనవి చేస్తున్నాను. ఈ విషయాలను మీతో పంచుకోవటానికి అవకాశమిచ్చిన రైతుకూలీ సంఘం వారికి, ఇతర మిత్రులందరికీ ధన్యవాదాలు.

**జల్, జంగిల్, జమీన్ హమారా హై**

## శ్రీ పల్లా త్రినాథరావు, సీనియర్ అడ్వకేట్



సోదరీ సోదరులారా, మిత్రులారా! ఈ రోజు మనం అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని ఎందుకు వ్యతిరేకించాలి అనే విషయం గురించి మాట్లాడుకుంటున్నాం. అటవీ సంరక్షణ చట్టం 1980లో వచ్చింది. దానికి సవరణగా ఇప్పుడు అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023ను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఒక మిత్రుడు నన్ను అడిగాడు. 'అటవీ సంరక్షణ చట్టం అంటే అడవులను రక్షించటానికి చేసిన చట్టం కదా! ప్రజలెందుకు వ్యతిరేకిస్తున్నారు? ప్రజా సంఘాలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?' అని. 'అది అటవీ సంరక్షణ చట్టం కాదు. అటవీ భక్షణ చట్టం. అటవీ భూములను మళ్ళించటానికి చేసిన చట్టం అది, పేరు మాత్రమే సంరక్షణ' అని చెప్పాను. దీని నేపథ్యాన్ని మనం అర్థం చేసుకోవాలంటే, ఈ అటవీ సంరక్షణ చట్టం ఒక్కదాన్ని నిశితంగా పరిశీలిస్తే సరిపోతుంది. గత నాలుగైదు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అనేక శాసనాలు మార్పు చేసేందుకు పూనుకుంది. శాసనాలు మార్పు రూపంలో, నోటిఫికేషన్ల రూపంలో తీసుకువచ్చింది. అడవి అనేది ఆదివాసీల అస్తిత్వానికి సంబంధించిన సమస్య. వారి సాంస్కృతిక ఉనికికి సంబంధించిన ప్రశ్న. వారి జీవనానికి సంబంధించిన ప్రశ్న. జీవనోపాధికి సంబంధించిన ప్రశ్న. అడవులకు, ఆదివాసీలకు మధ్యనున్న సంబంధాన్ని విడదీయటానికి వచ్చిన శాసనాలివి. ఈ నేపథ్యంలో ఈ సమస్యను చూడాల్సిన అవసరం ఉంది. మరోపక్కన అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఏదైతే ఉందో దానిలో అటవీ హక్కులు ఏమేమి ఉన్నాయి, ప్రస్తుత సవరణల వల్ల ఏఏ హక్కులు కోల్పోవలసి వస్తుంది అనేది తెలుసుకోవాలి. మరో ప్రక్క భారత రాజ్యాంగం 5వ షెడ్యూలు కింద ప్రకటించబడిన ప్రాంతాలు ఉన్నాయి. దేశంలోని సుమారు 10 రాష్ట్రాల్లో షెడ్యూలు ప్రాంతాలున్నాయి. ఈశాన్య ప్రాంతాల్లో 6వ షెడ్యూలు కింద ఉన్న ప్రాంతాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఆదివాసులకు కొన్ని మౌలికమైన హక్కులు ఉన్నాయి. ప్రస్తుత సవరణ చట్టం గానీ, అంతకుముందలి శాసనాలు గానీ ఈ హక్కులను ఉల్లంఘించే విధంగా ఉన్నాయి. భారతదేశంలో ఆదివాసీలు కాకుండా చాలా మంది పేదలున్నారు. సుమారు $27^{1}/_{2}$ కోట్ల ప్రజానీకం ఆదివాసీలు, ఆదివాసీయేతరులు అడవులపై గానీ, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి గాని జీవించేవారున్నారు. దేశ జనాభాలో 27% ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ అడవులపై ఆధారపడి బ్రతికే ప్రజలున్నారు. అడవులపై ఆధారపడి జీవించే విభిన్న వర్గాల ప్రజల హక్కులన్నీ మృగ్యమైపోతున్న పరిస్థితి నేడు నెలకొని ఉంది.

ముఖ్యంగా అటవీ సంరక్షణ చట్టంలోని అంశాలేమంటే డిసెంబరు 12, 1996 నాటికి గతంలో అటవీ భూములు అటవీయేతర ప్రయోజనాలకు మళ్ళించినట్లైతే, ఆ మళ్ళించబడిన భూములు ఈ సంరక్షణ చట్ట పరిధిలోకి రావు అని చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం ఎందుకు ప్రత్యేకంగా ఈ తేదీని పేర్కొంది అంటే 1996లో సుప్రీంకోర్టులో గోదావర్మన్ వేసిన కేసులో 'అడవి' అంటే ఏమిటనే ప్రశ్న వచ్చింది. భారత శాసనాల్లో ఎక్కడా కూడా అడవికి సంబంధించిన నిర్వచనం లేదు. ఏ భారత చట్టంలోనూ లేదు. అడవులంటే సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే ఏ నిర్వచనం లేదు కాబట్టి డిక్షనరీలో అడవి అంటే ఏ అర్థం ఉందో దాని ప్రకారం అడవిగా పరిగణించాలని చెప్పింది. అంటే అటవీశాఖ యాజమాన్యంలో ఉంటేనే అడవి కాదు. అది ఎండోమెంటు యాజమాన్యంలో ఉండొచ్చు, రెవన్యూ డిపార్టుమెంటు యాజమాన్యంలో అడవులుండొచ్చు, లేకుంటే ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యంలో కూడా అడవులుండొచ్చు. కొన్ని ప్రిన్సిలీ స్టేట్స్ ఉన్నాయి. ఆ సంస్థానాల్లోని రాచరిక ప్రాంతాల్లో, జమీందారీ ప్రాంతాల్లో, జమీందారీ గ్రామాల్లో ప్రైవేటు ఎస్టేట్లు ఉన్నాయి. వాటిల్లో కూడా అటవీ భూములుండొచ్చు. అటవీ భూమిని అటవీయేతర ప్రయోజనాలకు వాడకూడదనే 1980 అటవీ సంరక్షణ చట్టం ఏదైతే ఉందో, దాని కింద మీరు అడవులను మళ్ళించాలంటే కేవలం నోటిఫైడ్ ఫారెస్టు మాత్రమే కాదు, నిఘంటువుల అర్థం ప్రకారం ఇంతకు ముందు చెప్పిన ఇతర అటవీ భూములను ఇతర ప్రయోజనాలకు మళ్ళించాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందాలి అని సుప్రీంకోర్టు చెప్పింది. అప్పటి నుండి మొదలైంది ఇలా ఈ చట్టంలో ఉన్న క్లాజులను ఎత్తేయాలి అని. ఇప్పటికి ఈ సవరణ చట్టం ద్వారా సుప్రీంకోర్టు ఏదైతే అటవీ భూములు అని పేర్కొందో వాటిని అటవీ సంరక్షణ చట్టం నుండి మినహాయించటం ప్రస్తుత సవరణ చట్టంలో ముఖ్యమైన అంశం.

ఈ సవరణ చట్టం అమలులోకి వస్తే ప్రస్తుత కార్పోరేట్ వ్యవస్థలో అడవిగా పేర్కొనబడే భూమిలో 20% నుండి 27% కార్పోరేట్ రంగానికి ఇవ్వటానికి ఈ చట్టం వెసులుబాటు కల్పిస్తుంది. రెండో విషయం 1980కి ముందుగానీ, తర్వాత గానీ, ఏదైతే ప్రాంతం నోటిఫైడ్ ఫారెస్టుగా పేర్కొనబడిందో – రిజర్వు ఫారెస్టు, ప్రొటెక్టెడ్ ఫారెస్టు, విలేజ్ ఫారెస్టు. ఏదైతే రిజర్వు ఫారెస్టుగా ప్రకటించారో, ప్రత్యేకంగా ప్రొటెక్టెడ్ ఫారెస్టుగా ప్రకటించారో భారత అటవీ చట్టం 1927 కింద 1980కి ముందు, తర్వాత రికార్డెడ్ ఫారెస్టుగా ఏదైతే ఉందో దానికి మాత్రమే ఈ సంరక్షణ వర్తిస్తుందని మినహాయింపు నిచ్చారు. అంటే దీని వల్ల ఏం జరుగుతుంది? ప్రైవేటు వ్యక్తుల సంస్థల ఆధీనంలోని భూములకు ఈ చట్టం వర్తించదు. సుప్రీంకోర్టు తీర్పును దొడ్డిదారిన అమలుకాకుండా చేయటానికి చేసినదే ఈ సవరణ చట్టం. దీనిలో అన్నీ మినహాయింపులే ఉన్నాయి. అటవీ సంరక్షణ అనగానే ఏమనుకుంటాం? అటవీ భూములను కాపాడటం, అది ఇతరాలకు మళ్ళకుండా చూడటం, ఖాళీగా ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి పరచటం అనుకుంటాం. ఈ చట్టం యొక్క ప్రియాంబుల్ (పీఠిక)లో కూడా అదే ఉంది, కానీ అది అంతా అబద్ధం. 2070 నాటికి దేశంలో ఎక్కడా ఉద్గారాలు లేకుండా కర్బన ఉద్గారాలను ఇముడ్చుకునే విధంగా అటవీ సంరక్షణ అని చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం కాబట్టి, మేము కూడా

పర్యావరణ పరిరక్షణకే ప్రయత్నం చేస్తూ, ఆ ప్రయత్నంలో భాగంగానే అటవీ సంరక్షణ సవరణ చట్టం చేశామని చెబుతున్నారు. పీఠిక అంతా అదే నిండి ఉంది. మరో ప్రక్క చట్టంలో అన్నీ మినహాయింపులే. భారతదేశానికి సరిహద్దు దేశ ప్రాంతాలున్నాయి. సుమారు 9 దేశాలు – ఆఫ్ఘనిస్తాన్, టిబెట్, మయన్మార్, పాకిస్తాన్, నేపాల్, చైనా.. ఇలా చాలా దేశాలున్నాయి. సుమారు 15106 కి.మీ వాస్తవాధీన రేఖ ఉంది. ఆ సరిహద్దు నుండి సుమారు 100 కి.మీ లోపు ఉన్న అటవీ భాగం ఏదీ కూడా సంరక్షణ చట్టం పరిధిలోకి కాదు. దీని ప్రకారం జమ్మూ కాశ్మీర్‌లో 95 శాతం అటవీ భూభాగంలో వాళ్ళిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. ఎందుకు 100 కి.మీ అంటే ఏం చెబుతారంటే జాతీయ భద్రత కోసం రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం అంటారు. నాగాలాండ్, మిజోరాం లడఖ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో చాలా ప్రాంతాలు, ఆరావళి పర్వతాలు ఈ వంద కి.మీ పరిధిలోనే ఉన్నాయి. వీటిలో మంచి మంచి వృక్షాలున్న ప్రాంతాలున్నాయి. ఈ 15106 కి.మీ వాస్తవాధీన రేఖ నుండి 100 కి.మీ. ఉన్న ప్రాంతాన్నంతా కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుంది. తీసుకున్నాక దాన్ని ఎవరికన్నా ఇవ్వొచ్చు. అటవీ సంరక్షణ చట్టం పరిధికి బయట ఉన్న అటవీ భూమిని ప్రభుత్వం కార్పోరేట్ రంగానికి ఇవ్వొచ్చు, పారిశ్రామిక వేత్తలకు ఇవ్వొచ్చు, వాళ్ళే వాడుకోవచ్చు. అది వాళ్ళ ఇష్టం. సంరక్షణ చట్టం పరిధిలో ఉంటేనే అడవికి కొన్ని కండిషన్స్ ఉంటాయి. అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాలకు వాడకూడదనే నియమం అప్పుడు వర్తిస్తుంది. అదే చట్టం పరిధికి బయట ఉండే ఎవరికైనా ధారాదత్తం చేసే అవకాశం ఉంటుంది. ఇంకా అవసర మనుకుంటే పది హెక్టార్ల అటవీ భూమిని సెక్యూరిటీ పేరుతో తీసుకోవచ్చు. ఇది కూడా సంరక్షణ చట్టం పరిధిలోకి రాదు.

అదే విధంగా తీవ్రవాద ప్రభావం ఉన్న ప్రాంతాలున్నాయి. దేశంలో సుమారు 55 జిల్లాలు తీవ్రవాద ప్రభావితమైనవిగా గుర్తించబడ్డాయి. ఆ ప్రాంతాల్లో 5 హెక్టార్ల భూమిని ప్రభుత్వం మళ్ళించుకోవచ్చు. దానికి ఈ సవరణ చట్టం వర్తించదు. ఇక నగరీకరణ అనేక రాష్ట్రాల్లో పెద్దఎత్తున జరుగుతూ ఉంది. రోడ్లకిరువైపులా చెట్లుంటాయి. ఈ చెట్లు తొలగించకుండా ఉండటానికి ఈ చట్టం వర్తించదు. ఒకప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తుప్పలు, పొదలు, తోపులు ఉన్న ప్రాంతమంతా అడవే అన్నారు కాబట్టి వాటిని కొట్టెయ్యటానికి లేదు, ఇప్పుడు సవరణ చట్టం ప్రకారం కొట్టెయ్యొచ్చు. రోడ్ల పేరుతోనో, మరో పేరుతోనో వీటన్నింటినీ ధ్వంసం చెయ్యటానికి ఈ సవరణ చట్టం అవకాశం కల్పిస్తోంది. సంరక్షణ అనే మాటకి దీనికి సంబంధించిన అనుబంధ కార్యక్రమాల్లో భాగంగా జూలు గానీ, సఫారీలు గానీ, ఎకోటూరిజం యాక్టివిటీస్ గానీ అన్నీ కూడా సంరక్షణ పరిధిలోకే వస్తాయి. ఈ రోజున భారతదేశంలో ప్రైవేటు టూరిజం ఉంది, గవర్నమెంటు టూరిజం కూడా ఉంది. ఎకోటూరిజం పేరుతో వైల్డ్ లైఫ్ శాంక్చ్యురీలు గానీ, వన్య సంరక్షణా కేంద్రాలు గానీ, జూలు, సఫారీలు గానీ, సెరీకల్చర్ యాక్టివిటీస్ గానీ ఏ కారణమైనా చూపించి ఆ భూములన్నీ అటవీ సంరక్షణ చట్టానికి వర్తించవన్న మినహాయింపు నిచ్చారు. ఇంకా చెప్పాలంటే అడవిలో గనుక గనులున్నట్లయితే, లేకపోతే చమురు నిల్వలున్నట్లయితే, లేక ఖనిజ వనరులున్నట్లయితే ఇప్పటివరకు ఉన్న 1980 అటవీ సంరక్షణ చట్టం ప్రకారం అడవిలో భూమిని చిన్న గడ్డపారతో కూడా తవ్వటానికి లేదు. అటవీ భూమిలో ఇసుకను తియ్యటానికి కూడా లేదు. ఇప్పుడు మాత్రం భూమిలో ఏమున్నాయన్న పరిశోధనలు చేసుకోవచ్చు – అంటే తవ్వుకోవచ్చు, చెట్లు నరకొచ్చు, ఏమైనా చెయ్యొచ్చు ఈ పనులు అటవీ సంరక్షణ చట్టం పరిధిలోకి రావు. పెద్ద మోసమిది. ఇప్పుడు సవరించిన చట్టం ప్రకారం సర్వేల పేరుతో గానీ, పరిశోధన పేరుతో గానీ ఏపనైనా ప్రభుత్వాలు చేసుకోవచ్చు. అడవిలో ఏమన్నా ఉన్నాయనిపిస్తే అక్కడంతా తవ్వేస్తారు. చెట్లన్నీ నరికేస్తారు, డ్రిల్లింగ్ చేస్తారు సారాంశంలో ఈ సవరణ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడవిని నాశనం చేస్తారు. స్థూలంగా ఇదీ అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023.

అయితే ఈ సవరణ చట్టం తీసుకురావటానికి ముందు రూల్స్ కూడా తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం. నాలుగైదు సంవత్సరాల నుండి అటవీ శాసనాలను నిశితంగా పరిశీలించినట్లైతే, ఇంతకు ముందు చాలా చట్టాల్లో మార్పులొచ్చేశాయి, అవి ఎవరికీ తెలియకుండా వచ్చేశాయి. మొట్టమొదటిసారి 2019లో కేంద్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, అటవీ మంత్రిత్వ శాఖ (సైన్సు, టెక్నాలజీ, క్లైమేట్, పర్యావరణం మొ॥ వాటిని చూసే చాలా పెద్ద మంత్రిత్వశాఖ) ఈ రెండు శాఖల సెక్రెటరీలు ఒక స్టేట్‌మెంటు ఇచ్చారు. ఏమంటే ఈ రోజు నుండి అడవులకు సంబంధించి, హక్కులకు సంబంధించి రెండు మంత్రిత్వశాఖలు కలిసి సంయుక్తంగానే ప్రకటిస్తామని వెల్లడించారు. ఎందుకలా అన్నారంటే కేంద్ర ప్రభుత్వ బిజినెస్ రూల్స్ ప్రకారం అటవీ హక్కుల చట్టం అమలు బాధ్యత కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖపై ఉంది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చింది. ఎందువల్లనంటే, చారిత్రకంగా ఆదివాసీలు అన్యాయానికి గురైన సందర్భాలున్న కారణంగా ఆ అన్యాయాన్ని సరిదిద్దటానికి వచ్చిన చట్టం – అటవీ హక్కుల గుర్తింపు చట్టం. భారత రాజ్యాంగం కింద ఉన్న శాసనాల్లో ఎక్కడా కూడా మనకు పీఠిక అనేది ఉండదు. ఉన్నా కూడా భారతదేశం మొట్టమొదటిసారిగా అంగీకరించిన విషయమేమంటే అటవీ హక్కుల చట్టం పీఠికలో చారిత్రకంగా ఆదివాసీలను ప్రభుత్వాలు తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నాయి. వారి హక్కులను గుర్తించట్లేదు. ఆ అన్యాయాన్ని సరిదిద్దటానికి ఈ చట్టం చేస్తున్నామని ప్రభుత్వం ఒప్పుకుంది. నిజమే, ఆదివాసీలకు అడవులపై సహజంగా హక్కులున్నాయి. కానీ బ్రిటిషు ప్రభుత్వం గానీ, తర్వాత వచ్చిన భారత ప్రభుత్వాలు గానీ ఏనాడూ అడవిని సహజమైన వనరుగా చూడలేదు. బ్రిటిషు వాళ్ళు అడవిని ఆదాయవనరుగా చూశారు. అవే ఇంపీరియల్ పాలసీలు ఈనాటికీ కొనసాగుతూ వస్తున్నాయి. ఉంటే అడవి ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి, లేకుంటే కార్పోరేట్ల ఆధీనంలో ఉండాలి తప్ప ప్రజలకు అంటే ఆదివాసీలకు ఏ హక్కులూ ఉండకూడదనే ఆలోచనే కొనసాగుతూ వస్తోంది. బ్రిటిషు వాళ్ళకు గానీ, భారత పాలకులకు గానీ ఏ భూమి అయినా అది ఆదాయ వనరుగా ఉండాలి. మరి అటవీ హక్కులు గుర్తింపు చట్టంలో ఏం

ఉంది? డిసెంబరు 13, 2008 నాటికి అడవుల మీద ఆధారపడి జీవించేవాళ్ళు, పోడు భూములు చేసుకునేవాళ్ళ హక్కుల్ని గుర్తించటం కోసం, క్రమబద్ధీకరించటం కోసం చేసిన చట్టం అది. ఆ చట్టం అమలు బాధ్యత గిరిజన మంత్రిత్వ శాఖది. కానీ 2019 నుంచి మొదలుపెట్టారు మేమిద్దరం కలిసే స్టేట్‌మెంటు ఇస్తామని అంటే, గిరిజన మంత్రిత్వశాఖ ఏం చేయాల్సి ఉంటుంది? – అటవీ హక్కులు అమలు చేయాల్సి ఉంటుంది. ఫారెస్టు డిపార్ట్‌మెంటు ఏం చెయ్యాలి? అడవుల మీద వాళ్ళ గుత్తాధిపత్యం, పెత్తనం చేయాల్సి ఉంటుంది. వాళ్ళు పారిశ్రామికవేత్తలకో, కార్పోరేట్ రంగానికో ఇవ్వాలి. ఈ రెంటికీ మధ్య వైరుధ్యం ఏదైతే ఉందో, అది లేకుండా చెయ్యటానికి సింపుల్‌గా రెండు మంత్రిత్వశాఖలు కలిసే ప్రకటిస్తామన్నారు. అటవీ హక్కులను నాశనం చేయటానికి, ఆదివాసీల హక్కులను నాశనం చేయటానికి ఆనాటి నుండి అధికారికంగా పూనుకున్నారు.

దాని తర్వాత భారతదేశం అంతా కోవిడ్‌తో విలవిలలాడుతూ ఉంటే కేంద్ర ప్రభుత్వం 2020లో మైనింగ్ శాసనాలు సవరించేసింది. ఏం సవరించింది? మీకు మైనింగ్ లీజుకిచ్చినట్లైతే అది పూర్తయిపోయి రెండేళ్ళయినా మీరు మైనింగ్ చేసుకోవచ్చు అని కార్పోరేట్లకు అనుమతులు ఇచ్చేసింది. మైనింగ్ లీజుకివ్వాలంటే చాలా షరతులుంటాయి. ఆ షరతులేమీ లేకుండానే లీజు గడువు ముగిసినా ఇంకో రెండేళ్ళు మైనింగ్ చేసుకోవచ్చునంటున్నారు. 2020లో మైనింగ్ చట్టంలో ఈ మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శాసనం చేసింది, మైనింగ్ లా సవరిస్తూ 2021లో మరో చట్టం చేసింది. అదేమంటే మీ మైనింగ్ లైసెన్స్ ఎక్స్‌పైర్ అయిపోతే మీరు దానిని ఇతర వ్యక్తులకో, కంపెనీలకో బదలాయించుకోవచ్చు, లేదంటే మీరే కొనసాగవచ్చు.

'ఎన్విరాన్‌మెంటల్ ఎస్సెస్ ఇంపాక్ట్' అని ఒకటుంది. పర్యావరణ పరిరక్షణ చట్టం కింద ఉంటుంది. ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు టేకప్ చెయ్యాలనుకుంటే పోలవరం ప్రాజెక్టు గానీ, లేక ఏ ఇతర థర్మల్ ప్రాజెక్టులు గానీ ముందుగా పర్యావరణ ప్రభావాన్ని అంచనా వెయ్యాలి. అది చేసిన తర్వాతే ఏ ప్రమాదం లేదనుకుంటేనే ప్రాజెక్టుకు క్లియరెన్సు (అనుమతి) ఇవ్వాలి. మనకెవ్వరికీ తెలియకుండానే 'ఎన్విరానిమెంటల్ ఎస్సెస్ ఇంపాక్టు' గురించి ప్రభుత్వం 2020లో డ్రాఫ్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏమని, పబ్లిక్ హియరింగ్ అవసరం లేదు. ప్రజలేమీ ఆలోచించాల్సిన అవసరం లేదు, గ్రామసభలను సంప్రదించాల్సిన అవసరం లేదు. కొన్ని తరహా ప్రాజెక్టులకు అసలు ఎన్విరాన్‌మెంటల్ ఎస్సెస్‌మెంట్ అవసరం లేదు అని నోటిఫికేషన్ విడుదల చేస్తే కర్ణాటక హైకోర్టు స్టే విధించింది, ఢిల్లీ హైకోర్టు కూడా స్టే విధించింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆగిందా? ఆగలేదు. 2006లో వచ్చిన నోటిఫైడ్ ఎన్విరాన్‌మెంట్ ఎస్సెస్ ఇంపాక్టును సవరించుకుంటూ ఇప్పటి వరకు కూడా తాను చెయ్యాలనుకున్నది కేంద్ర ప్రభుత్వం చేస్తూనే ఉంది. కోర్టులు ఆగమన్నంత మాత్రాన ఆగలా. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఆపింది. కానీ, తాను చెయ్యదలచుకున్నది చేస్తూనే ఉంది. ఎన్విరానిమెంటల్ ఎస్సెస్‌మెంట్ జరిగితే ఏమవుతుంది? ప్రజలు వ్యతిరేకిస్తారు. ఇంత అడవి ఉంది. అడవి మీద ఆధారపడే వాళ్ళ హక్కులున్నాయి – వాళ్ళ హక్కులు తేల్చండి. లేకపోతే ఇంత అడవి నాశనమవుతుంది. ఇది గ్లోబల్ వార్మింగ్‌ను మరింత పెంచుతుంది కనుక ఇది చెయ్యటానికి వీల్లేదని ప్రజలు అడ్డుపడతారు. కాబట్టి ప్రజల ఆలోచనలు, ఆందోళనలు లేకుండా, వారి ప్రమేయమేదీ లేకుండా చెయ్యటానికే డ్రాఫ్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

'బయో–డైవర్సిటీ యాక్టు' – జీవ వైవిధ్యానికి సంబంధించిన చట్టం. జీవవైవిధ్య చట్టం కూడా కేంద్ర ప్రభుత్వం హెర్బల్ మెడిసినల్ ప్లాంటేషన్స్ ఉన్న కంపెనీలకు అటవీ భూములు కట్టబెట్టాలన్న ఉద్దేశ్యంతో ఈ బయో–డైవర్సిటీ చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం మార్చేసింది. పతంజలి ప్రొడక్టు వ్యాపారం గురించి మనందరకూ తెలిసిందే. మందుల కంపెనీల్లో 50 శాతం అల్లోపతి మందులైతే 50 శాతం హెర్బల్ మందులే. హెర్బల్ కాస్మోటిక్స్ వచ్చాయి, హెర్బల్ మందులొచ్చాయి, ఇంకా అనేక రకాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. వీటన్నిటికి మూల పదార్థం ఏమిటంటే హెర్బల్ ప్లాంట్స్. వనమూలికలు, ఇది ఇప్పుడు పెద్ద ఇండస్ట్రీ. మన ఆదివాసీలు అడవుల్లోకి వెళ్ళి కాయో, కసరో తెంపి ఔషధంగా వాడుకుంటుంటే అందరూ ఏమన్నారు? ఆదివాసీలు మూర్ఖులు, చదువులేనివాళ్ళు, వాళ్ళ ఆచరణకు శాస్త్రబద్ధత లేదు, నిబద్ధత లేదు. చెక్క మందులంటారు, చెట్ల మందులంటారు, వాటిని నమ్మాల్సిన పనిలేదు, అల్లోపతి శాస్త్రీయమైనది, రుజువైనది కాబట్టి అదే కరెక్టు అని చెప్పి గిరిజన ప్రాంతాలన్నింటా ప్రభుత్వాలు అల్లోపతి మందులను ప్రవేశపెట్టాయి. అల్లోపతి మందులతోనే, సూది మందులతోనే ప్రజల ఆరోగ్యాలు నయమవుతాయని కల్లబొల్లి మాటలతో ప్రజలను నమ్మించారు. ఇప్పుడేమంటున్నారు? హెర్బల్ మందులు చాలా ఉపయోగపడతాయి. సైడ్ ఎఫెక్టు ఏం ఉండవు అని చెప్పి మార్కెట్ శక్తులన్నీ ముందుకొచ్చాయి. మెడిసినల్ ప్లాంట్స్ కల్టివేషన్ (ఔషధ మొక్కల పెంపకం) కోసం ప్రభుత్వం కంపెనీలకు అటవీ భూములను ఇవ్వొచ్చు. దీనికి ఏ షరతులు వర్తించవు. బయోడైవర్సిటీ బోర్డు ఉంటుందంతే, దానితో ఏమీ సంప్రదించాల్సిన అవసరం లేదు. అదేమీ మీకు అనుమతులివ్వాల్సిన అవసరం లేదు, మీరు ఏ ఒత్తిడి లేకుండా ఔషధ మొక్కలు పెంచుకోవచ్చు అంటూ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చట్టం రూపొందించింది.

అంతేకాదు పర్యావరణానికి సంబంధించిన మూడు శాసనాలను ప్రభుత్వం మార్చేసింది. మనకు జల కాలుష్య నివారణ చట్టం 1974 ఉంది. వాయు కాలుష్య నివారణ చట్టం ఉంది. వీటన్నిటినీ మార్చేసింది. మీరు అటవీ హక్కులు సంరక్షణ చట్టం ఒక్కదాన్ని గురించే మాట్లాడుతున్నారు. కానీ అనేక చట్టాలను కార్పోరేట్ వ్యాపార వర్గాలకు అనుకూలంగా మలిచేందుకు ఒక పథకం ప్రకారం పద్ధతిగా మార్చుకుంటూ వస్తున్నది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 గురించి అందరికీ తెలిసిందే. చిన్న చిన్న బడిపిల్లలకు జెండాలిచ్చి పర్యావరణం జిందాబాద్ అనిపించటం తప్ప ప్రభుత్వం చేసేదంతా పర్యావరణానికి హాని కలిగించేదే. ఈ మూడు చట్టాల్లో వారు చేసిన మార్పేమిటంటే కార్పొరేట్ వర్గం గనుక కాలుష్యానికి కారకులైతే కేవలం పరిహారం చెల్లించండి చాలు. మీ ఫ్యాక్టరీ వల్ల

చుట్టుపక్కల వాయు కాలుష్యం ఏర్పడిందా? జల కాలుష్యం ఏర్పడిందా? డబ్బు కట్టిండి. గతంలో పర్యావరణ, జల, వాయు కాలుష్య నివారణ చట్టాలను ఉల్లంఘిస్తే కోర్టు జైలు శిక్ష వేయొచ్చు. ఇప్పుడు మార్పేమిటంటే జైలు శిక్ష స్థానంలో జరిమానాలు తీసుకొచ్చారు. పరిశ్రమలంటేనే లాభాలను సంపాదించిపెట్టేవి. డబ్బు రూపంలో జరిమానాలు కార్పోరేట్ వర్గాలకి పెద్ద విషయం కాదు. నేను రాజమండ్రిలో ఉంటాను. మొత్తం పట్టణమంతా దిగువభాగంలోనే ఉంటుంది, ఎగువన పేపర్ మిల్లు ఉంటుంది. దాని నుండి వెలువడే కాలుష్యం అంతా దిగువకే ప్రవహిస్తుంది. ఎంత కాలుష్యం వెదజల్లుతున్నారన్నది ఎవరు పర్యవేక్షించాలి? ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు దానిని నిర్ణయించాలి. కోర్టుకున్న అధికారం తీసేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఎంత బాగా చేస్తారో మనకు తెలుసు. బేరాలు మాట్లాడుకుని ఎంతోకొంత జరిమానా కట్టించటం తప్ప వాస్తవ కాలుష్యాన్ని లెక్కకట్టేదే లేదు. నేరపూరిత అంశాలకు సంబంధించిన గాఢతను ఇక్కడ తగ్గించారు. దీనికి పూర్తి భిన్నంగా వన్యప్రాణి సంరక్షణ చట్టం విషయంలో వ్యవహరించారు. అడవిలో జీవించే ఆదివాసులెవరైనా ఏదైనా వేటాడితే వన్యప్రాణి సంరక్షణ చట్టంలోని శాసనాలను కఠినతరం చేసి శిక్షలు పెంచేశారు. భారతదేశంలో వ్యవసాయరంగం తర్వాత ఎక్కువ భూమి ఉన్నది అడవిలోనే. కార్పోరేట్ రంగానికి భూములు కావాలి. అటవీ భూములను కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేయటానికి అడవిలో నివసించే ఆదివాసీల హక్కులను, ఇతర ప్రజల హక్కులను కాలరాచే విధంగా పద్ధతి ప్రకారం అనేక చట్టాలను మార్చుకుంటూ వస్తున్నారు.

అటవీ హక్కుల చట్టాన్నే చూద్దాం. అందులో సెక్షన్ 5 కింద అటవీ ప్రాంతంలోని వన్యప్రాణి సంరక్షణ ప్రాంతాలైనా రిజర్వు ఫారెస్టు అయినా అక్కడ నివసించే ప్రజల సాంస్కృతిక జీవనంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి గ్రామసభదే ఏదైనా అధికారం. వన్యప్రాణి సంరక్షణ కానీ, అటవీ భూముల రక్షణ గానీ, సాంస్కృతిక సంపద గానీ గ్రామసభల ద్వారా ప్రజలదే అధికారం. ఆదివాసీ దశాబ్దాల తరబడి పోరాటాలతో అటవీ హక్కుల చట్టం ద్వారా ఆ అధికారాన్ని మొక్కుబడిగా గుర్తించారు. ఇప్పుడు వన్యప్రాణి సంరక్షణ అంతా ఛీఫ్ వార్డెన్ చేసుకుంటాడు అంటున్నారు. ప్రజలకున్న అధికారాన్ని ఉల్లంఘిస్తూ, గ్రామసభల అధికారాన్ని ఉల్లంఘిస్తూ ఈ మార్పులు తీసుకువచ్చారు. దీనికి ముందు అటవీ సంరక్షణ నియమాలు వచ్చాయి. పాత నియమాలు 2003, 2007 ప్రకారం అటవీ భూమిని మళ్ళించాలంటే ముందు అటవీ హక్కులు నిర్ధారణ కావాలి. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు కింద అటవీ హక్కుల చట్టం ప్రకారం ముందు పరిహారం చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టు మొదలు పెట్టాలి. కానీ ఈనాటికీ పరహారం చెల్లించనేలేదు. ఒక్కళ్ళకు కూడా పైసా ఇవ్వలేదు. రెవెన్యూ భూములు పోయిన వాళ్ళకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చారు. భూసేకరణ చట్టం ఏం చెబుతోంది? పోడు భూములకు కూడా పరిహారం చెల్లించాల్సిందేనంటోంది. రెవెన్యూ భూములతో సమానంగా ఫారెస్టు పట్టా భూములకు పరిహారం చెల్లించాలి. దాన్ని ఎక్కడా అమలు చెయ్యలేదు.

మైనింగుకి కానీ, ఇతర ప్రాజెక్టులకుగానీ అటవీ భూములను మళ్ళించాలంటే కూడా ముందు అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూములకు పరిహారం చెల్లించాలి. కానీ ఇప్పుడు మార్పు చేసిన చట్టం ప్రకారం అటవీ హక్కుల చట్టంలో పేర్కొన్నట్లు అటవీ భూములకు, ఆదివాసులకు పరిహారం చెల్లించకుండానే కలెక్టరు మైనింగ్ కంపెనీలకు మైనింగ్ కొరకు పర్మిషన్ ఇవ్వొచ్చు, అంటే కలెక్టరుదే అధికారం. జిల్లా కలెక్టర్లు ఏం చెయ్యాలి? అటవీ హక్కుల వర్తింపుకు కూడా అతడిదే అధికారం. అటవీ హక్కుల గుర్తింపులో ముందు గ్రామసభ, తర్వాత సబ్‌డివిజనల్ కమిటీ, తర్వాత డిస్ట్రిక్టు లెవెల్ కమిటీ – డిస్ట్రిక్టు లెవెల్ కమిటీ అధ్యక్షుడు జిల్లా కలెక్టరు. అటవీ హక్కుల చట్టం కింద పోడు భూముల హక్కులు రికార్డు అయ్యాయా లేదా, కమ్యూనిటీ హక్కులు నిర్ధారణ అయ్యాయా లేదా, అటవీ వనరుల హక్కులు నిర్ధారణ అయ్యాయా లేదా – అందరూ పోడు హక్కుల గురించే మాట్లాడుతున్నారు. నిజానికిది చాలా చిన్న విషయం. పోడు భూమి ఎంతుంటుంది ఎకరం, రెండెకరాలు లేకపోతే మూడు ఎరకాలు. అటవీహక్కుల గుర్తింపు చట్టం కింద దాని కంటే చాలా గొప్ప హక్కులు ఇచ్చారు. అవే కమ్యూనిటీ రైట్స్. వాటి గురించి మనం ఆలోచన చేయటం లేదు. అడవిలోని మేత స్థలాలు – పశువుల మేత స్థలాలకు చెందిన హక్కులున్నాయి. అదివాసీల సాంప్రదాయ స్థలాలుంటాయి. చెట్టుంటుంది, పుట్ట ఉంటుంది, గుట్ట ఉంటుంది, అటవీ హక్కుల చట్టం ప్రకారం వాటికి కూడా హక్కులు వర్తిస్తాయి. కుంకుళ్ళకో, లేక అనేక అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవుల్లో చాలా దూరం వెళ్తుంటారు. ఈ ప్రాంతాలన్నీటినీ కమ్యూనిటీ రైట్స్ కింద తీసుకోవచ్చు. కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్సెస్ రైట్ అన్నిటికన్నా విలువైనది. ఆదివాసీలకు, అటవీ నివాసితులకు అడవులను పరిపాలించుకునే అధికారం ఇచ్చారు. కేవలం పోడు భూముల గురించి మాట్లాడటమే తరచుగా జరుగుతోంది. దానికి మించిన హక్కులు, చాలా విలువైనవి ఉన్నాయి. రాష్ట్రంలో ఎన్ని లక్షల ఎకరాలు అటవీ భూమి ఉందో తెలుసా, అటవీ వనరుల హక్కు పొటెన్షియల్ ఏరియా ఎంతంటే తెలంగాణాలో రెవెన్యూ గ్రామాల సరిహద్దు లోపల సుమారు నలభై లక్షల ఎకరాలు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 35 లక్షల ఎకరాలు ఉంది. ఇది రిజర్వు ఫారెస్టులకు వెలుపల రెవెన్యూ గ్రామాల లోపల ఉన్న అటవీ భూమి. 2016లో నేను అధ్యయనం చేసినప్పుడు బయటపడ్డ అంశాలివి. 35 లక్షల ఎకరాలు, 40 లక్షలు ఎకరాల భూమి గురించి మనం ఉద్యమించకుండా, పోరాటం చెయ్యకుండా, మా హక్కులు నిలబెట్టండి అడవి మీద అధికారం గ్రామసభదే అయినప్పుడు అసలు అటవీశాఖ ఎవరు? ఈ రోజు సుమారు $4^1/_2$ లక్షల ఎకరాల్లో వన సంరక్షణ సమితులు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 9 లక్షల ఎకరాల్లో ఉంది. ఈ తొమ్మిది లక్షల ఎకరాల్లో అడవిని పెంచింది ఎవరు? ఆదివాసీలు, వనసంరక్షణ సమితులు కలిసి అభివృద్ధి చేశారు. ఇప్పుడు వాటిపై కమ్యూనిటీ రైట్స్ అడగొచ్చు. ఇప్పుడు చేసిన అటవీ హక్కుల సంరక్షణ సవరణ చట్టం, అటవీ హక్కుల చట్టం ప్రకారం వర్తించే హక్కులన్నింటికీ విఘాతం కల్గించే చట్టం. ఓ ప్రక్కన హక్కులున్నట్లు చెప్పటం, మరోప్రక్కన ఇచ్చిన హక్కు లన్నింటినీ లాగేసుకుని, భూములన్నింటికీ ప్రభుత్వం కబ్జా చేసి, కార్పోరేట్ రంగానికి పంచేందుకు, ధారాదత్తం చేసేందుకు చేసిన

కుట్ర అని మార్పు చేసిన అనేక శాసనాల్లో మనకు కనపడుతూ ఉంది. అంటే ఎవరి కోసం చేస్తున్నారిదంతా. పీసా యాక్టు ఉంది. మైనర్ ఫారెస్టు ప్రొడ్యూస్ మీద ఓనర్‌షిప్ రైట్ ఇచ్చారు. అంటే యాజమాన్యపు హక్కు ఒక పక్క ఆదివాసీలకు, గ్రామసభలకు మరోవైపు అడవి అంతా నాదేనంటుంది ప్రభుత్వం. తమకే హక్కని కార్పోరేట్ సెక్టార్ అంటుంది. ఎలా సాధ్యమిది. చట్టబద్ధత ఉండాలి కదా (లీగల్‌గా అవ్వాలి కాదా). ఒక పక్క రాజ్యాంగం అంటారు, శాసనాలున్నాయంటారు. వాటి ప్రకారం ఉన్న హక్కులు వేటినీ నిర్ధారించకుండానే అటవీ భూముల మైనింగుకో, ప్రాజెక్టులకో ఎలా ఇస్తారు? మరో విషయం ఈ సవరణ చట్టంలో ల్యాండ్ బ్యాంకు క్రియేషన్ కూడా ఉంది. ఎఫారెస్టేషన్ కొరకు కొంత భూభాగాన్ని సేకరించటం. ఎవరి కోసం ఇది? కలప ఆధారిత పరిశ్రమలకు అడవులను అప్పగించటం కోసమే. ఇప్పుడు చేసిన సవరణ చట్టానికి కన్సల్టేషన్ పేపర్ అని 2021లో ఒకటి తీసుకువచ్చారు. సంప్రదించటానికే తీసుకొచ్చామని చెబుతున్నారు కానీ అది ఎవరికీ తెలియదు. ఇప్పుడు కూపీ లాగితే బయటపడింది, నేషనల్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలోని అటవీ భూములు సంరక్షణ చట్టం పరిధిలోకి రావు, పి.డబ్ల్యు.డి ఆధీనంలోని అటవీ భూములు సంరక్షణ చట్టం పరిధిలోకి రావు, రైల్వే డిపార్టుమెంటు ఆధీనంలోని అటవీ భూములు సంరక్షణ చట్టం పరిధిలోకి రావు అని 2021లోనే ఆ కన్సల్టేషన్ పేపర్‌లో రాశారు. మనకి తెలుసుకోవటానికి ఆలస్యమైందంతే. ఒకప్పుడు ఉద్యమాలు – చట్టం చేయాలని పోరాటాలు చేసిన పరిస్థితి. ఇప్పుడు ఆ చట్టాలను నిలబెట్టుకోవటానికి పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ రోజున్న చట్టం రేపుంటుందో లేదో తెలియదు. మరోవైపు అప్పటికే ఉన్న శాసనాలకు విఘాతం కలిగించే విధంగా సమాంతరంగా ఇదిగో ఇప్పుడు తీసుకువచ్చిన అటవీ హక్కుల సంరక్షణ సవరణ చట్టం. నేడు మన ముందు మూడు మార్గాలు కనపడుతున్నాయి. ఆదివాసీల హక్కులు కొరకు పోరాడాలి. ఆదివాసీలకుపయోగపడే అటవీ చట్టాల అమలు కోసం పోరాడాలి. ఆదివాసీలకే కాక ప్రజలందరికీ వ్యతిరేకమైన, దేశానికే హానికరమైన, పర్యావరణానికి హానికరమైన అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023 వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాలి.

అటవీ చట్టాల గురించి నాకు తెలిసిన విషయాలను మీతో పంచుకునేందుకు అవకాశమిచ్చిన నిర్వాహకులకు, మీకు అందరికీ కూడా ధన్యవాదాలు.

## శ్రీ పాకలపాటి రఘువర్మ



**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ**

ఆదివాసీల పోరాటాలకు అండగా నిలబడదాం!

మిత్రులారా!

అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దుకై రైతుకూలీ సంఘం(ఆం.ప్ర), ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరుగుతున్న అఖిల భారత ఆదివాసీ సదస్సుకు విచ్చేసిన ఆదివాసీలకు, ప్రజాతంత్రవాదులకు, మేధావులకు ముందుగా నా అభినందనలు!

ఇటీవల చెన్నైలో జి-20 దేశాల పర్యావరణ, అడవుల సంరక్షణ శాఖల మంత్రుల సమావేశం జరిగింది. అందులో ప్రసంగించిన నరేంద్రమోదీ నదులు నీరు తాగవు.. చెట్లు పండ్లు తినవు. వాటిని మానవాళే ఉపయోగించుకుంటుంది. కనుక పర్యావరణాన్ని మనమే కాపాడుకోవాలన్నారు. దీనికి కొద్ది రోజుల క్రితమే జీవ వైవిధ్యాన్ని, మన జీవనానికి అవసరమైన ఆక్సిజన్‌లో కొంతభాగాన్ని అందించే చెట్లను, ప్రకృతిని ధ్వంసం చేసేందుకు వీలుగా కొన్ని చట్ట సవరణలు మోదీ ప్రభుత్వం చేసింది. వీటి మూలంగా సామాన్య జనం జీవితాలను నిలువులోతు పాతరేశారు. అదే సమయంలో అడవులలో చెట్లు నాశనంచేసి కార్పొరేట్లు, కుబేరులు ఖనిజాల కోసం గనులు తవ్వుకొనేందుకు గొప్ప అవకాశం కల్పించారు. వీటిపైన వచ్చే అపార లాభాలలో పాలక పార్టీలకు ముడుపుల ద్వారా కోట్లు దక్కే అవకాశం ఉంటుంది.

ఒకవైపు మణిపూర్‌లో దాదాపు మూడు నెలలుగా మంటలు చెలరేగుతూ, అల్లకల్లోలంగా ఉన్నప్పటికీ మోదీ పట్టించుకోలేదు. ఈ అంశంపై ప్రతిపక్షాలు నిరసన తెలిపే సమయం చూసి చర్చ లేకుండా అటవీ సంరక్షణ చట్టానికి సవరణను పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకున్నది. ఆదివాసీల గ్రామసభలలో చర్చలేదు. ఆమోదించనూ లేదు. గ్రామసభల ఆమోదం తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, దాన్ని బేఖాతరుచేసి బిల్లును ఆమోదించడం నిరంకుశ నిర్ణయం.

ప్రభుత్వ రికార్డుల్లో 'అడవి'గా నమోదుచేసిన భూమిని సంరక్షించడానికి 1980లో అటవీ సంరక్షణ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం తీసుకు వచ్చింది. 1996లో గోదావర్మన్ కేసులో దేశ చట్టాలు అడవి అంటే ఏమిటో నిర్వచించాయి. వీటిని పరిగణలోకి తీసుకొని అడవిగా పేర్కొన్న లక్షల ఎకరాల భూమిని చట్టపరిధిలోకి తీసుకువచ్చారు. ఇక తాజాగా సవరించిన చట్టాల ప్రకారం లక్షల ఎకరాలను ఇకపై అడవిగా పరిగణించబోరు. ఉదాహరణకు మణిపూర్ దేశ సరిహద్దుల్లో వివిధ రకాల విలువైన ఖనిజాలున్నాయని భూగర్భ సర్వేవిభాగం తెలిపింది. ఈ ప్రాంతాలను ఖనిజాలకోసం గనులు తవ్వడానికి చట్టసవరణలు అనుమతిస్తాయి. ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థలను, బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ప్రభుత్వ రంగంలో సంస్థలను నిర్మించడానికి, దేశ స్వావలంబనకోసం ప్రజలు, ప్రభుత్వంచేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరవుతోంది. మణిపూర్‌లో హింసాకాండ సృష్టించి గిరిజనులు, క్రైస్తవులైన కుకీలు కొండప్రాంతాలను ఖాళీ చేయించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. కొండప్రాంతాలు ఖాళీ అయిన తర్వాత వాటిని తమ కార్పోరేట్లకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతుందని, ఇందుకోసమే మణిపూర్‌లో మంటలు రేపిందనేది జగమెరిగిన సత్యం.

మణిపూర్‌లో మాత్రమే కాదు, అనేక సరిహద్దు ప్రాంతాలలో గిరిజనులను కష్టాలపాలు చేయడానికే బీజేపీ ప్రభుత్వం వ్యూహం పన్నిందని జరుగుతున్న పరిణామాలు తెలియజేస్తున్నాయి. సరిహద్దు

ప్రాంతాల్లో ఎక్కువగా ఉద్రిక్త సంఘటనలు జరగుతుంటాయి. ఇవి ప్రమాద సూచికలు. అయినా అనేకమంది వాతావరణ నిపుణులు అభ్యంతరం పెట్టినా చట్టసవరణలపై చర్చ లేకుండానే ఉభయ సభలు ఆమోదించాయి. నియంతృత్వ ధోరణిపాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ ప్రజల అభ్యంతరాలను ఆయన ఆలకించిన సంఘటనలు దాదాపులేవు. జి20 దేశాల వాతావరణశాఖ మంత్రుల సమావేశాలు తీసుకున్న నిర్ణయాలకు, మనం ఇచ్చిన హామీలకు భిన్నంగా మోదీ ప్రభుత్వం చట్ట సవరణలు చేసి పర్యావరణకు తీవ్రమైన హాని చేస్తున్నారు. బయటకు చెప్పేది ఒకటి, చేస్తున్నది మరొకటిగా మోదీ పాలన ఉంది. ఒకవైపు దేశంలో ఇన్ని ప్రజా వ్యతిరేక విధానాలు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకుండా ఉంది. కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాలకు, బిల్లులకు ఆమోదం తెలుపుతుంది తప్పితే దాని వలన పేద ప్రజలకు, ఆదివాసీలకు ఎంత నష్టం కలుగుతుందో ఆలోచించటం లేదు.

2019లో ఆదివాసీలను ఆక్రమణదారులుగా చిత్రిస్తూ, వారు అడవుల నుండి వెళ్ళిపోవాలని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చినప్పుడు …ఇదే విశాఖపట్నంలో ఎఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో వేలాది మంది ఆదివాసీలతో బహిరంగసభ జరిపి, పెద్ద ఎత్తున ఊరేగింపు తీశారు. ఆ విధంగా సుప్రీంకోర్టు తీర్పును చైతన్యంతో ఆదివాసీలు తిప్పికొట్టారు. ఆ గొప్ప కార్యక్రమంలో నేను సంఘీభావంగా పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. ఈ రోజు అలాంటి మరో ఆదివాసీ వ్యతిరేక సవరణ చట్టం కేంద్ర ప్రభుత్వం చేస్తే… మీరు అంతే ధీటుగా ఎదురొడ్డి పోరాడుతున్నారు. మీ పోరాటానికి నా అభినందనలు. మీరు జరిపే ప్రజా పోరాటాలకు, ఆందోళనలకు ఎల్లప్పుడూ సంఘీభావంగా ఉంటాననీ తెలియజేస్తూ, నాకు అవకాశం యిచ్చిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు!!

## శ్రీ ఘాసీరాం సొరేన్,

### అఖిల భారత ఆదివాసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి



***అధ్యక్షా, అతిథులారా, ప్రతినిధులారా!***

అఖిల భారత ఆదివాసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శిగా నేను ఈ మహాసభలో పాల్గొంటున్నాను. ఒడిసాలోని రూర్కేలా నుంచి నేను వచ్చాను. దేశంలోని మొత్తం ఆదివాసీ జాతికి సంబంధించిన విషయాలపై చర్చోపచర్చలు, ఇక్కడ జరగడం నాకెంతో సంతోషాన్ని కల్గిస్తోంది.

ఆదివాసీల పోరాటం సుదీర్ఘమైనది. ఇది ఇంకా కొనసాగుతూనే వుంటుంది. ఈ పోరాటం వారి చరిత్రకూ, ఇండియా ఉనికికీ సంబంధం కలిగి వుంది. దేశ వ్యాప్తంగా ఆదివాసీల ఉద్ధరణ అన్ని రంగాలలోనూ జరగాలన్న ఆశయం వున్నవారికి ఎటువంటి ప్రయోజనమూ కలగడంలేదు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రధాన ప్రవంతి కార్యక్రమాలు, వారికి మరింత బాధను కలుగ చేస్తున్నాయి. ఎందుకంటే, ఆ కార్యక్రమాల ద్వారా వారి జీవితాలను కూకటి వ్రేళ్ళతో తవ్విపారేస్తున్నారు. పైరుపచ్చ భవిష్యత్తు కోసం ఆదివాసులు ప్రధానమైన పాత్ర వహిస్తారు. ఆదివాసీలకు పర్యావరణంపై వున్న అత్యంత విలువైన జ్ఞానం, తెలివితేటలు, నైపుణ్యాలు అశ్రద్ధ చేయడం మొత్తం దేశానికి నష్టకరం.

కొత్తగా చేసిన ఈ అటవీ సంరక్షణ (సవరణ) బిల్లు లోక్‌సభలో మార్చి 2019లో ప్రవేశబెట్టారు. 1980 నాటి అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని మార్చడానికి దీనిని బిజెపి యం.పి.లతో మాత్రమే కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించారు. అదే సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని సూచించారు. రాజ్యాంగబద్ధంగా ఆదివాసీలకు అటవీ భూమిపైన, వనరులపైన రక్షణ కల్పించిన హక్కులపై అటవీ సంరక్షణ (సవరణ) చట్టం ప్రభావం చాల తీవ్రంగా వుంటుంది. అటవీ సంరక్షణ చట్టంలో సవరణలు ఎందుకు అవసరమయ్యాయంటే, దానిలోని కొన్ని అంశాలు పర్యావరణ, సామాజిక వాతావరణ అభివృద్ధిని సవాలు చేయడమేగాక, పెద్దఎత్తున అటవీ భూమిని అటవేతరంగా ప్రైవేటు కార్పొరేషన్లు ఉపయోగించుకునే సౌకర్యం కల్పిస్తోంది.

ఈ 2023 సవరణ చట్టం ద్వారా ఆదివాసీలను ఖాళీ చేయించడం, విస్తాపనకు గురిచేయడం, ప్రాచీన గిరిజన తెగల వారిని తరిమివేసి, 586 షెడ్యూలు ప్రాంతాల్లో అటవీ భూమిని అటవేతర భూమిగా మార్చడం సులభతరం అవుతోంది. ఇది ఆదివాసీ జాతుల జీవనశైలిపై, సాంస్కృతిక, సామాజిక ఆర్థిక, పర్యావరణాలపై ప్రతికూల ప్రభావం కలుగచేస్తుంది. అభివృద్ధి పేరుతో ఆదివాసీ జాతులను, ప్రత్యేకంగా పి.టి.జిల (ప్రిమిటివ్ ట్రైబల్ (గ్రూపు) నష్టపరిహారం కానీ, పునరావాసం కానీ లేకుండా విస్తాపనకు గురి చేస్తుంది.

భారత యూనియన్‌లో ఒక రాష్ట్రమైన ఒరిస్సాలోని అడవుల మధ్య వున్న భూమి ఒక వైరుధ్యాల పుట్ట. చారిత్రకంగా, భౌగోళికంగా సంపద్వంతమైనదే కాని దేశంలో అత్యంత పేద రాష్ట్రం అది. కనుక సహజంగానే కేంద్ర ప్రభుత్వపు డేగ కన్ను ఈ అడవులలో వున్న విలువైన వనరులపై పడింది. నిజానికి అడవులు జాగ్రత్తగా వున్నాయి అంటే ఈ ఆదివాసీల వల్లనే అని చెప్పాలి.

ఈశాన్య ప్రాంత రాష్ట్రాలకు బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్ దేశాలతో సరిహద్దు ప్రాంతం వుంది. ఈ బిల్లు 90 శాతం నాగాలాండ్‌కు వర్తిస్తుంది. అరుణాచలప్రదేశ్, అస్సాం, మేఘాలయ, మిజోరాం, మణిపూర్, త్రిపురలలో విశాలమైన భూఖండాలకు కూడా వర్తిస్తుంది.

అటవీ ప్రాంతాలను ప్రైవేటువారికి, ఎకో–టూరిజం వారికి, జూ లవారికీ, సఫారీలకు లీజుకు ఇవ్వవచ్చని ఈ బిల్లు సూచిస్తోంది. అడవులను ఒక సరుకుగా మార్చి, ఐదు ట్రిలియన్ డాలర్ల విలువ గల ఆర్థికరంగాన్ని నిర్మించడం బిజెపి ప్రణాళికతో సరిపోయే కార్యక్రమమే.

జీవ వైవిధ్య ప్రాంతాలలో పామ్ ఆయిల్ ప్లాంటేషన్లు, ఒకే పంట పండించడం (monoculture) జుమ్ భూముల్లో సంప్రదాయ పద్ధతుల్లో వేసి అమ్మడానికి పనికి వచ్చే పంటలు (cash crops) ఇవన్నీ ఆదివాసీ జాతిహక్కులకు ఆటంకం కల్గిస్తున్నాయి.

వన్యజాతి సంరక్షణ విషయంలో ఆదివాసీ జాతులవారు కొన్ని జంతువులను, మొక్కలను, చెట్లను ధ్వంసం చేయగూడదనేవారున్నారు. అది వారి మత విశ్వాసం – ఉదాహరణకు అరుణాచలప్రదేశ్‌లోని ఆదివాసీ తెగవారు వోజోఘ పర్వతాన్ని పవిత్రమైన పర్వతంగా పరిగణిస్తారు. మరాంగ్ బురు (పార్శ్వనాథ్ పర్వతం), జార్ఖండ్‌లోని లుగు బురు ఘంటాబరి, పురూలియా (పశ్చిమ బెంగాల్)లోని అజోడియా పర్వతం, ఒడిస్సాలోని మయూర్ భంజ్‌కు చెందిన సిమ్లిపాల్ అడవిలోని ఆత్ర దేవతల సోనా గండ, ఒడిసాలోని కంధమాల్‌కు చెందిన నియామ్‌గిరి పర్వాతాలు ఈ జాబితాలోనివే.

### కేంద్ర ప్రభుత్వం ఒక పద్ధతిని పాటించడంలేదు

1. కాంగ్రెస్ కమిటీ పార్లమెంట్ సభ్యుడు జయరాం రమేశ్ నాయకత్వాన గల సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్, అడవులు, వాతావరణ మార్పులపై స్టాండింగ్ కమిటీకి ఈ బిల్లును రిఫర్ చేయలేదు. అలా చేయడం తప్పనిసరి కాకపోయినా అది మంచి సంప్రదాయం. ఈ అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు 2013 విషయంలో అలా ప్రభుత్వం పంపడంలో నిర్లక్ష్యం చేసింది.

2. ఆదివాసీ గ్రూపుల నుంచి, అటవీ సంరక్షణవాదుల నుంచీ, పర్యావరణ లాయర్ల నుంచీ, కార్యకర్తల నుంచీ, పౌరసమితుల నుంచీ వచ్చిన అభ్యంతరాలు – 1200 విజ్ఞప్తులలో ప్రతిపాదింపబడిన బిల్లులో ఒక్క మార్పును కూడా సూచించలేదు.

జెపిసికి చెందిన ఆరుగురు సభ్యులు అసమ్మతి చెబుతూ రాసి ఇచ్చారు. ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కూడా జె.పి.సి గురించి, ఫారెస్ట్ హక్కుల చట్టం 2006లో ఇచ్చిన కమ్యూనిటీ హక్కులపై సవరణలు ఇవ్వడంలో లోతుపాతుల గురించి ఆందోళన వ్యక్తం చేసింది.

మంత్రిత్వశాఖ పంపిన లేఖలో క్లాజు తర్వాత క్లాజుపై వ్యాఖ్యలు చూస్తే, యూనియన్, పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రతిపాదిత సవరణలకు ఇచ్చిన సమర్ధనలు ఆ పార్లమెంటరీ క్రమం యొక్క చిత్తశుద్ధిని ప్రశ్నించేట్లు వుంది.

3. ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులలో అత్యధికులు మణిపూర్‌లోని హింసాకాండకు ప్రాధాన్యత ఇవ్వడంతో బిల్లు చాల తేలిగ్గా అంగీకరింపబడింది. ఈ వ్యాసం రాస్తున్న సమయంలో దానిని చర్చించటానికి ఎగువ సభకు పంపారు. చర్చించినా, లేకున్నా 'అడవుల' గురించి దీర్ఘకాలంగా కొనసాగుతున్న 'నిర్వచనం' నుండి ఈ బిల్లు దారుణంగా విభేదించడం అడవులకు సరైన భవిష్యత్తును సూచించడంలేదు.

### హక్కులకు భంగం కలుగుతోంది

ది షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ అదర్ ట్రెడిషినల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) చట్టం 2006 (FRA) – డోంగ్రియా కోంధుల వంటి జాతులకు అడవిలో వుండే హక్కునూ, తమ భూములను సాగుచేసుకోవడానికి పరిరక్షించుకోవడానికి హక్కుల నిచ్చింది. అటవీ శాఖ విధానాల వల్ల పోగొట్టుకున్న తమ హక్కులను తిరిగి పొందటానికి, బయటవారు తమ భూములు ఆక్రమించడానికి, అడవులను వారి అధీనంలోకి తెచ్చుకోవడానికి గల హక్కులను తిరిగి అనుభవించడానికి వున్న అవకాశాల్ని తిరగదోయడానికి ఈ చట్టాన్ని సృష్టించారు. ఇక ఇప్పుడు అసలు ఆ చట్టాన్నే తొక్కివేశారు.

2012 డిసెంబరులో ప్రధానమంత్రి కార్యాలయం ఈ చట్టాన్ని నీరుగార్చే ఒక సూచనను పంపింది. ముఖ్యమైన విషయమేమిటంటే, ఆదివాసీలు తమ భూముల్లో నిర్మించే గనులు, డ్యాములు, ప్రాజెక్టుల విషయంలో వీటో అధికారం కలిగి వుండాలి. 2009లో ఒక ప్రభుత్వ ఆదేశం ప్రకారం అటువంటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రజల ఆమోదం తప్పనిసరి అని తెలిపింది. కాని ఇప్పుడు దీనిని బాగా బలహీనపరిచారు.

### భారతదేశంలోని ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కులు అత్యవసరం

ఈ అంశంపై కృషిచేసిన నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ సవరణలు 2006లో ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ ఇచ్చిన హక్కులను హరించివేస్తున్నాయి. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ ప్రకారమైతే స్థానిక జాతులవారు తమ గ్రామసభల ద్వారా అటవీ భూమిని వేరే ప్రయోజనాలకు తరలించాలంటే అనుమతి ఇవ్వాలి.

బిల్లులో ప్రతిపాదించిన సవరణలు షెడ్యూలు ట్రైబ్స్ మరియు సంప్రదాయక అటవీవాసులను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తాయి. అటవీ సంరక్షణ చట్ట పరిధిలోకి రాని భూమి విషయంలో గ్రామసభల అనుమతి అవసరంలేదు. అనేక ప్రాజెక్టులకు అనుమతినీయడానికి గ్రామసభలను ఇకముందు ఎవరూ సంప్రదించనవసరంలేదు. ఈ విషయమై అటవీవాసులు గొంతెత్తి నినదించాల్సినంత ముఖ్యమైనది.

గ్రామీణ అభివృద్ధి పంచాయితీరాజ్ జాతీయ సంస్థ నివేదిక ప్రకారం భారతీయ ఆదివాసులలో 50 శాతం మంది అడవులలో నివసిస్తున్నారు.

ఈ బిల్లు చట్టమైతే, ఎన్నో గిరిజన జాతులవారు పెద్దఎత్తున విస్తాపనకు గురౌతారు. భారత ఆదివాసీవాసుల నివాస ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమౌతాయి. ఈ బిల్లు ఆదివాసీల జీవన విధానంపై తీవ్ర వ్యతిరేక ప్రభావం కలుగచేస్తుంది. అడవులకు, ఆదివాసీ జాతులకు మధ్య గల అవినాభావ సంబంధాన్ని భగ్నం చేస్తుంది.

అడవులు అనేవి సరుకులు కాదని మనం గ్రహించాలి. అడవి అంటే అది ఒక జీవన పద్ధతి. అది వారి సంస్కృతిలో సమ్మిళితమైనట్టిది. ఈ బిల్లు ద్వారా మనం వారి హక్కులను లాగేసుకుంటున్నాం.

### ప్రాణాధారమైన హక్కులు :

లక్షలాది గిరిజన లేక ఆదివాసీ ప్రజలు తమ జీవనోపాధికై అడవులపై ఆధారపడి బతుకుతున్నారు. వారు ఆకులు అలమలూ; కాయలూ; పండ్లూ, పూలూ; వంటచెరకు మొదలైన ఉత్పత్తులను తాము వాడుకోడానికి, లేదా అమ్ముకోడానికి సేకరిస్తుంటారు.

డోంగ్రియా కోంధు జాతివారు తమ అడవుల నుంచి 200 ఆహార పదార్ధాలు సేకరిస్తారు. మందులుగా పనికివచ్చే వాటిని, గృహోపకరణాలూ మొదలైనవి అమ్మకానికి పెడ్తారు. వర్షాభావ పరిస్థితిలో కూడా ఏడాది పొడవునా సరిపోయే ఆహారాన్ని వారు అడవుల నుంచి సేకరించే జ్ఞానసంపన్నులు వారు.

### మినహాయింపు – నిందలు

వలసకాలం నాటినుండీ ఆదివాసులను తమ అడవుల గురించి నిర్ణయాలు తీసుకోవడంలో మినహాయించారు. అంతేగాక అడవులను నాశనం చేస్తున్నారన్న నిందలకు వారు గురయ్యారు. ఉదాహరణకు పంటను తగులబెట్టడం, అడవి నుండి వంట కొరకు, ఇంటి నిర్మాణం కొరకు కలప సేకరించడం తప్పు పట్టేవారు. అటవీ శాఖాధికారులు ఆదివాసీలను ఒక 'సమస్య'గా పరిగణించడానికి అలవాటుపడ్డారు. కనుక వారిని అడవి గురించి కాని, నిర్ణయాలు తీసుకోవడంలోగాని మినహాయించేవారు.

ఈ చట్టంపై చర్చ జరుగుతుండగా, ఒక సంస్థ ఆ చర్చను వ్యతిరేకిస్తూ, టీ.వీ. ప్రకటనలు గుప్పించింది. సంప్రదాయవాదులు, అటవీవాసులు మొత్తం 9 కేసులు – వాటిలో రెండు సుప్రీంకోర్టులో చట్టాన్ని సవాలు చేస్తూ పెట్టారు. వారు ఈ బిల్లు చట్టంగాకుండా ఆపలేకపోయారుగాని, దాన్ని అమలుచేయడాన్ని ఆలస్యం చేయగల్గారు.

లక్షలాది గిరిజన జాతులు తరతరాల నుండి వారివారి అడవులను రక్షించుకుంటున్నాయి. కాని ఆ జాతులవారు ఏనాడూ అడవులకు 'సమస్య'గా లేరు. అటవీ హక్కుల చట్టం ఆదివాసుల అటవీ సంరక్షణ, పునరుజ్జీవనం, కాపాడటం, వనరుల రక్షణ మొదలగువాటన్నిటినీ అంగీకరించింది.

### సమ్మతి : అసలు విషయం :

ఇది చట్టం కాకముందు విస్తృతంగా చర్చకు గురైంది. అయితే పలు ముఖ్యమైన ప్రశ్నలకు జవాబు ఇవ్వలేదు. ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ చట్టం గ్రామసభలకు తమ సమ్మతిని, లేక అసమ్మతిని – వారి అంగీకారాన్ని తమ భూముల్లో పెట్టే ప్రాజెక్టులకు హక్కును ఇచ్చిందో లేదో అన్నది తేలలేదు.

ఈ విషయమై ఒక వివరణ ఇస్తూ 2009లో ఒక సర్క్యులర్ విడుదల చేస్తూ, గ్రామసభ వారి వ్రాతపూర్వక సమ్మతిని, అడవుల భూమిని మార్చాలంటే తప్పనిసరి అని చెప్పారు. అంటే డోంగ్రియా కోంధు భూముల్లో ప్రాజెక్టులు ప్రారంభించాలంటే, వేదాంత రిసోర్సెస్ లాంటి గనుల కంపెనీలు ఆ కోంధుల వ్రాతపూర్వక సమ్మతిని పొందవలసిందే!

ప్రధానమంత్రి కార్యాలయం ఈ చట్టాన్ని నీరుకార్చటానికి ప్రయత్నించింది. సంబంధిత మంత్రిత్వశాఖలవారందరికీ అది ఏ కేసులలోనూ గ్రామసభ సమ్మతి అవసరంలేదని సూచించింది. పర్యావరణ, గిరిజన జాతుల మంత్రిత్వశాఖలు ఈ మార్పును అంగీకరించాయి. కాని, నియామ్‌గిరి గనుల వ్యవహారంలో సుప్రీంకోర్టు – సమ్మతిని కాని అసమ్మతిని కాని తెలియచేసే అధికారం డోంగ్రియా కోంధులకు వుందని తీర్పునిచ్చింది.

### హక్కులంటే హక్కులే!

అటవీ హక్కుల చట్టం లోపరహితమైనది కాదు. దానిని పూర్తిగా అమలుచేయలేదు. భారతదేశంలోని ఆదివాసీ ప్రజల హక్కుల రక్షణకు ఉనికిలో ఉన్న ఉత్తమమైన చట్టం అది. పరిశ్రమల కోసం దానిని నీరుగార్చటం. ఈ హక్కులను భగ్నం చేయడమే కనుక ఆ ప్రయత్నాలు ఆపితీరాలి!

### అటవీ సంరక్షణ చట్టానికి వ్యతిరేకంగా :

ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023ను వ్యతిరేకిస్తూ మిజోరం శాసనసభ ఒక తీర్మానాన్ని చేసింది.

ఆ తీర్మానం ఇలా వుంది. "మిజోరం ప్రజల ప్రయోజనాలను, హక్కులను రక్షించడానికి అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023ను ఏకగ్రీవంగా తిరస్కరిస్తోంది" టి.జె. లాల్ నున్ త్లుంగా, (మిజోరం పర్యావరణం అటవీ, వాతావరణ మార్పు మంత్రి) ఈ తీర్మానాన్ని ప్రవేశబెట్టారు.

లాల్ నున్ తుంగ్లా ఇలా అన్నారు. "మేము మన అడవి నాశనం కాకుండానూ, ప్రజల హక్కులను రక్షిస్తూ, మా శక్తి మేరకు కృషి చేశాం. ఈ ప్రతిపాదిత చట్టంపై మా భయాందోళనలను అసంఖ్యాకమైన లేఖల ద్వారా కేంద్రానికి పంపినా ఫలితం మాత్రం శూన్యం. కనుక ఈరోజు ఈ తీర్మానం".

పాలకవర్గమైన మిజో నేషనల్ ఫ్రంట్ (MNF) ప్రతిపక్షంతో కలసి BJP ఎమ్మెల్యే బి.డి.చకా తప్ప మిగిలిన అందరు శాసనసభ్యులు దీనిని బలపరిచారు.

### ముగింపు :

రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు వున్నా కూడా, ఆదివాసీలు కులాల పేరుతో, మతాల పేరుతో దోపిడీకి గురవుతున్నారు. 'వేట' పేరుతో, సరిహద్దులు దాటారనే పేరుతో, ఇంకా ఎన్నో ఆరోపణలతో వారు కాల్చి చంపివేయబడుతున్నారు. అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023 – మొత్తం ఆదివాసీ జాతికి పెద్ద దెబ్బ! ఇది వారికున్న అనేక హక్కులను హరించివేస్తోంది. వలస కాలంలో జరిగిన అన్యాయాలను సరిచేయడానికి అటవీ హక్కుల చట్టం వస్తే అది ఇచ్చిన హక్కులన్నిటినీ లాగివేస్తోందీ కొత్త సవరణ చట్టం! అటవీశాఖ క్రింద అత్యధికమైన అటవీ భూమి వుంది. తద్వారా అది లక్షలాది ఆదివాసీ కుటుంబాల హక్కులను, అధికారాలను హరించివేస్తోంది. ఈ సవరణ పెద్దఎత్తున అడవుల నరికివేతకు, పర్యావరణం దిగజారడానికి, జీవ వైవిధ్యంలో మార్పులు – అడవులపై ఆధారపడి జీవించే జాతుల జీవనోపాధిపై తెస్తాయి. ప్రతిపాదిత సవరణలు కార్పొరేట్లకు, ప్రైవేటైజేషన్‌కు, ఉన్నత అధికారుల అదుపుకూ అనుకూలం. ఇది గ్రామసభలు ప్రజాస్వామ్యబద్ధంగా అడవులను పాలించే స్థితి నుండి, గిరిజన జాతులు బలవంతంగా విస్తాపనకు గురయ్యే పరిస్థితికి చేరింది. గిరిజన సంస్కృతి ఒక తరం నుండి ఇంకొక తరానికి, దోపిడీ గానీ సరుకీకరణ గానీ లేకుండా సంక్రమిస్తుంది. ఆదివాసీలకు భూమి, అడవులపై పూర్తిగా షెడ్యూలు ప్రాంతంలో అధికారం లభిస్తుంది. కొన్ని దశాబ్దాలుగా గిరిజన జాతులు తమ ఆవాసాలు, స్వగ్రామాలు ముక్కలు చెక్కలు కావడం, టూరిజం ద్వారా వారి సంస్కృతులు విచ్ఛిన్నం కావడం సాగుతోంది. ఇదంతా వారిని చెల్లాచెదురు చేసింది. దారిద్ర్యంలో ముంచింది. రాజ్యం తీసుకునే చర్యల వల్ల రాష్ట్రాలన్నిటిలో వున్న జాతులు మొత్తం తమ భూమిని పోగొట్టుకున్నాయి. వనరుల యాజమాన్యంలో వున్న స్వయం సమృద్ధి, స్వయం పోషక జాతులుగా వున్నవి వ్యవసాయ

కూలీ సమాజాలుగా అగమ్య భవిష్యత్తు కల పట్టణ ప్రాంతాలుగా మారిపోయాయి. అయినా, రాజ్యాంగం గిరిజన జాతుల హక్కులను రక్షిస్తోందనీ, ప్రత్యేక శాసనాలు, రాజ్యాంగం దేశంలో అత్యుత్తమ న్యాయాన్ని ఏ జాతి పౌరులనైనా సమకూర్చుతోందనీ మరల మరవలేం. 'అసమ్మతి' అనేది ప్రజాస్వామ్యానికి సేఫ్టీవాల్వ్ అనీ, ఈ సేఫ్టీ వాల్వ్‌ను శబ్దం చేయకుండా చేస్తే, ప్రజల మనస్సులలో భయం గూడు కట్టుకుంటుందనీ, వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ విలువలకు నిబద్ధతగా వుండటం భగ్నమౌతాయని గుర్తించాలి. గిరిజనుల స్వయంపాలన ప్రతిపత్తి ద్వారా అడవులను, నదులను గిరిజన సంస్కృతిని మరింత బాగా పరిరక్షించవచ్చని మేం నమ్ముతున్నాం. గ్యారంటీగా ఇచ్చిన హక్కులపై గందరగోళమైన రెగ్యులేటరీ న్యాయవ్యవస్థను రుద్దినట్లైతే అది మరింత సామాజిక, ఆర్థిక కల్లోలాన్ని కల్గిస్తుంది. దీని నుండి తప్పించుకోవాలంటే మన భూమిని, మన జీవితాలను, మన జీవనోపాధులపై దాడిచేస్తున్న కార్పొరేట్ అనుకూల, పారిశ్రామిక అనుకూల, ప్రైవేటీకరణ అనుకూల, అధికారవర్గ అనుకూలమైన కార్యక్రమాలన్నిటినీ ఆపివేయాలి.

**రాబోయే రెండు సంవత్సరాలలో అటవీ హక్కుల చట్టంలోని అన్ని హక్కులూ ఒడిసాలో అమలౌతాయి!**

షెడ్యూలు ట్రైబ్ అండ్ అదర్ ట్రెడిషనల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ – 2006) (క్లుప్తంగా FRA) ప్రకారం ఒడిసా ప్రభుత్వం అన్ని హక్కులనూ రాబోయే రెండేళ్ళ కాలంలో పూర్తిగా గుర్తించే 'మొజంగ్లీ – జామియోజన' (నా అటవీ భూమి) స్కీమును ప్రారంభించింది. ఈ స్కీము ప్రకారం తహశీల్, జిల్లా స్థాయిలో ఫారెస్ట్ అధికారుల సెల్స్ ఏర్పరుస్తారు. ఇవి వృత్తిపరంగా కృషిచేసే అధికారులతో కూడి; FRA 2006 సరిగ్గా అమలుచేయడానికి సహాయపడతాయి. నిర్ణీత కాలవ్యవధిలో ఇవి హక్కుల గుర్తింపు కార్యక్రమాలు త్వరగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తుంది.

ఒడిసాలో గిరిజనుల చిత్రం చూస్తే – ఇక్కడ 62 గిరిజన జాతులున్నాయి. వీటిలో 13 జాతులు Particularly Vulnerable Tribal Groups (PVTGS) (ప్రత్యేకంగా దుర్బలమైన గిరిజన బృందాలు) వున్నాయి. జాతీయ గిరిజన జనాభాలో ఈ రాష్ట్రం మూడవ స్థానంలో వుంది. ఈ రాష్ట్రంలో ఆదివాసీ జనాభా 95,907,56 కాగా ఇది మొత్తం జనాభాలో ఈ సంఖ్య 22.85 శాతంగా వుంది. రాష్ట్రంలోని 53,845 గ్రామాలలో 32,562 FRAకు చెందిన గ్రామాలున్నాయి. ఒరిస్సాలో హక్కులకై గుర్తించిన అడవీ హక్కుల ప్రాంతం సుమారుగా 35,739 చదరపు కిలోమీటర్లుగా వుంది.

"4.56 లక్షల మందికి వ్యక్తిగతంగా అటవీ హక్కులు (IFR) ఇచ్చిన రాష్ట్రాలలో ఒడిసా ముందుస్థానంలో వుంది. కాని ఇప్పటికీ ఆ వున్న హక్కుల గుర్తింపు క్రమంలో ఇంకా వ్యత్యాసం మిగిలే వుంది" అని రెవిన్యూ, ప్రమాద నివారణ, ఎస్.టి. మరియు ఎస్.సి. అభివృద్ధి శాఖలు ఒక వివరణాపత్రంలో పేర్కొన్నారు.

వ్యక్తిగతంగా అడవిపై హక్కులు అటు వుంచితే, FRA ఇచ్చిన హక్కులలో అటవీ పాలన మెరుగు కావడానికి ఎంతో శక్తివంతమైన నిబంధనలు, నియమాలు వున్నాయి. అవి జీవనోపాధి రక్షణ కూడా నిస్తాయి.

కమ్యూనిటీ హక్కులు (CR), కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్ (CFR) హక్కులు, సర్వే కానటువంటి ఆవాసాలు, అటవీ గ్రామాల నుంచి రెవిన్యూ గ్రామాల వరకు వివరాలు అంత ప్రోత్సాహకరంగా లేవు.

పైపెచ్చు, హక్కులు గుర్తింపబడ్డ సందర్భంలో పంచిపెట్టిన టైటిల్స్ రికార్డులలోని సవరణలలో తేడాలున్నాయి. ఇతర ప్రభుత్వ స్కీములు, కార్యక్రమాల వివరాలు సరిగా లేవు.

టైటిల్ కలిగినవారు 100 శాతం మందికి అర్హులైన అందరికీ, ప్రధానంగా ఒంటరి మహిళలు, PVTGలు భూమిపై హక్కులు, రికార్డులలో సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్వేకాని అన్ని అటవీ గ్రామాలను రెవిన్యూ గ్రామాలుగా మార్చి అన్ని కుటుంబాలవారికీ నీటి సరఫరా, రోడ్లు, వైద్యం, స్కూళ్ళు అందుబాటులో వుండేటట్లు చూస్తారు.

**కా॥ కె.మాధవరెడ్డి,** రాష్ట్ర అధ్యక్షులు,
కర్ణాటక రైతు రాజ్య సంఘం



ఆదివాసులంటే ఎలావుంటారనేది మాకు ప్రత్యక్షంగా తెలియదు. మేము కొండమొదలు గ్రామానికి వెళ్లాము. అక్కడ వాతావరణం, గ్రామాలను చూసి మేము ఆశ్చర్యపోయాం. 40 సం॥లుగా కొండమొదలు గిరిజన గ్రామస్థులు ఉమ్మడిగా వ్యవసాయం చేస్తుంటే అది చూసి ఎంతో సంతోష పడ్డాము. ఈ కాలంలో సంస్కారం ఎక్కడ వుందంటే అక్కడే వుందనుకున్నాం. అడవి ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల నుండి మనం ఎంతో నేర్చుకోవాలి. కొండమొదలు రైతులకు 40 సం॥లుగా సమిష్టి వ్యవసాయం చేస్తున్నందుకు మా కర్ణాటక రైతు సంఘం తరపున ధన్యవాదాలు చెబుతున్నాను. ఈ కాలంలో కూడా ఉమ్మడి కుటుంబాలుగా ఉండటం అంటే తమాషా కాదు అన్నదమ్ములు కూడా ఒక్క రోజులో కొట్లాడి వేరైపోతున్నారు. ఇంత సంస్కారం ఉన్నవాళ్ళ దగ్గర నుండి మనం చాలా నేర్చుకోవాలి.

మోడీ ప్రభుత్వం మూడు నల్లచట్టాలను తెచ్చింది. ఈ చట్టాలలో ఏముందో కూడా మా కర్ణాటకలో వున్న ఒక్క ఎంఎల్ఏకు కానీ, ఎంపికి కానీ తెలియదు, ఎవరు కూడా చదవలేదు. వాళ్ళు మమ్మల్నే వాటిలో ఏమున్నాయని అడిగారు. మీరు కూడా చదవండయ్యా, చదివితేనే అర్థమవుతుందని చెప్పాం. ప్రజా ఉద్యమాలతో, ప్రజల జీవితాలతో సంబంధంలేని వాళ్ళు కేవలం డబ్బులు ఉన్న వాళ్ళు మాత్రమే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. వీరికి ఓట్లప్పుడు తప్ప మిగతా సమయంలో జనంతో ఏమాత్రం సంబంధం లేదు. ఇప్పుడు మరలా అటవీ సంరక్షణ చట్టం తెచ్చారు. వీటన్నిటికి వ్యతిరేకంగా మనం పోరాడాల్సిన అవసరం ఉంది.

ఇటీవల కాలంలో కర్ణాటకలో రైతాంగం సమస్యల వలన 14 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో చాలా మందికి తెలియటం లేదు. ఈ భారతదేశంలో రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవటంలో కర్ణాటక రెండవ స్థానంలో ఉంది. మన దేశంలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. రైతాంగ ఆత్మహత్యలు గురించి అర్థం చేసుకున్నవారు చాలా తక్కువగానే ఉన్నారు. మేధావులకు, విద్యార్థులకు, డాక్టర్లకు, ఇంజనీర్లకు అందరికీ ఇదే పరిస్థితి వుంది. ఒక డాక్టరు విద్యార్థి రేపు డాక్టరయితే ఫీజు ఎంత తీసుకుందామా, డబ్బు ఎంత తీసుకుందామా అన్న విషయాలను మాత్రమే వారు అర్థం చేసుకుంటున్నారు. సామాన్య ప్రజల పరిస్థితి వీరికి అర్థం కావటం లేదు. ఇది చాలా బాధాకరమైన విషయం. మేధావులు, రైతులు, కార్మికులు, గిరిజనులు మనమందం కలిసి ఈ పోరాటాలు చేయాలి.

కర్ణాటక గ్రామీణ బ్యాంకులోని రైతాంగం అప్పులకు సంబంధించిన విషయాలను మీ ముందు మాట్లాడదలుచుకున్నాను. కర్ణాటక గ్రామీణ బ్యాంకు బళ్ళారి కేంద్రంగా రాష్ట్రంలోని అనేక శాఖలు ఉన్నాయి. బళ్ళారిలో దీని హెడ్ ఆఫీసు ఉంది. ఈ బ్యాంకులో 54 లక్షల మంది రైతులు అప్పు తీసుకున్నారు. రైతాంగ అప్పులను రుణమాఫీ చేస్తానని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందేగానీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినా కూడా రుణమాఫీ గురించి ప్రస్తావన చేయటంలేదు. మా కర్ణాటక రైతు రాజ్య సంఘం ఎన్నికల ముందు నుంచి చక్రవడ్డీలను రద్దు చేసి అప్పుల వరకే రైతాంగం వద్ద వసూలు చేయాలని 200 రోజుల పైగా బళ్ళారిలోని హెడ్ ఆఫీసు ముందు నిరవధికంగా ధర్నా చేశాం, నిరాహార దీక్షలు చేశాం. వందలాది మంది రైతులతో ప్రదర్శన, వేలాది మందితో బహిరంగ సభను నిర్వహించాం. ఈ కార్యక్రమాలన్నీ ఏఐకెఎంకెఎస్ నాయకత్వంలోనే జరిపాం. రాష్ట్ర ఎన్నికల్లో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇంతవరకు రుణమాఫీ గురించి నిర్ణయం తీసుకోవటం లేదు. దీనికి కమిటీలు వేసి నిర్ణయం ప్రకటిస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. గత 3 సం॥ల నుంచి రైతాంగ ఉద్యమంలో మేము కర్ణాటకలో వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి విస్తృత ప్రచారం చేశాం. ప్రస్తుతం ఉన్న మీడియా వార్తాపత్రికలు పూర్తిగా రైతు పక్షాన నిలబడటంలేదు. పాలకులకు వంత పలికే పనిలోనే ఉన్నారు. మణిపూర్‌లో జాతుల పేరుతో జరిగిన హింసకు కూడా ఈ పాలకులే కారణం. రైతాంగం సమస్యలు కొత్తగా తీసుకొచ్చిన అటవీ సంరక్షణ సవరణ చట్టం వీటన్నిటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాడాల్సి వుంది. రైతులు, ఆదివాసీలు మనందరిదీ ఒకటే కులం, మన లక్ష్యం పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోవటం తప్ప మారో మార్గంలేదని చెపుతూ ముగిస్తున్నాను.

## కా॥ బాబూరావ్ కుంభర్‌గావ్,

ఏఐకెఎంకెఎస్ నాయకులు, మహారాష్ట్ర



అధ్యక్షా, పాలకులు తెస్తున్న ఈ కొత్త చట్టం వలన అడవులు నాశనమౌతున్నాయి. పర్యావరణం నాశనమౌతోంది. ఆదివాసీల జీవితాలు నాశనమౌతున్నాయి. మొత్తంగా దేశానికి ఎంతో నష్టం. కేవలం అడవులకు మాత్రమే ఇది పరిమితం కాదు, మైదాన ప్రాంతాలపై కూడా దీని ప్రభావం ఉంటుంది. 1980లో అడవులు నాశనమౌతున్నాయిని అటవీ సంరక్షణ చట్టం చేశారు. అనంతరం అడవులు రక్షించబడ్డాయా లేదా అని పరిశీలిస్తే అడవులను పెద్ద పెద్ద కంపెనీలు ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. 2021లో మూడు వ్యవసాయ నల్ల చట్టాలు చేసి, రైతాంగ ప్రతిఘటనతో వాటిని ఉపసంహరించుకున్నానని చెబుతూనే అనేక రాష్ట్రాల్లో ఈ చట్టాల్లోని ముఖ్యమైన అంశాలను అమలు చేస్తూనే ఉంది. చట్టసభల్లో ఏమాత్రం చర్చించకుండానే అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని ఆమోదింపజేసుకుంది. కేవలం ఆదివాసీలకే కాక రైతాంగానికి కూడా ఈ చట్టం తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. కనుక ఆదివాసీలు, రైతాంగం భుజం భుజం కలిపి ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

## కా॥ కిమిడి ఉప్పలయ్య, రాష్ట్ర కార్యదర్శి,

తెలంగాణా రైతుకూలీ సంఘం



అధ్యక్షా! వేదిక మీద ఉన్నటువంటి పెద్దలకు, తెలంగాణా రైతు కూలీ సంఘం నుండి వచ్చినటువంటి మిత్రులందరికి కూడా విప్లవాభి నందనలు తెలియజెస్తున్నాను. ఎందుకంటే నిన్నటి నుండి మొదలు కుంటే ఈ రోజు వరకు అఖిల భారత ఆదివాసీ సదస్సుకు ఎంతో క్షుణంగా, విప్లవత్మకంగా మాట్లాడినటువంటి మిత్రులకు తెలంగాణా రైతుకూలీ సంఘం నుండి విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఆదివాసీ గిరిజనుల యొక్క స్ఫూర్తి మౌలికమైనటువంటి మార్పు తీసుకోరావడం కోసం మనమంత కలిసిగట్టుగా వర్గపోరాటాలు ఉధృతం చేస్తూ, ప్రజా పోరాటాల ద్వారా మన సమస్యలు పరిష్కారం

వన్యమృగ సంరక్షణ పేరుతో
ఆదివాసీలను గెంటివేయవద్దు

అవుతాయని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అట్లాగే ఈ మోడీ ప్రభుత్వం చేస్తున్నటువంటి విధానాలు కేవలం రైతు వ్యతిరేక, గిరిజన వ్యతిరేకమైనవి. తెలంగాణాలో అనేక ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు దౌర్జన్యం చేస్తున్నారు. గిరిజనులను నానాచిత్రహింసలు పెడుతున్నారు. ఈ చిత్రహింసలకు తాళలేక ఒకరిద్దరు యువకులు ఫారెస్టు అధికారులను ప్రతిఘటించారు. ఇదే అదనుగా తీసుకున్న రాష్ట్ర పాలకులు 20, 25 మంది దాకా కేసులు పెట్టి నిర్బంధించారు. ఈ పరిస్థితులను చూస్తూంటే మనల్ని హింసిస్తూ మన భూముల్ని లాక్కున్న అధికారులకు పూర్తి అధికారాలను కల్పిస్తున్నారు. మా భూములు మాకు కావాలని పోరాడిన వారిపై కేసులు పెడుతున్నారు. తెలంగాణా ప్రభుత్వం ఈ విధానాలనే ఖమ్మం, ములుగు, వరంగల్ మొదలగు జిల్లాల్లో అనుసరిస్తూ వున్నది. కనుక ఈ పరిస్థితిలో మన భూములు మనకు కావాలంటే మన ఉద్యమాల్ని మరింత సంఘటిత శక్తితో నడపవలసిన అవసరం ఉంది. దీని కోసం మన అఖిల భారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ ఇచ్చిన నిర్ణయాలకు కట్టుబడి ప్రజలకు ముందు వరుసన నిలబడి పనిచేస్తామని సభా ముఖంగా చెబుతున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చి మిత్రులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

## కా॥ అశోక్ బైతా, ఏఐకెఎంకెఎస్ నాయకులు, బీహార్



**కామ్రేడ్స్,**

అఖిల భారత ఆదివాసీ సదస్సు వేదికపై వున్న నాయకులకు, సదస్సుకు హజరైన ఆదివాసీ ప్రజలందరికీ అభినందనలు. ముందుగా భూమి కోసం, అడవిపై హక్కు కోసం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో మరణించిన వారందరికీ ఎర్రెర్రని వందనాలు. ఆదివాసులకు భారతదేశంలో గొప్ప పోరాట చరిత్ర వుంది. బ్రిటీషు సామ్రాజ్యవాదుల కాలం నుండి నేటి వరకు అడవిపై హక్కు కోసం, తమ భూముల కోసం, అడవి నుండి ఆదివాసీలను గెంటివేసే కుట్రలకు వ్యతిరకంగా సుదీర్ఘంగా పోరాడిన చరిత్ర ఆదివాసులకు వుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ 1749-50 సంవత్సరంలో ఆదివాసుల భూములను, అడవిని తమ ఆధీనంలోకీ తీసుకురావడం కోసం, తరతరాలుగా కొండపోళ్ళను నరికి వ్యవసాయానికి యోగ్యమైన విధంగా మలచిన భూములను కాజేయడానికి పెద్ద ఎత్తున కుట్ర చేసారు. దీనికి వ్యతిరేకంగా అడవిని కాపాడుకోవడం కోసం, తమ భూముల రక్షణ కోసం ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసులు సంవత్సరాల తరబడి పెద్దఎత్తున పోరాటాలు చేసారు. ఆదివాసులు అడవి నుండి సేకరిస్తున్న ఉత్పత్తులపై, ఆదివాసుల సాగులో వున్న భూములపై అధిక పన్నులు విధిస్తూ మరో చట్టాన్ని బ్రిటీషు ప్రభుత్వం తెచ్చి పెద్దఎత్తున ఆదివాసులను దోచుకున్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా బిర్సాముండా నాయకత్వాన జరిగిన పోరాటాన్ని బ్రిటీషు ప్రభుత్వం ఉక్కుపాదం మోపి అమానుషంగా అణచివేసింది. బ్రిటిషు ప్రభుత్వం తెచ్చిన అడవి బిల్లుకి వ్యతిరేకంగా దేశంలోని అనేక చోట్ల ఆదివాసులు ఎన్నో తిరుగుబాట్లు చేసారు. ఈ పోరాటల్లో వందలమందిని ఉరితీసారు. తుపాకీగుండ్లకు బలి చేసారు. వేలమందిని జైళ్ళల్లో కుక్కారు. అడవిపై హక్కు కోసం, భూమిపై హక్కు కోసం నేటికీ ఆదివాసీలు పోరాడుతూనే వున్నారు.

1947లో స్వాతంత్ర్యం వచ్చిందని, 1951లో రాజ్యాంగం అమలులోకి వచ్చిందని చెప్పబడిన తరువాత కూడా ఆదివాసులకు వ్యతిరేకంగా బ్రిటీషువాళ్ళు 1907లో వచ్చిన చట్టాన్నే కొన్ని సవరణలు చేసి నేటికీ అమలు చేస్తున్నాయి. బ్రిటీషు ప్రభుత్వం తెచ్చిన చట్టాలతో భారత ప్రభుత్వాలు దేశంలోని అటవీ సంపదను, ఖనిజ సంపదను దేశ, విదేశ బడాకార్పోరేట్ సంస్థలకు అప్పగించడానికి వ్యతిరేకంగా, అడవిపై హక్కు కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పీసా చట్టాన్ని, 2005 అటవీ హక్కుల చట్టాన్ని, ఆదివాసులకు రక్షణ చట్టాలను సైతం నేడు అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం లాక్కోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం బాహాటంగా అడవులను, కొండల్లోని ఖనిజసంపదను విదేశీ సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడానికి పూనుకుంది. అందులో భాగంగానే 2023 అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం పేరుతో వేలాది ఆదివాసీ గ్రామాలను ఖాళీచేసి లక్షలాది మంది ఆదివాసులను గెంటివేయబోతున్నారు. ఎవరైతే అడవిని, అటవీ సంపదను రక్షిస్తున్నారో వారిని అడవి నుండి గెంటివేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా పెద్ద ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. అప్పుడే విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలకును వెనక్కి నెట్టగలం.

బీహార్‌లోనూ పెద్ద అటవీ ప్రాంతం వుంది. అక్కడ కూడ ఆదివాసులను తమ ఆవాసాల నుండి గెంటివేసి బడా కార్పోరేట్ సంస్థలకు అప్పగించడానికి వ్యతిరేకంగా బిర్సా ముండా జయంతి సందర్భంగా గత సంవత్సరం వేలాది మంది ఆదివాసీలు ఒక్కటై ఎట్టి పరిస్థితుల్లోనూ మా అడవిని, మా గ్రామాలను సామ్రాజ్యవాదులకు అప్పగించడాన్ని ఒప్పుకోబోమని, దాని కోసం ఎంతమంది ప్రాణాలు కోల్పోయిన, ఎంతటి రక్తాన్ని ధారపోయాల్సి వచ్చిన, జైళ్ళల్లో కుక్కిన వెనక్కు తగ్గేది లేదని ప్రతినబూనారు. భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చడం కోసం దేశంలోని పాలకవర్గ పార్టీలు పనిచేస్తున్నాయి. ఎవరైతే కష్టపడి శ్రమచేసి వ్యవసాయానికి యోగ్యంగా భూములను మలచి ఉత్పత్తులు పెంచుతున్నారో వారు భూమిలేని నిరుపేదలుగా వున్నారు. ఏనాడు భూమి మీద పనిచేయని భూస్వాముల చేతుల్లో బందీగా వున్న భూమిని విముక్తి చేయాలి. చివరిగా దున్నేవానిదే భూమి హక్కు అనే నినాదం ఇస్తూ ముగిస్తున్నాను.

**గిరిజన గ్రామాలన్నింటిని షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలి**

## కా॥ శ్రీధర్ ముఖర్జీ, ఏఐకెఎంకెఎస్ నాయకులు, పశ్చిమ బెంగాల్



అధ్యక్షవర్గం, వేదికపైన ఉన్న కామ్రేడ్స్ మరియు పలురాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులందరికీ పశ్చిమ బెంగాల్ కమిటీ తరపున నా అభినందనలు. నేను క్లుప్తంగా మీ ముందు కొన్ని విషయాలను చెప్పదలుచుకున్నాను. మన భారతదేశ చరిత్రను పరిశీలిస్తే మొఘల్ రాజుల కాలం నుండి ఆతర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ నుండి ఆ తర్వాత బ్రిటీష్ వాడి నుండి కూడా ఆదివాసీలు కష్టపడి సాగు చేసుకుంటున్న భూములన్నీ దురాక్రమణ పాలయ్యాయి. ఆదివాసీ రైతులు తమ భూముల నుండే వెళ్ళగొట్ట బడ్డారు. ఆ తర్వాత బ్రిటీష్‌వాళ్ళు కూడా ఆదివాసీలు కష్టపడి సాగుచేసుకుంటున్న భూములన్నింటిని రకరకాల రూపాల్లో దురాక్రమించి గెంటివేశారు. అధికార మార్పిడి తర్వాత కూడా ఆదివాసీలకు ఏభూములు దక్కలేదు. ప్రస్తుతం అధికారంలో వున్న పాలకులు గతంలో అధికారంలో వున్న పాలకులు కూడా ఇదే పద్ధతుల్లో భూములపై అడవిపై ఆదివాసీలకు హక్కు లేకుండా చేశారు. వందల సంవత్సరాల నుండి సాగుతున్న దోపిడీ ఇది.

ప్రస్తుతం మన దేశంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఇక మధ్యభారతదేశానికి వచ్చేసరికి ఒరిస్సా, బెంగాల్, జార్ఖండ్ మొదలగు ప్రాంతాల్లోని అడవులలో వున్న భూసంపదంతా పెద్దపెద్ద కంపెనీలు దురాక్రమించుకున్నాయి. ఈ దురాక్రమించుకున్న కంపెనీలన్ని సామ్రాజ్యవాదుల ఆధీనంలో వున్నవే. ఏవి కూడా మన దేశానికి సంబంధించిన సంస్థలు కావు. కనుక అటవీ సంపద, అడవులు, సాగుచేసుకున్న భూములు ఏవీ కూడా గిరిజనుల స్వాధీనంలో లేవు. ఈ భూముల కోసం, అడవులలో ఆదివాసీలు జీవించే హక్కు కోసం ఎన్నో పోరాటాలు సాగాయి. అందులో ముఖ్యంగా చెప్పుకోవలసినవి మహత్తర తెలంగాణా రైతాంగ పోరాటం, నక్సల్బరీ పోరాటం మరియు శ్రీకాకుళ పోరాటాలు. ఈ పోరాటాల ఫలితంగా పాలకులు కొన్ని చట్టాలు తెచ్చారు కానీ అవి దోపిడీవర్గాలకు ఉపయోగపడే కొద్దిమంది ఆదివాసీలకే పరిమితమైనాయి. కనుక భూమి కోసం, అడవిపై గిరిజనుల హక్కు కోసం, మన సంపదలను రక్షించుకోవడం కోసం మనం పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉంది. ఆ పోరాటాలకు ప్రజలను సమాయత్తం చేయాలి.

## కా॥ శ్రీకాంత్ మహంతి, ఏఐకెఎంకెఎస్ నాయకులు, ఒరిస్సా



అధ్యక్ష వర్గం వేదిక మీద ఉన్న పెద్దలకు, దేశ నలుమూలల నుండి వచ్చిన కామ్రేడ్సందరికీ విప్లవాభివందనాలు. దేశంలో పర్యావరణం చాలా ఘోరమైన స్థితిలో ఉంది. అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం పర్యావరణానికి సంబంధించి, ఆదివాసీ జీవితాలకు సంబంధించి అతి ఘోరమైన చట్టాలను తీసుకువచ్చింది. అధికార మార్పిడికి ముందు బ్రిటిష్ వాళ్ళు ఆదివాసీల, పేద ప్రజల మనుగడకు భంగం కలిగే విధంగా ఏ చట్టాలను చేశారో ప్రస్తుత పాలకులు కూడా అవే చట్టాలను అమలు చేస్తున్నారు. ఒరిస్సా ప్రభుత్వం హీరాఖండ్ డ్యాం కట్టిన సందర్భంగా 300 గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీలను నిరాశ్రయులను చేశారు. అభివృద్ధి పేరుతో చేసిన ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల అత్యధిక ఆదివాసీ జనాభా తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంది. ఈ మధ్య కాలంలో అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల వలన అధిక శాతం ఆదివాసీల జీవితాలపై తీవ్ర విఘాతం కలిగించాయి. ఆదివాసీ ప్రాంతాలు అడవుల్లోనే అత్యధిక శాతం గనులున్నాయి. ఈ గనుల త్రవ్వకంతో ఆదివాసీల జీవితాలు విధ్వంసమౌతున్నాయి. ఇవన్నీ పాలకులు దేశాభివృద్ధి అనే పేరుతో చేస్తూ ఉన్నారు. ఉదాహరణకు ఖేయుంజర్ జిల్లాలో జలవిద్యుత్ కేంద్రాలు, గనులు అనేకం ఉన్నాయి. మరోపక్క ఒరిస్సాలోని అత్యంత పేదరికం అనుభవిస్తున్న ఆదివాసీలు కుడా ఈ ప్రాంతంలోనే ఉన్నారు. ఇనుప ఖనిజం ఎక్కువగా వెలికితీయబడుతోంది అక్కడ. ఉమ్మడి కోరాపుట్ జిల్లాలో అత్యధిక బాక్సైట్ నిక్షేపాలున్నాయి. నూటికి 70 మంది గిరిజన ప్రజానీకం ఉన్నారు. పేదవాళ్ళుగా ఉన్నారు. ఉపాధి లేక వలసలు పోతున్నారు. మరో పక్క ఎంతో విలువైన బాక్సైట్ ఖనిజాలు ఉన్నాయి. వాటిని తవ్వి తీయటమంటే దేశ సంపదను అభివృద్ధి చేయటం అని చెబుతున్నారు. కానీ అక్కడి ప్రజలు మాత్రం నిరుపేదలుగా మారి అక్కడి నుండి గెంటివేయబడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వన్యప్రాణులు ఎక్కువున్నాయంటూ వాటి రక్షణ పేరిట ఆదివాసులను అడవుల నుండి గెంటివేస్తున్నారు. ఇప్పుడు అటవీ సంరక్షణ సవరణ చట్టం ఏదైతే చేశారో అది చాలా

**అటవీ సంపదను దోచుకుంటున్న**
**బహుళజాతి సంస్థలను నిరోధించాలి**

దుర్మార్గమైనది, అన్యాయమైనది. దీని రద్దుకై మనమందరం ఐక్యమై పోరాడాల్సి ఉంది.

ప్రస్తుతం అధికారంలో బిజెపి ప్రభుత్వం భారతదేశంలోని పర్యావరణాన్ని, అటవీ సంపదను సర్వనాశనం చేస్తుంది. ఈ మైనింగ్ ఫలితంగా 20 సం॥లలో ఈ ఇనుప ఖనిజం గానీ, బాక్సైట్ గానీ అయిపోతాయి. మనకేమీ మిగలవు. జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు. ఇది కేవలం ఆదివాసీ సమస్య మాత్రమే గాదు. పర్యావరణం ధ్వంస మౌతుంది, అడవులు నాశనమౌతున్నాయి. ఆదివాసీల జీవితాలు ఛిద్రమౌతున్నాయి. కనుక ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని మనం డిమాండ్ చేద్దాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులైన ఆదివాసీలకు, ఇతర ప్రజానీకానికి సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని మనం డిమాండ్ చేద్దాం. ఎంతోమంది త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబూనుకోవటం అత్యంత దుర్మార్గం. దీనిని నిలుపుదల చేయాలని మనం డిమాండ్ చేద్దాం.

**విప్లవం వర్ధిల్లాలి!**

## కా॥ ఎస్. ఝాన్సీ, ఏఐకెఎంకెఎస్, కో-కన్వీనర్



**కామ్రేడ్స్!**

అటవీ సంరక్షణ సవరణ చట్టం-2023కు వ్యతిరేకంగా జరుగుతున్నటువంటి రెండు రోజుల సదస్సులో రెండవ రోజైన ప్రతినిధుల సభకు మనం ఆహ్వానించిన పెద్దలు, నాయకులు ఈ చట్టంలో ఏం ఉంది? దీని పూర్వాపరాలు ఏంటి? పాలకుల ఉద్దేశాలేంటి? పూర్తి స్థాయిలో ఈ చట్టం అమలయితే వచ్చే పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయి ? దీనిని ఎలా మార్చాలి అని వక్తలందరూ చాలా వివరంగా మాట్లాడారు.

పెద్దలు, మిత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించినప్పటికీ, ఆ సందర్భంగా రైతులకు చేసిన వాగ్దానాలను వేటినీ అమలు చేయలేదని చెప్పారు. ఫలితంగా వ్యవసాయ రంగంలో సంక్షోభం పెరుగుతూనే ఉందని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, విద్యుత్ ఛార్జీలు పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ప్రజలు, ప్రజాసమస్యలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజాతంత్రవాదులు ఈ చట్టాల వల్ల కేవలం రైతుకు మాత్రమే నష్టం కాదు, మొత్తం దేశానికే నష్టం అని ఎంత వివరించినప్పటికీ పాలకులు ఆ చట్టాలకు సంబంధించిన విషయాలను అమలుచేస్తూ పోతున్నారు. అన్న విధంగా దాని కొనసాగింపుగానే ప్రస్తుత అటవీ చట్టం గానీ, పారిశ్రామిక రంగాల్లో తీసుకొస్తున్న విధానాలు గానీ ఉన్నాయని తమకున్న అనుభవంతో వివరంగా చెప్పారు. అలాగే మిత్రులు త్రినాధ్‌గారు మన ఉద్యమాలకు అండగా ఉంటూ, మన ఉద్యమాలు ఎదుర్కొంటున్న కేసులను మన తరపున కోర్టుల్లో వాదిస్తున్నారు. ఈ సవరణ చట్టంలో ఏముంది, మూలంలోకి వెళ్తే ఇది అటవీ సంరక్షణ కాదని, అటవీ భక్షణ చట్టం అని చెబుతూ ఈ చట్టం యొక్క స్వరూప, స్వభావాలను, అడవుల గురించి పాలకులు ఏం చెబుతున్నారు, గిరిజనులకు వాళ్ళేం చేస్తున్నారు, ఎలా గిరిజనుల హక్కులను ఒక్కొక్కటిగా లాగేసు కుంటున్నారు చట్టపరంగా అనేది చక్కగా వివరించారు.

ఇంకా ఎమ్మెల్సీ రఘువర్మగారు, ఆదివాసీ సంఘానికి చెందిన జాతీయ కార్యదర్శి సోరేన్‌గారు ఈ చట్టం గురించి, దీనికి ముందు చేసిన అటవీ చట్టాల గురించి, ప్రభుత్వ విధానాల గురించి వివరంగా మాట్లాడారు. నిన్నటి ప్రారంభసభలోను, బహిరంగ సభలోను మాట్లాడిన వివిధ ప్రజాసంఘాలకు చెందినవారు, వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాళ్ళు ఈ చట్టం ఏవిధంగా ప్రజావ్యతిరేక మైనదో స్పష్టంగా వివరించారు. దీని ప్రభావం ప్రజలపై ఎలా ఉండబోతోంది? దీనిని ఉపసంహరించుకోవటానికి పాలకులపై ఏవిధంగా వత్తిడి తీసుకురావాలి, ఆ ఉద్యమాలకు మేమంతా కూడా అండగా నిలుస్తాం అని వారు ప్రకటించిన విషయాన్ని మనం గమనంలోకి తీసుకోవాలి.

వీరందరూ మాట్లాడిన తర్వాత మనం ఏమనుకుంటున్నాం? ఏం చేయాలనుకుంటున్నాం అనేది చెప్పుకోవాలి. నిన్న జార్ఖండ్ కామ్రేడ్ శంభు మహాతోగారు చెప్పారు ఆదివాసీల సమస్య కేవలం ఆదివాసీ సమస్యగా మాత్రమే లేదు. ఈ వ్యవస్థ యొక్క అర్ధవలస, అర్ధఫ్యూడల్ స్వభావంతో ముడిపడి ఉంది. వ్యవస్థ గురించి మాట్లాడకుండా, వ్యవస్థ మార్పు అనేది లేకుండా ఆదివాసీ సమస్య విడిగా పరిష్కారం కాదనీ ఆ కామ్రేడ్ సూటిగా వివరించారు. మిగిలిన కామ్రేడ్స్ కూడా ఇది కేవలం ఆదివాసులకు మాత్రమే కాక మొత్తం దేశానికి ఏ విధంగా నష్టదాయకమో, పర్యావరణానికి ఏవిధంగా ప్రమాదకారో వివరించారు. ఈ విషయాలన్నిటినీ మనం పరిగణనలోకి తీసుకుని, వీటికి సంబంధించిన లోతుల్లోకి వెళ్తే ప్రధానమైన అంశాలుగా మూడు, నాలుగు విషయాలను చెప్పుకోవచ్చు.

ఒకటి, అడవి, అటవీ సంపద. బ్రిటీషు వాళ్ళు మన దేశంలోకి వచ్చిన తర్వాత చేసిందేమిటి. చిరకాలం నుండి అడవుల్లో నివసిస్తున్న గిరిజనులు, అడవులపై ఆధారపడి జీవిస్తూ, అడవులను కాపాడుకుంటూ వస్తున్న వారి చక్కటి జీవన విధానాన్ని బ్రిటీషువాళ్ళు ధ్వంసం చేశారు. ఎందుకు చేశారంటే అడవుల్లో అపారమైన సంపద ఉంది. ఇది చాలా ముఖ్యమైనది, విలువైనది. ప్రపంచానికి దీని అవసరం ఉంది. ఇది కేవలం ఆదివాసులకే పరిమితమైంది కాదు అనే భావనను తీసుకువచ్చి ఆదివాసీలను కట్టడి చేసే చర్యలు చేపట్టారు. రకరకాల అటవీ చట్టాలు చేస్తూ అడవిలోని సంపదనంతటినీ దోచుకునే పనిని మొదలు పెట్టారు. 1809 తర్వాత బ్రిటీషు వాళ్ళు ఓడలు తయారు చేయటానికి మన అడవుల్లోని కలపను తరలించుకుపోయారు. దీని కోసం 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత 1859 నుండి వరుసనే ఒకటి, రెండు చట్టాలు చేశారు. భారత అటవీ చట్టం 1878, భారత అటవీ చట్టం 1927 ఇందులో ముఖ్యమైనవి. వీటిలో గిరిజనులకు కొన్ని హక్కులు కల్పిస్తామంటూనే వాళ్ళు చేసిందేమంటే

వాస్తవానికి గిరిజనులకు పరిమితులు విధించటం. మీరు ఈ హద్దుల్లోనే ఉండాలి, దీనిని దాటి అడవి లోపలికి వెళ్ళి ఉపయోగించుకునే అధికారం మీకు లేదు అని హద్దులు నిర్ణయించారు. గిరిజనుల అభివృద్ధి కోసం గానీ, గిరిజనులకు ఉపయోగపడటం కోసం గానీ ఈ చట్టాలు చేయలేదు వాళ్ళ జీవితాలను మెరుగుపరచటం కోసం ఈ చట్టాలు చేయలేదు. వాళ్ళు ఆధారపడి జీవిస్తున్న అటవీ భూమిపై వారికి హక్కు కల్పించలేదు. భారతదేశంలో లభ్యమయ్యే అటవీ సంపద ప్రత్యేకమైనది, చాలా విలువైనది. అటువంటి విలువైన సంపద మీద ఎలా పట్టు సంపాదించాలి అనే ఉద్దేశంతో చేసిన చట్టాలివి. దోపిడీ స్వభావంతో కూడిన చట్టాలివి. అయితే బ్రిటీషు వాళ్ళు చేసిన ఈ చట్టాలను గిరిజనులు మౌనంగా అంగీకరించలేదు. మా సంపదను నువ్వు దోపిడీ చేస్తే మేం సహించం, మా జీవించే హక్కుకు నువ్వు భంగం కలిగిస్తే మేం ఊరుకోం, మా ఆత్మ గౌరవానికి భంగం కలిగించే విధంగా నువ్వు వ్యవహరిస్తే మేం ప్రతిఘటిస్తాం అని వలసపాలకులకు వ్యతిరేకంగా గిరిజనులు అనేక పోరాటాలు చేశారు. జాతీయోద్యమంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గట్టి పోరాటాలను ఆదివాసీలు చేశారు. ఈ అడవి మాది అని బ్రిటీషు సామ్రాజ్యవాదులతో తలపడ్డారు. వేలాదిమంది ఆదివాసీయి నిర్బంధాలకు వెరవకుండా ఈ పోరాటాల్లో పాల్గొన్నారు. సంతాల్ తిరుగుబాటులో 15 వేలమంది సంతాలులను ఆనాడు బ్రిటీషు సామ్రాజ్యవాదులు పొట్టన బెట్టుకున్నారు. గిరిజనులపై ప్రేమ ఉండి ఆ చట్టాలు చేశారా లేక సంపదలను దోచుకోవటానికి ఈ చట్టాలు చేశారా అన్నది దీనినిబట్టి మనం నిర్ణయించవచ్చు. సంపదలను తరలించుకు పోవటానికి వీలుగా తమకు అడ్డువచ్చిన వారందరినీ తీవ్ర నిర్బంధాలకు గురిచేసిన చరిత్రను మనం చూశాం. ఇది 1947కు ముందు జరిగిన చరిత్ర. తర్వాత 1950లలో రాజ్యాంగం వచ్చింది. దాంట్లో అడవి ఎవరిది అనేది ఉత్పన్నమైనప్పుడు కొన్ని విషయాల వరకు రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కు అని చెప్పారు. మళ్ళీ తర్వాత కొన్ని అంశాలు రాష్ట్ర ప్రభుత్వ జాబితాలోకి, కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వ జాబితాలోకి వస్తాయని చెప్పారు. స్వదేశీ పాలకులు 1980లో అటవీ సంరక్షణ చట్టం చేశారు, 1996లో పీసా చట్టం చేశారు. ఇవేవీ కూడా ఆదివాసుల మీద ప్రేమతోనో, వారి అభివృద్ధిని కాంక్షించో చేయలేదు. అడవులను సంరక్షించటం కూడా వారి ఉద్దేశం కాదు. వలస పాలకుల లాగానే అడవులను ఆదాయ వనరుగానే స్వదేశీపాలకులు కూడా పరిగణించారు. వలస పాలకులలాగే గిరిజనులను మభ్యపెట్టటానికి, మోసం చేయటానికి వాళ్ళు ప్రయత్నాలు చేశారు, చేస్తూ ఉన్నారు. ఒక పక్కన చట్టాలు చేస్తూనే, మరోపక్క గిరిజనోద్యమాలను నిరంకుశంగా అణచివేశారు. శ్రీకాకుళం ఉద్యమాన్ని అణిచేశారు. నక్సల్బరీ ఉద్యమాన్ని అణచివేశారు. ఒకపక్క నిర్బంధం, అణిచివేత; మరోపక్క కంటి తుడుపు చట్టాలు చేయటం సాగించారు. ఆయా చట్టాలలో గిరిజనులకు అనుకూలంగా ఉన్న, వారికి మేలు చేసేవిధంగా ఉన్న వేటినీ కూడా పాలకులు అమలు పరచలేదు. ఉదాహరణ ఆంధ్రప్రదేశ్‌లో మహత్తర శ్రీకాకుళ గిరిజన పోరాటం తర్వాత పాలకులు చేసిందేమిటి? వందలాది మందిని చంపేశారు, వేలాది మందిని నిర్బంధించారు. మరోవైపు గిరిజనులను బుజ్జగించటానికి మీకు చాలా చట్టాలు చేస్తున్నాం, మీ గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా ప్రకటిస్తున్నాం అని 1/70 చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం ఏజన్సీ ప్రాంతంలో ఉండే ఆదివాసీల భూములను ఆదివాసీయేతరులు కొనటానికి వీలులేదు. ఈ చట్టం చేసి 50 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆదివాసీలు తాము కోల్పోయిన 8 లక్షల ఎకరాల భూమిని తిరిగి తమకు స్వాధీనం చేయాలని 1/70 చట్టం ప్రకారం గత 50 ఏళ్ళుగా పోరాడుతూనే ఉన్నారు. తాము చేసిన చట్టాన్ని అమలు చేయటానికే ఈ పాలకులకు సాధ్యం కాలేదు. ఎందుకు సాధ్యం కాలేదు? చేతగాక కాదు. వాళ్ళు ఆ పని చేయాలనుకోలేదు. అటవీ సంపదనంతా దోచుకోవటానికి వీలుగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. అదే ఫారెస్టు యంత్రాంగం. గిరిజనులు పెంచుకునే కోళ్ళు, ఇతర జంతువులను లాక్కుపోవటం, వాళ్ళపై దౌర్జన్యాలకు పాల్పడటం ఇదీ ఫారెస్టు యంత్రాంగపు పని తీరు. అటవీ చట్టానికి విరుద్ధంగా గిరిజనులు చిన్న తప్పు చేసినా వాళ్ళ మీద కేసులు పెట్టి నిర్బంధించటానికి ఫారెస్టు డిపార్టుమెంటు సిద్ధంగా ఉంటుంది. అడవిని అన్యాక్రాంతం చేస్తూ, అటవీ సంపదను దోచుకునే వాళ్ళ వైపు కన్నెత్తి కూడా చూడని పాలకులు, ఫారెస్టు డిపార్టుమెంటు గిరిజనుల విషయానికి వచ్చేసరికి చట్టాలను అతిక్రమించబోమని భీష్మించుకు కూర్చుంటారు. చిన్న ఉదాహరణ – కొండమొదలు గ్రామానికి వెళ్ళాలంటే లాంచీ మీద గోదావరి దాటి వెళ్ళాలి. 2018లో గోదావరిలో లాంచీ మునిగి పోయింది. కేవలం 13 లక్షల రూపాయలు ఖర్చు పెడితే ఆ అక్కడుండే ఆదివాసీల రవాణాకు సంబంధించి రోడ్డు వేయగలుగుతారు. కానీ ఆ రోడ్డు వేయనే లేదు. ఎందుకని అడిగితే వాళ్ళు చెప్పిందేమంటే మేము రోడ్డు వేయాలంటే ఇందులో కొంత భాగం రిజర్వు ఫారెస్టులో ఉంది, రిజర్వు ఫారెస్టును మేం అంటుకోవటానికి లేదు అని నాలుగైదు సంవత్సరాల నుండి ఆ ప్రాంత గిరిజనులకు రవాణా సౌకర్యం లేకుండా చేశారు. అంటే గిరిజనుల పట్ల పాలకులు గానీ, అధికారులు గానీ ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారో మనకు అర్థం అవుతుంది. మనం ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. వేలకు వేల హెక్టార్ల అటవీ భూమిని మైనింగ్ కొరకు ఒకే ఒక్క సంతకంతో ప్రైవేటు పెట్టుబడిదారులకు ఇచ్చేస్తున్నారు. మరి అడవిలో జీవిస్తున్న గిరిజనులకు ఒక రవాణా సదుపాయాన్ని కల్పించాల్సి వచ్చేటప్పటికి మాత్రం అటవీ భూమిని మేం ముట్టుకోకూడదు అంటున్నారు. మరి ఆ ప్రజల పరిస్థితి ఏమిటి? వాళ్ళ మంచి చెడులేమిటి? వారికి కల్పించాల్సిన సౌకర్యాలేమిటి అన్నది చూసినప్పుడు గిరిజన ప్రజానీకం ఎంతటి నిర్లక్ష్యానికి గురవుతోందో మనకు స్పష్టం అర్థం అవుతుంది.

1980లో అటవీ సంరక్షణ చట్టం చేశారు. దాని ప్రకారం హద్దులు వేశారు. ఈ హద్దులకు బయటే మీరు ఉండాలి, హద్దులను అతిక్రమించి అడవుల లోపలికి వెళ్లకూడదన్నారు. 1996లో పీసా చట్టం చేశారు; మా ఊరు, మారాజ్యం అని గిరిజనులను ఊరించారు. గ్రామసభలు నిర్ణయం చేస్తే తప్ప అటవీ భూమిని అటవీయేతర మైనింగ్ తదితరాలకు మళ్ళించటానికి వీల్లేదు. కానీ వాస్తవంలో ఏం జరుగుతోంది? గిరిజనుల అనుకూలంగా ఉండే చట్టాలను తుంగలో తొక్కేశారు. పెద్దపెద్ద కంపెనీలకు భూములివ్వటానికి

అవలీలగా చట్టాలన్నిటినీ ప్రభుత్వాలే అతిక్రమిస్తున్నాయి. గిరిజనుల కోసం, ప్రజల కోసం ఏమన్నా చెయ్యాల్సి వచ్చేటప్పటికీ చట్టాలను సాకుగా చూపెడుతున్నారు. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక అడవికి సంబంధించిన నిర్వచనాలను మార్చేశారు. ఇప్పుడు చేసిన అటవీ సంరక్షణ సవరణ చట్టం ప్రకారం ఎంతో విలువైన ఖనిజాలు, గనులు ఉన్న అటవీ ప్రాంతమంతా కేంద్ర ప్రభుత్వ స్వాధీనంలో ఉంటుంది. రాష్ట్రాలు నుండి హక్కులు లాగేసుకున్నారు. ఏ రాష్ట్రం కూడా ఇది మాది అని చెప్పే హక్కు కూడా లేకుండా సవరణ చట్టాన్ని చేసేశారు. ఎందుకు ఈ విధంగా రాష్ట్రాల హక్కులు లాగేసుకుంటున్నారు? ఎందుకు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు అన్నది పరిశీలించాలి. మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ విలువైన సంపద ఉంది, ఎక్కడెక్కడ విలువైన నిక్షేపాలున్నాయి. వెండి, బంగారం, ప్లాటినం ఎక్కడ లభ్యమవుతాయి అన్న దాన్ని పరిశోధించి వాటిని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టటానికి పూనుకుంటున్నారు. కరోనా కాలంలో ప్రజలందరూ అనేక అవస్థలు పడుతున్నా సమయంలో మోడీగారు అమెరికావాడి సాయంతో, ఫ్రాన్సువాడి సాయంతో ఎక్కడెక్కడ ఏయే సంపదలు ఉన్నాయో కనిపెట్టే పనిలో పడ్డారు. అప్పటిదాకా అడవిలో అపారమైన సంపద ఉంది. అది ఆదివాసీలకు తెలియదు, వాళ్ళు దాన్ని వెలికి తీయలేరు. ఈ సంపదను మనం బయటకు తీసి అమ్మేస్తే మన దేశానికి చాలా డబ్బులొస్తాయి అని మాయమాటలు చెప్పారు. అయితే మన లాంటి సంఘాలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు ఇదుగో ఈ చట్టం ఉంది కదా, దీని ప్రకారం అడవిని మళ్ళించటానికి వీల్లేదు, ఆదివాసుల హక్కులకు భంగం కలగటానికి వీల్లేదు అని ప్రశ్నించకుండా ఉండాలంటే ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరించి తీరాలి. అప్పుడే ఏ అడ్డంకులు లేకుండా బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే అవకాశం ఉంటుంది. గిరిజనులకు, గిరినోద్యమాలకు సహాయం చేసేవాళ్ళకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకూడదు అనే ఉద్దేశంతోనే ఈ సవరణ చట్టాన్ని చేశారు. ఈ పాలకవర్గాలు అడవులలోని విలువైన సంపదను దేశానికి కూడా మిగలనీయటం లేదు, ఆ సంపదనంతటిని మూడో, నాలుగో కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టటానికి పూనుకుంటున్నారు. ఆ కార్పొరేట్లు లక్షల కోట్ల రూపాయలు లాభాలు దండుకోవటానికి మన సంపదనంతా అమ్మేస్తున్నారు. కార్పొరేట్లు అంటే కేవలం మన దేశంలో ఉండే కార్పొరేట్లు కాదు, సామ్రాజ్యవాదులతో మిలాఖత్తు, అయిన ఈ కార్పొరేట్ కంపెనీలన్నీ ఈ రోజు అడవులన్నింటినీ బోడికొండలుగా చేసి గిరిజనులను మీరిక్కడినుండి వెళ్ళిపొండి, ఎటోకొటు పోయి వలసకూలీలుగా బ్రతకండి అని వారిని తరిమేస్తున్నారు. నిజంగా అడవుల్లోని సంపద మీద ముందుగా హక్కు కలిగిన వాళ్ళు గిరిజనులే. వాళ్ళను తరిమేస్తున్నారు. కనీసం దేశానికైనా ఆ సంపదను మిగలనీయటంలేదు. ఈ సంపద కార్పొరేట్లది, సామ్రాజ్యవాదులని అని చెప్పటం కోసమే రకరకాల చట్టాలు తీసుకు వస్తున్నారు. ఇప్పుడు చేసిన సవరణ చట్టం కూడా అందులో భాగమేనని మనం అర్థం చేసుకోవాలి. పేరుకే అటవీ సంరక్షణ తప్ప వాళ్ళు చేస్తున్నదంతా అడవిని భక్షించడానికే. అడవిని, ఆటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఉన్న అడ్డంకులను తొలగించుకోవటానికే ఈ చట్టానికి సవరణ చేశారనేది మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఈ సవరణ ఈ రోజు భారత సమాజానికే ఒక సవాలుగా మారే పరిస్థితి ఉంది.

ఒకవైపు వ్యవసాయాన్నంతా కునారిల్లేలా చేస్తున్నారు. ఇంక ఏ రైతు కూడా వ్యవసాయం చేయలేని స్థితి తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలు వేల లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అయినా బహుళజాతి కంపెనీల దాహానికి అది సరిపోవటం లేదు. మీ దేశంలోని అడవుల్లో అపారమైన సంపద ఉంది, అది అంతా మాకే కావాలి అంటున్నాయి బహుళజాతి కంపెనీలు. ఇందాక మిత్రులు చెప్పినట్లు అటవీ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు రెండూ కలిపే నిర్ణయాలను ప్రకటిస్తాయట. ఎటువంటి నిర్ణయాలవి? గిరిజనుల మనుగడకు ముప్పువాటిల్లే నిర్ణయాలవి. కార్పొరేట్లకు సంపదలను కట్టబట్టే 12 ఏళ్ళు, 15 ఏళ్ళు, 50 ఏళ్ళు వాళ్ళకు లీజుకు ఇస్తారంట. లీజు కండిషన్లేమిటంటే వాళ్ళు తమ తమ పనులు మొదలు పెట్టుకోవటానికి, కొనసాగించ టానికి వీలుగా అక్కడుండే ఆదివాసీలు ఎప్పుడు ఖాళీ చేయాలి అనేది కంపెనీల చేతుల్లో ఉంటుందంట. రెండురోజుల్లో మీరిక్కడ నుండి వెళ్ళిపోవాలని కంపెనీలు ఆదేశిస్తే తరతరాల నుండి అడవులనే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసులు తమ తమ స్వస్థలాలను వదివి బికారుల్లాగా తట్టాబుట్టా సర్దుకుని వెళ్ళిపోవాలంట. ప్రజలకు ఒక రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఏమీ లేకుండా మొత్తం కంపెనీలకు అప్పజెప్పటానికి సిద్ధపడిపోయారు పాలకులు.

ఒరిస్సాలో ఏం జరుగుతోంది? వేదాంత కంపెనీకి అటవీ భూములను అప్పజెప్పటానికి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అడవుల్లో భూములను కంపెనీ వాళ్ళు ఇష్టం వచ్చినట్లు తవ్వేస్తుంటే అక్కడున్న ఆదివాసులు ప్రతిఘటించారు. ఈ భూములు మావి మీరు తవ్వటానికి వీల్లేదు అని పోరాడుతుంటే వారి మీద నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది నవీన్ పట్నాయక్ ప్రభుత్వం. ఈ రెండు నెలల్లోనే 40 మంది ఆదివాసులను నిర్బంధించి జైళ్ళల్లో పెట్టారు. వారిపై దేశద్రోహ నేరం మోపారు. వారికి ఎవరూ బెయిల్ ఇప్పించటానికి లేదు. ఎవరైనా వాళ్ళకు బెయిల్ ఇప్పించటానికి ప్రయత్నం చేసినా వాళ్ళను కూడా కిడ్నాప్ చేయటం, రకరకాల పద్ధతులల్లో బెదిరించటం చేస్తున్నారు. ఈ ఆదివాసులు దేశద్రోహులు, వీళ్ళు జైల్లో మగ్గవలసిందే అని పాలకులు ప్రకటించటం ఎంత క్రూరత్వం? అడవిలో జీవించేవాళ్ళు, రెక్కల కష్టం చేసేవాళ్ళు, ప్రకృతిని ప్రేమించేవాళ్ళు, ప్రకృతి సంపదలను కాపాడేవాళ్ళు వాళ్ళ మీద దేశద్రోహ నేరం మోపటం ఎంత దుర్మార్గం? అక్కడి పాలకులు సిగ్గు ఎగ్గు లేకుండా ఎలాగైనా సరే బహుళజాతి కంపెనీలకు సంపదలను కట్టబెట్టటానికే పూనుకుంటున్నారు. ఒరిస్సాలో మాత్రమే కాదు జార్ఖండ్‌లోనూ అదే పరిస్థితి. బీహార్‌లోనూ అదే పరిస్థితి. తెలంగాణలోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే విశాఖపట్నంలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. ఎత్తైన కొండల్లో ఉన్నటువంటి ఈ అపారమైన సంపదనంతా బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టటానికే చూస్తున్నారు. ఇవన్నీ చూసినప్పుడు ఈ సవరణ చట్టం మొత్తం దేశానికి, పర్యావరణానికి, ప్రత్యేకించి ఆదివాసులకు ఎంతో నష్టదాయకమైనదని అర్థం అవుతుంది.

1980లో చేసిన అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చట్టం చేయటంలో పాలకులు ఒక విధానాన్ని అనుసరించారు. 2019 నుంచి మొదలు పెట్టారు. 2019లో గిరిజన మంత్రిత్వ శాఖ, అటవీ మంత్రిత్వశాఖ రెండూ కలిసే అడవులకు సంబంధించిన విషయాలను ప్రకటిస్తామన్నారు. కోవిడ్ కాలంలో దేశమంతా అల్లాడుతుంటే నిశ్శబ్దంగా మైనింగ్ శాసనాలను సవరించేశారు. పబ్లిక్ హియరింగ్ అవసరం లేదన్నారు. బయో డైవర్సిటీ యాక్టును మార్చేశారు. పర్యావరణానికి సంబంధించిన శాసనాలను మార్చేశారు. 2021లో అటవీ సంరక్షణ నియమావళిని ప్రకటించారు. ఇప్పుడు 2023లో, ఫైనల్‌గా అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని చేశారు. ఇది చట్టం కాకముందే 157 మంది విశ్రాంత ఐ.ఎ.ఎస్. అధికారులు పార్లమెంటులోని అన్ని పార్టీల వాళ్ళకు లేఖలు రాశారు. ఇది దేశానికి చాలా నష్టదాయకమైనది. పర్యావరణానికి నష్టదాయకమైనది. కేవలం ఆదివాసులు మాత్రమే కాదు భవిష్యత్తు తరాలన్నీ నష్టపోతాయి. కనుక ఈ చట్టాన్ని చేయవద్దు. మేం ఏ పార్టీకి చెందినవాళ్ళం కాదు. అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాం అని వాళ్ళు చెప్పినా ఏమాత్రం పట్టించుకోని పాలకులను ఏమనాలి? ఇలాంటి దుర్మార్గమైన చట్టాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? ప్రజలు వద్దకు వెళ్ళి వాటిని వివరించి ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన కర్తవ్యం మనపై ఉంది.

ఈ కర్తవ్యాన్ని చేపట్టటంలో మనకు అనేక ధోరణులు ఎదురవుతున్నాయి. ఇది ఆదివాసీలకు సంబంధించిన విషయం, ఇక వాళ్ళు ఎల్లకాలం అడవుల్లో ఉండిపోవాల్సిందేనా, బయటకు వస్తే నష్టం ఏమిటి అని కొందరంటున్నారు. ఇంకొందరైతే ఈ ఉద్యమాలకు ఆదివాసీలే నాయకత్వం వహించాలి అని తప్పు ధోరణి పట్టిస్తున్నారు. అంతే తప్ప ఈ సమస్యలో ఒక జాతికి, వ్యవస్థకు ఉన్న సంబంధం ఏమిటి? దీని వలన సమాజపు భవిష్యత్తు ఏమిటి? మన గాలి, నీరు కలుషితమై పోతే పరిస్థితి ఏమిటి? ఇప్పటికే వాతావరణంలో అనేక మార్పులు చూస్తున్నాం. ఎప్పుడు ఎండ కాస్తుందో తెలియదు, ఎప్పుడు వర్షాలు పడతాయో తెలియదు, రుతువులన్నీ మారిపోతున్నాయి. దీనంతటికీ కారణం సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు. వీళ్ళు లాభాపేక్షతో అడవులను తమ ఇష్టం వచ్చినట్లు నాశనం చేస్తుంటే ప్రజల మనుగడ ఏమైపోతుంది? మన సంపద ఏమైపోతుంది అని ప్రతి ఒక్కళ్ళు ఆలోచించాలి. ఇది కేవలం ఆదివాసీలదో లేదా ఒక రాష్ట్రానిదో కాదు. ఇది యావద్భారతదేశ సమస్య, భారత ప్రజలందరి సమస్య. ఈ సమస్యపై మేధావులు, ప్రజాతంత్రవాదులు అందరితో కలిసి ఈ చట్టాన్ని చేసిన వాళ్ళే దేశద్రోహులు, దేశాన్ని ప్రజలను తీవ్రంగా నష్టపెట్టే వాళ్ళు అని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. మరి ప్రజల మధ్య ఈ ఐక్యత రాకుండా ఉండటానికి ఈ పాలకులే ఎక్కడికక్కడ కులసంఘాలుగా ఏర్పరచి ప్రజలను విడగొడుతున్నారు. మత విద్వేషాలను పనిగట్టుకుని వ్యాప్తి చేస్తూ మతాల వారిగా విడగొడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పాలకుల దురుద్దేశాలను ఎండగడుతూ, వివరిస్తూ, ప్రజలందరిని ఐక్యపరచాల్సిన కర్తవ్యం మనమీద ఉంది.

20 సంవత్సరాల నుండి పోలవరం ప్రాజెక్టు జపం చేస్తున్నారు పాలకులు. నలుగురు ముఖ్యమంత్రులు మారారు. మొత్తం కొండలు, గుట్టలు తవ్విపారేశారు. నాశనం చేసేశారు. 3 లక్షల మంది గిరిజనులను పునరావాసం లేకుండా రోడ్లపై పడవేశారు. వారికి కావలసిన భూమిని ఇవ్వలేదు. బ్రతకటానికి సరైన ఉపాధిని చూపించలేదు. ఈ సమాజంలో తలెత్తుకుని గౌరవంగా బ్రతికే పరిస్థితి లేదు వాళ్ళకు. ఈ విషయాల గురించి ఎవరూ మాట్లాడుకుండా వాళ్ళు ఏ కాంట్రాక్టరుకు ఇచ్చారు, వీళ్ళే కాంట్రాక్టరుకు ఇచ్చారు, ఎవరికింత ఇచ్చారు అనే విషయాల చుట్టూ తిప్పుతున్నారు. కానీ ఇది 3 లక్షల మంది గిరిజనుల జీవితాలకు సంబంధించిన సమస్య, వారి భూమికి సంబంధించిన సమస్య, వారి జీవన భృతికి సంబంధించిన సమస్య అన్న విషయాలనేమాత్రం పట్టించుకోని పాలకులనేమనాలి? దొంగలనాలా, ద్రోహులనాలా, దళారులనాలా? ఈ పునరావాస సమస్య గురించి కలెక్టరుకు రిప్రెజెంటు చెయ్యటానికి మేం వెళ్ళినప్పుడు 'ఆదివాసీలు అడవిలోంచి బయటకు రావటానికి చాలా టైం తీసుకుంటున్నారు, వాళ్ళను త్వరగా వచ్చేట్లుగా మీరు ఒప్పించండి. పునరావాసానిదేముంది ఇలా బటన్ నొక్కితే చాలు ఎకౌంట్లలోకి డబ్బులు జమైపోతాయి' అని చెప్పారు. ఇది జరిగి రెండు సంవత్సరాలు దాటిపోయింది. బటన్ నొక్కనూ లేదు, డబ్బు జమ అవ్వనూ లేదు. గ్రామాలకు కరెంటు లేదు. బ్రతుకు దెరువు కోసం అల్లాడుతున్న పరిస్థితిలో పోలవరం నిర్వాసితులున్నారు. మణిపూర్‌లో జరిగిన ఘోరం అందరూ చూశారు. ఇక్కడ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ గానీ, ప్రతిపక్షంలో ఉన్న పార్టీ గానీ మహిళలను నగ్నంగా ఊరేగించటం దుర్మార్గం, అత్యాచారం చేసి చంపెయ్యటం తప్పు అని ఖండించటానికి వాళ్ళకు నోరు పెగలలేదు. తెలంగాణాలోనూ అదే పరిస్థితి, ఒరిస్సాలోనూ అదే పరిస్థితి. కానీ కోట్లాది మంది ప్రజానీకం ఆ వీడియోలు చూసి అల్లాడిపోయారు. ఎక్కడికక్కడ తమకు తోచిన పద్ధతుల్లో నిరసన తెలియజేశారు. ఇక్కడ ప్రజల సానుభూతి, స్పందన చాలా విలువైనది. దాని ముందు ఏ చట్టాలు, ఏ పార్టీలు పనికిరావు అనే విషయం మణిపూర్ మారణకాండ సందర్భంగా మరోసారి రుజువైంది. దీన్ని మనం స్వీకరించాలి. ఏదైనా ఒక విషయాల్లో తప్పు జరిగిందంటే ప్రజలు స్పందిస్తున్నారు. ఆ స్పందించేవైపు మీరు నడవాలని ప్రజలకు వివరించాల్సిన కర్తవ్యం మనపై ఉంది.

అడవికి సంబంధించిన విషయాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ హక్కులు లేకుండా మొత్తం కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తెచ్చేసుకుంది. సరిహద్దులకు లోపల 100 కి.మీ పరిధిలోని అడవి సంరక్షణ పరిధిలోకి రాదని సవరణ చేశాక చిన్న చిన్న ఈశాన్య రాష్ట్రాలన్నీ కనుమరుగై పోయే పరిస్థితి ఉంది. చెట్లు, పుట్టలు, గుట్టలు ఏవీ రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉండవు. మొత్తం కేంద్ర ప్రభుత్వం గుప్పిటలోనే ఉంటుంది. ఏ సామ్రాజ్యవాదులకు, ఏ బహుళజాతి కంపెనీలకు, ఏ కార్పొరేట్లకు ఎలా అమ్మివేయాలి, ఎలా లీజుకివ్వాలి అనేది మొత్తం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుంది. ఏ రాష్ట్రానికీ మాట్లాడే హక్కు కూడా ఉండదు.

ఈ సవరణ చట్టానికి సంబంధించి ముఖ్యమైన అంశాలు మూడు ఉన్నాయి. అవి ప్రజల జీవితాలకు సంబంధించిన విషయాలు, పర్యావరణానికి సంబంధించిన విషయాలు, జీవవైవిధ్యానికి

సంబంధించిన విషయాలు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కూడా తీవ్రమైన ఉక్కపోతతో మనం అల్లాడుతున్నామంటే పర్యావరణం ఎంత ధ్వంసమైనట్లు? ఇప్పటికే వేల హెక్టార్ల అటవీ భూమిని నాశనం చేసినందువల్లనే ఈ రోజు వాతావరణం అంతా మారిపోయింది. ఈ స్థితిలో మనమేం చెయ్యాలి? మనకు భవిష్యత్తు ఆశావహంగా ఉండాలంటే, మన తర్వాతి తరం సంపదతో, ఆరోగ్యంతో ఉండాలంటే ఈ విధమైన దుష్ట చట్టాలన్నింటికి వ్యతిరేకంగా మనం పోరాడాలి. ఈ సంపదంతా మాది. మా రాష్ట్రంలో ఉండే సంపదను దొంగిలిస్తే మేం ఊరుకోం, దీన్ని కేంద్ర ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోవటానికి, దొంగలించటానికి వీల్లేదని మనం పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఇంతకు ముందు మాట్లాడిన మిత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు చెప్పారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా మన డిమాండ్స్ ఉన్నాయి. ఈ అటవీ సంరక్షణ చట్టాన్ని ఉపసంహరించు కోవాలనే డిమాండ్ ఉంది. రేపు జరగబోయే ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా సరే ఈ చట్టాలను ఉపసంహరిస్తారా, లేదా అని మనం నిలదీయాల్సిందే. ప్రజాపోరాటాన్ని ముందుకు తీసుకుపోవలసిందే. ప్రజాపోరాటాలే ప్రత్యామ్నాయం తప్ప మరో పరిష్కారం లేదనే తీర్మానం చేసుకుని విశాలమైన ప్రజారాశుల్లోకి, మేధావుల్లోకి, ప్రజాతంత్రవాదుల్లోకి, వివిధ ప్రాంతాల్లోకి తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉంది.

విశాఖ ఉక్కుకు సంబంధించిన సమస్యలో ప్రైవేటైజేషన్ ఆపాలని ఈ సదస్సు తీర్మానం చేయాలని విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకులు నిన్న ప్రారంభ సభలో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశారు. ఆ తీర్మానం కూడా మనం చేయాలి. ఇది కేవలం కార్మికుల సమస్య మాత్రమే కాదు. ప్రైవేటీకరణ అనేది మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య. కనుక ఆ కార్మికులతో పాటు మనమందరం కూడా కలిసి పోరాడాలి. అదేవిధంగా వ్యవసాయానికి సంబంధించి, భూమికి సంబంధించి ఏఏ నల్ల చట్టాలు తెచ్చారో వాటన్నింటికీ వ్యతిరేకంగా, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, ఆదివాసీలు, మేధావులు అందరూ కలిసి పోరాడుదామని ఈ సదస్సు ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

## కా॥ విల్లి కృష్ణన్, ఏఐకేఎంకేఎస్ నాయకులు, తమిళనాడు



అందరికీ విప్లవాభి నందనలు. అఖిల భారత ఆదివాసీ సదస్సులో నిన్నటిరోజు ప్రారంభసభ, బహిరంగసభ ఉత్తేజకరంగా జరిగాయి. మోడీ ప్రభుత్వం వరుసగా గత తొమ్మిది ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతూ దేశ సంపదను కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టే ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి చర్యలతో పాటుగా ప్రభుత్వ,ప్రభుత్వ రంగ సంస్థలను బాహాటంగా అమ్మకానికి పెడుతుంది. రాష్ట్రాల హక్కులను మరింతగా కుదించి వేస్తోంది. తన దుర్మార్గమైన విధానాలపై వ్యతిరేకత నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు మత, ప్రాంతీయ, భాష విద్వేషాలను రెచ్చ గొడుతోంది. దేశవ్యాప్తంగా మతతత్వ దాడులు సాగించటంతో పాటుగా హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలను సాగిస్తోంది. దీనిని తమిళనాడులో ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించారు. మరోవైపున కావేరీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోంది. పాలకుల కుట్రలను ఎండగడుతూ పాలకుల జల విధానాలపై 2021లో దక్షిణ భారత స్థాయి సెమినార్ ఏఐకేఎంకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించుకున్నాం. తదనుగుణంగా పాలకుల విభజించి పాలించే విధానాలను వ్యతిరేకిస్తూ ప్రచారం సాగించాం. కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకునే వైపుగా ఆదివాసులు, రైతు, కూలీ, మేధావులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేస్తున్నాను.

## కా॥ రాజన్, ఏఐకేఎంకేఎస్ నాయకులు, కేరళ



అధ్యక్ష, కామ్రేడ్స్, అఖిల భారత ఆదివాసి సదస్సుకు హాజరైన మిత్రులందరికీ అభినందనలు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న దోపిడీ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు, ముఖ్యంగా రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, ఆదివాసులు, మైనారిటీలు, మహిళలు విస్తృతంగా ఉద్యమాలు సాగిస్తున్నారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులలో సంవత్సరం కాలానికి పైగా రైతాంగం సాగించిన ఉద్యమాన్ని నీరుగార్చడానికి పాలకులు ఎన్నో ప్రయత్నాలు చేసినా చివరికి వాటిని ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించక తప్పలేదు. ముఖ్యంగా బిజెపి పాలనలో ఆదాని, అంబానీల ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. దేశంలోని ప్రభుత్వ పోర్టులు, విమానాశ్రయాలు, గనులు అన్నింటిని వారికి కట్టబెడుతూ వస్తున్నారు. కేరళలోని విలింజం పోర్టును ఆదాని గ్రూపుకి అప్పగించడాన్ని, దానిని మరింత విస్తృతం చేసేపేరిట, వేలాది మత్స్యకారులను విస్తాపనకు గురిచేసే ప్రయత్నాలను నిరసిస్తూ మత్స్యకారులు దీర్ఘకాలం నుండి ఆందోళన సాగిస్తున్నారు. అలానే వేలాది గ్రామాల ప్రజలను విస్తాపనకు గురిచేసే 'సిల్వర్ లైన్ ప్రాజెక్ట్' పేరిట హై స్పీడ్ రైల్వే లైన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నప్పటికి పాలక ప్రభుత్వాలు వాటిని పెడచెవిన పెట్టి, అణచివేత విధానాలను అవలంబిస్తున్నాయి. ఉత్తేజకర వాతావరణంలో జరిగిన సదస్సు స్ఫూర్తితో ఉద్యమ నిర్మాణానికి కృషి సాగిస్తామని తెలియజేస్తున్నాను.

*వ్రాతపూర్వక సందేశం :*

# అటవీ సంరక్షణ చట్టం - కొన్ని ఆలోచనలు

**- శ్రీ వేణుగోపాల శర్మ** ఐఏఎస్ (రిటైర్డ్)

ఇటీవల ముగిసిన జి-20 సమావేశంలో ఆమోదించిన ప్రకటనలోని క్రింది అంశాలను యిక్కడ ప్రస్తావించటం సందర్భోచితంగా ఉంటుందనుకుంటున్నాను. అవి, "మన అందరిదీ ఒకటే భూమి, మనందరం ఒకటే కుటుంబం, ఒకే భవిష్యత్తును మనం అందరం పంచుకుంటున్నాం, వసుదైక కుటుంబ భావనతో మనం ఇక్కడ కలుసుకున్నాం. ఇక్కడ మనం తీసుకునే నిర్ణయాలు ఈ భూగ్రహంపై నివసించే ప్రజలందరి భవిష్యత్తుని నిర్ణయిస్తాయి. పర్యావరణ వ్యవస్థతో సామరస్యంగా జీవించాలనే తాత్విక దృష్టితో మనకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించుకోవడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవడానికి మనం అంకితమై ఉన్నాము."

జి-20 దేశాలు పై ప్రకటనను అమలు పరుస్తాయని మనం అనుకుంటే, భారతదేశం కూడా ఆ ప్రకటనను అమలుపరచడానికి చర్యలు తీసుకుంటుందని అనుకోవచ్చు. అంటే దాని అర్థం అడవులలో అడవులపై ఆధారపడి జీవించే ఆదివాసీలు ఒకే కుటుంబం అనే భావనలో భాగమే అవుతారు. కనుక వారిని వారి పర్యావరణ వ్యవస్థలో సామరస్యంగా జీవించటానికి అనుమతించాలని అర్థం. కానీ జి-20 ప్రకటనకు ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన అటవీ సంరక్షణ (సవరణ) చట్టం అనుగుణంగా లేదు. ఎలా లేదో పరిశీలిద్దాం. ఆ పరిశీలన చేసే ముందు ఆగస్టులో సవరణ చట్టం ఆమోదించడానికి ముందే అటవీ సంరక్షణ పేరుతో కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకున్నది. ఆ విషయాలను చూద్దాం.

2019 ఆగస్టు 3వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ ఇచ్చింది. ఆ సర్క్యులర్ ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ భూమి మళ్లింపు ప్రతిపాదనలు పంపాలి. అలా పంపేటప్పుడు 2006 అటవీ హక్కుల చట్ట నియమాలను పాటించాలని పై సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించేటప్పుడు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పరిష్కారాలు జరిగాయా లేక జరుగుతున్నాయా, అవి ఏ దశలో ఉన్నాయో ఆధారాలతో సహా ప్రతిపాదనలు పంపాలి. స్థానిక భాషలో పరిష్కారాలకు సంబంధించిన విషయాలు గ్రామసభ ముందు పెట్టి చర్చించాలి. గ్రామసభ నుండి ఒక ధృవీకరణ పత్రాన్ని తీసుకుని ప్రతిపాదనలకు జతచేయాలి. ప్రతిపాదిత అటవీ భూ మళ్లింపునకు సంబంధించిన ప్రయోజనాలు, సమస్యలు స్థానికులు అవగాహన చేసుకున్నట్లుగా గ్రామ సభ నుండి ఒక లేఖను కూడా ప్రతిపాదనలకు జతపరచాలి. అటవీ భూమిని మళ్లించినప్పుడు ఏర్పడే ఇబ్బందుల పరిష్కారానికి తీసుకునే నష్టపరిహార చర్యలు, ప్రజల సమ్మతి కూడా ఆ లేఖలో ఉండాలి. అటవీ సంరక్షణ నియమాలలో 6(3)e నియమం ప్రకారం అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించడానికి జరగవలసిన మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ చూడాలి. మొత్తం ప్రక్రియ పూర్తి అయిన తరువాత అంటే అన్ని విషయాలు గ్రామ సభలు ఆమోదించిన తర్వాత జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలను పంపుతారు. అలా పంపిన ప్రతిపాదనలను ఆసాంతము పరిశీలించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించడానికి సూత్రబద్ధంగా ఆమోదం తెలుపుతుంది? ఇది మొదటి దశ రెండవ దశలో మళ్ళించిన అటవీ భూమిని వాడుకునే వినియోగదారు సంస్థ (యూజర్ ఏజెన్సీ) చట్ట నియమాలన్నింటిని పూర్తి చేసిందో లేదో చూడాలి. అంటే నష్టపరిహారం, ప్రత్యామ్నాయ అడవిని ఏర్పరచటం, చెల్లించవలసిన నష్టపరిహారాన్ని చెల్లించటం చెల్లించడం, వణ్యప్రాణి సంరక్షణ పథకాన్ని అమలు చేయడం మొదలగు అవసరమైన చర్యలను తీసుకోవడం, గ్రామసభల ఆమోదం పొందడం మొదలగు వాటన్నింటినీ పూర్తి చేసారో లేదో చూడాలి? ఆ తరువాత కేంద్ర ప్రభుత్వంలో తుది నివేదికను పరిశీలించి అటవీ భూమి మళ్లింపుకు అనుమతినిస్తుంది.

26-2-2019న కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక లేఖను వ్రాసింది. ఆ లేఖలో ఒక ప్రాజెక్టు యొక్క తొలి దశలో సూత్రబద్ధ ఆమోదం పొందటానికి 2006 అటవీ హక్కుల చట్ట నియమాలను పూర్తి చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. కానీ అదే లేఖలోని మరో వాక్యం ముందు వాక్యానికి వ్యతిరేకంగా ఉంది. ఆ వాక్యం మొదటి దశలో ఆమోదం పొందటానికి 2006 అటవీ హక్కుల చట్ట నియమాలను ఒక డిప్యూటీ కమీషనర్ పూర్తి చేయాలని అదే పేరాలో పేర్కొంది. 2006 అటవీ హక్కుల చట్టం అమలులో ఆదివాసీ వ్యవహారాల శాఖ నోడల్ సంస్థగా పనిచేస్తుంది. కానీ పై లేఖను జారీ చేసేటప్పుడు లేఖను ఆ శాఖ యొక్క ఆమోదానికి పంపనేలేదు. 2018 జనవరిలో ఈ శాఖల మధ్య ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశం నిర్ణయాలకు వ్యతిరేకంగా పర్యావరణ మరియు అటవీశాఖ 3-12-2018న ఒక లేఖ రాసింది. ఆ లేఖ యొక్క పునరుద్ఘాటనే ప్రస్తుత లేఖ 2006 అటవీ హక్కుల చట్ట నియమాలను తరువాత కాలంలో పూర్తి చేయడం అంటే ఒక రకంగా ముందే ఆమోదం పొందినట్లు అవుతుందని, దానివల్ల ఆదివాసులు ఇబ్బందులకు గురవుతారని 2018 జనవరి సమావేశంలో ఆదివాసీ వ్యవహారాల శాఖ అభ్యంతరం తెలియజేసింది. అంతేగాక ప్రతిపాదిత ప్రాజెక్టు కోసం చివరి సమయంలో ఆమోదం కోసం పంపడం అంటే ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తి కాదని కూడా ఆదివాసీ వ్యవహారాల శాఖ అభ్యంతరం తెలియజేసింది. కనుక మొదటి దశలో 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అనుమతి పొందాలని సూచించింది. అందువల్ల పై లేఖ సవరణ చేయాలని 5-4-2019న ఆదివాసీ వ్యవహారాల శాఖ సూచించింది. అలా చేయకపోవడం 2006 అటవీ హక్కుల చట్టం సెక్షన్ 7 ప్రకారం నేరం అవుతుందని గుర్తు చేసింది.

ఈ రెండు మంత్రిత్వ శాఖల మధ్య ఈ వివాదం యిలా కొనసాగుతుండగానే 28-8-22న పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ అటవీ సంరక్షణ నియమాలను సవరణ చేస్తూ ఒక నోటిఫికేషన్ జారీచేసింది. సవరణ చేసిన కొత్త అటవీ సంరక్షణ నియమాలు 2006 అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయో లేదో అధ్యయనం చేయడానికి ఒక వర్కింగ్ గ్రూపుని, ఆరుగురు

సభ్యులతో ఏర్పాటు చేసినట్లు ఆదివాసీ జాతీయ కమిషన్ చైర్మన్‌గా ఉన్న హర్ష చౌహాన్ ప్రకటించారు. 2022 నియమాలను ఆసాంతం జాగ్రత్తగా అధ్యయనం చేసిన తర్వాత అవి ఆదివాసుల సంక్షేమాన్ని దెబ్బతిస్తున్నాయి కనుక వాటిని అమలు నిలిపివేయాలని కమీషన్ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖకు సిఫార్సు చేసింది. ఈ కాలంలో అంటే 2018-19 నుండి 2022-23 మధ్యకాలంలో 90 వేల హెక్టార్ల అటవీ భూమిని అటవీయేతర ఉపయోగానికి మళ్ళించిన విషయాన్ని ఈ సందర్భంగా మనం గమనించాలి.

2022 జూన్ నాటి అటవీ సంరక్షణ నియమాల ప్రకారం అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించడానికి సూత్రబద్ధ ఆమోదం ఇచ్చే దశలో జిల్లా కలెక్టర్ నివేదిక గాని, గ్రామసభ ఆమోదం కానీ అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం మంజూరు చేసే సమయంలో కూడా అవి అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వ యొక్క తుది ఆమోదం పొందిన తరువాత రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు వినియోగదారులు (యూజర్ ఏజెన్సీస్) అటవీ హక్కుల చట్టాన్ని పాటించారా లేదా అనే విషయాన్ని చూస్తారు. అప్పుడు అటవీ భూమి మళ్లింపునకు ఆదేశాలు జారీచేస్తారు. అంటే ముందుగా గ్రామ సభ అనుమతి పొందటం అటవీ హక్కుల చట్ట నియమాలను పాటించటం అనే షరతులు చివరికి నెట్టబడ్డాయి.

గత ఆగస్టులో పార్లమెంటు ఆమోదించిన అటవీ సంరక్షణ (సవరణ) బిల్లు ఆమోదంతో ఈ పరిస్థితులలోనూ మరిన్ని మార్పులు వచ్చాయి.

1. గోదావర్మన్ కేసులో సుప్రీంకోర్టు అడవి అనే పదానికి నిఘంటు అర్థాన్ని చూడాలని చెప్పింది. అయినా ఇప్పటివరకు అమలులో ఉన్న నియమాల ప్రకారమే అటవీ భూమి మళ్లింపు జరుగుతున్నది. కొత్త నియమాల ప్రకారం ఆ భూములను చట్టం పరిధి నుండి మినహాయించారు. రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని భూములను ఎక్కడా నమోదు చేయనేలేదు.
2. అంతర్జాతీయ సరిహద్దులకు వంద కిలోమీటర్ల లోపు ఉండే అటవీ భూములు జాతీయ, వ్యూహాత్మక ప్రాజెక్టులకు అవసరమైతే ఆ అవసరాలకు మళ్లించటానికి మినహాయింపు ఇచ్చారు.
3. భద్రతాపరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదించిన ప్రాజెక్టుల కోసం పది హెక్టార్ల వరకు భూమికి మినహాయింపుని ఇచ్చారు.
4. ఏకో టూరిజం సౌకర్యాలన్నింటిని అటవీయేతర ప్రయోజనాల నుండి మినహాయించారు. అందులో అటవీ వర్కింగ్ ప్లాన్, వన్యప్రాణి నిర్వహణ ప్లాన్, టైగర్ సంరక్షణ పథకం వంటివి ఉన్నాయి. కానీ చట్టం ఎకో టూరిజం సామాజికమైందో లేక ప్రైవేటు సంబంధమైన విషయమో ఎక్కడ పేర్కొనలేదు. గ్రామసభ ఆమోదం గూర్చి ఎక్కడా ప్రస్తావించలేదు. అటవీ హక్కుల చట్టం ప్రకారం, హక్కులు పొందుతున్న ప్రజల పాత్ర గూర్చిన ప్రస్తావన కూడా ఎక్కడా లేదు.
5. నిఘా సంబంధమైన, దర్యాప్తు సంబంధమైన, గనుల తవ్వకాలు, భూకంప సర్వేలు మొదలగు ఏ సర్వేలు జరపటంపైనయినా కేంద్ర ప్రభుత్వం ఒక ఆదేశం ద్వారా నియమాలను, షరతులను నిర్దేశిస్తుంది. ఇవేవీ అటవీయతర అవసరాల కోసంగా భావించరాదు. అంటే మైనింగ్ కూడా అటవీయేతర పనుల నుండి ప్రాథమికంగా మినహాయించారు.
6. ఇట్టి ఏ అవసరాల కోసం అయినా సరే కావాలనుకుంటే భూమిని మళ్లించడానికి ఆదేశించే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ద్వారా పొందింది.
7. ఈ చట్టంలోని సెక్షన్ 3సి మన సమాఖ్య వ్యవస్థ స్వభావాన్ని పూర్తిగా విస్మరిస్తున్నది. "కేంద్ర ప్రభుత్వం కాలానుగుణంగా కేంద్రం క్రింద, రాష్ట్రాల క్రింద, కేంద్రపాలిత ప్రాంతాల క్రింద ఉన్న ఏ సంస్థలకైనా ఈ చట్టం అమలు కోసం ఆదేశాలను జారీ చేయవచ్చు" అని పై సెక్షను చెబుతున్నది.
8. 2006 అటవీ హక్కుల చట్టం సెక్షన్ 4లో ఈ విధంగా ఉంది. "ప్రస్తుతం అమల్లోనున్న చట్టాలలో ఏమున్నప్పటికీ 2006 చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కులను గుర్తించి క్రింది వారికి గ్యారంటీ చేయాలి."
   ఏ). ఆయా రాష్ట్రాలలో లేక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలందరకు.
   బి). సాంప్రదాయకంగా అడవులలో, అడవులపై ఆధారపడి నివసిస్తున్న ఆదివాసీలందరకు.

   కనుక అటవీ హక్కుల చట్టం గుర్తించిన ఆదివాసీల హక్కులు ఇతర చట్టాలకు అతీతంగా చెల్లుబాటవుతాయి. కనుక అటవీ హక్కుల చట్టాన్ని నీరుకార్చడానికి చేసిన ప్రస్తుత చట్టం న్యాయం పరంగా నిలబడదు.
9. అటవీ సంరక్షణ (సవరణ) చట్టం సాధారణ అటవీ భూమికి 5, 6 షెడ్యూల్లోని అటవీ భూమికి మధ్య ఎట్టి వత్యాసాన్ని చూపలేదు. అందువల్ల షెడ్యూల్డ్ ఏరియాలో నివసిస్తున్న ప్రజలకు భారత రాజ్యాంగం ప్రసాదం కల్పిస్తున్న రక్షణలకు కూడా ప్రస్తుత చట్టం వల్ల హాని జరుగుతుంది.

భారత రాజ్యాంగం 48ఏ అధికరణలో ఈ విధంగా ఉంది. "రాజ్యము పర్యావరణాన్ని రక్షించడానికి, మెరుగుపరచటానికి అడవులను, వన్యప్రాణులను రక్షించడానికి కృషి చేయాలి". రాజ్యాంగం యొక్క ఈ లక్ష్యాన్ని అటవీ సంరక్షణ (సవరణ) చట్టం దెబ్బతీస్తుంది. అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్ళించటం వల్ల యిప్పటికే ఇబ్బందుల్లో ఉన్న ఆదివాసీల జీవనాన్ని, అటవీ భూమి ఇంకా తగ్గిపోతే మరింత దుర్భరం అవుతుంది. వ్యక్తిగత హక్కులను గుర్తించడంలోనూ, సంక్రమింప చేయడంలోనూ కొంత ప్రగతిని సాధించిన ఈ సమయంలో సామాజిక హక్కుల కోసం కొంత శ్రమించాల్సిన అవసరం ఉందని గమనించాలి. వీటిని సాధించకుండా అటవీ భూమిని ఇతర అవసరాలకు కేటాయించుకుంటూ పోతే అనాదిగా ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ ప్రజలు సమిష్టి ఆస్తి వనరులపై నియంత్రణను కోల్పోతారు. అది 2006 అటవీ హక్కుల చట్ట తీవ్ర ఉల్లంఘన. ఆదివాసీ యువకులు, విద్యాపరంగా పురోగమించాలన్నా, మరింత మంచి జీవితానికి అవసరమైన నైపుణ్యాలను సాధించాలన్నా, అటవీ ఉత్పత్తులను

పెంచుకోవడానికి అవసరమైన ఆర్థిక మద్దతు పొందాలన్నా, ఆదాయాన్ని పొందగలిగే వ్యవస్థాపకులుగా మారాలన్న, అడవిని, అడవిలోని సమిష్టి ఆదాయ వనరులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ విధానాలలో మార్పుల వల్ల పబ్లిక్ రంగములో ఉపాధి అవకాశాలు తగ్గాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనే సమయంలో స్థానిక సవాళ్లను ఎదుర్కోవడానికి అనుగుణంగా ప్రజలు శక్తివంతులు కావాలి. ఆ సందర్భంలో వారు వారి పరిసర పర్యావరణ వ్యవస్థలో కలిసిమెలిసి జీవించాలి. ఈ సందర్భంగా 2023 ఆగస్ట్ చట్టం తెచ్చిన మార్పులను గూర్చి ప్రజల్లో అవగాహనను చైతన్యాన్ని కల్పించడం అవసరం. సుదీర్ఘకాలం ప్రజలు విభిన్న ప్రాంతాల్లో చేసిన పోరాటాల ఫలితంగానే 2006 అటవీ హక్కుల చట్టం వచ్చిందన్న విషయాన్ని మనం ఈ సందర్భంగా గమనించాలి. అటవీ నివాసులు జీవనాన్ని రక్షించడానికి, అడవిని రక్షించడానికి 2023 అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని, 2022 అటవీ సంరక్షణ నియమాలను రద్దు పరచమని శాంతియుతంగా డిమాండ్ చేయవలసిన అవసరం తక్షణ కర్తవ్యం. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో రాజకీయ పార్టీలు వారి ప్రతినిధులు ఓట్ల కోసం ప్రజల దగ్గరకు వచ్చే సమయంలో ఈ డిమాండ్‌ను ముందుకు తేవడం సందర్భోచితంగా ఉంటుంది.


## తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురణలు

31-13-26/1, బి.ఎం. రావురోడ్, మొగల్‌రాజపురం, విజయవాడ - 10.

**తరిమెల నాగిరెడ్డి జీవితము - రాజకీయాలు**
పేజీలు : 92 వెల : రూ. 50/-

**తరిమెల నాగిరెడ్డి గురించి ఇంటర్వ్యూలు-జ్ఞాపకాలు**
పేజీలు : 232 వెల : రూ. 90/-

**మన లెనిన్** పేజీలు : 56 వెల : రూ. 25/-

**నూతన చైనా నూతన ప్రపంచం** పేజీలు : 104 వెల : రూ. 50/-

**వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం**
పేజీలు : 100 వెల : రూ. 50/-

**భారత కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంత రాజకీయ ఉద్యమ నిర్మాణ దృక్పథాలు - వైఖరులు - 1**
పేజీలు : 566 వెల : రూ. 200/-

**భారత కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంత రాజకీయ ఉద్యమ నిర్మాణ దృక్పథాలు - వైఖరులు - 2**
1/4 డెమ్మీ సైజు, పేజీలు : 350 వెల : రూ. 160/-

**తాకట్టులో భారతదేశం** (ఐదవ ముద్రణ)
పేజీలు : 558 వెల : రూ. 120/-

**తాకట్టులో భారతదేశం నాడు - నేడు** పేజీలు:56 వెల:రూ. 20/-

ప్రతులకు : మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

తీర్మానం - 1

# ఆదివాసులకు, ప్రజలందరకూ వ్యతిరేకమైన అటవీ సంరక్షణ (సవరణ) చట్టం-2023ను రద్దు చేయాలి

అటవీ, పర్యావరణ పరిరక్షణ సవరణ చట్టాలకు వ్యతిరేకంగా విశాఖపట్నం 12, 13 సెప్టెంబర్ 2023లో జరుగుతున్న అఖిల భారత ఆదివాసీ సదస్సుకు హాజరైన ఆదివాసీ ప్రతినిధులు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు, పెద్దలందరికీ ఉద్యమాభినందనాలు!

**ప్రస్తుత సమస్య :** భారత పార్లమెంటు ఉభయ సభలు 2023 జూలైలో ఎలాంటి చర్చ లేకుండానే అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లునూ, జీవవైవిధ్య చట్ట సవరణ బిల్లులను ఆమోదించాయి. ఇదే విధంగా భారత పార్లమెంట్ వాయు, జల కాలుష్య కారక చట్టాలకు సవరణ బిల్లులను కూడా పార్లమెంట్ ఆమోదించింది. దీనికి ముందే అటవీ సంరక్షణ చట్టం – 1980 నియమాలను సవరిస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు దాని కాలపరిమితి ముగిసిన వెంటనే చట్టం అవుతుంది గనుక దానిపైన ఎలాంటి చర్చలు లేకుండానే అవన్నీ చట్టాలుగా మారిపోయాయి.

1980 పర్యావరణ పరిరక్షణ చట్టానికి ఇప్పుడు ప్రభుత్వం 2023లో చేసిన సవరణ అడవి గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన నిర్వచనాన్ని మార్చి వేసింది. దీని ప్రకారం 1927 అటవీ చట్టం నాటికి అడవిగా నోటిఫైడ్ చేసిన ప్రాంతాలు మాత్రమే అడవిగా చెలామణి అవుతాయి. అంటే సాంకేతికంగా జిందాల్ ఫ్యాక్టరీ భూ దురాక్రమణకు వ్యతిరేకంగా నియామగిరి ఆదివాసుల భూములు, అటవీ భూములు కావు, గనుక అటవీ హక్కులు, గ్రామసభ తీర్మానాలు చెల్లుబాటు కావనే పేరుతో వారు చేస్తున్న పోరాటాలని నీరుకార్చే ప్రమాదం ఉన్నది. ఆ భూములను జిందాల్‌కు అప్పగించే కుట్ర దీని వెనుక ఉంది. ఇదే ప్రాతిపదికన రేపు చింతపల్లి బాక్సైట్ ఉన్న భూములు కూడా అటవీ భూములు కాకపోవచ్చు. అదేవిధంగా దేశ సరిహద్దుల వాస్తవాధీన రేఖ నుండీ 100 కిలోమీటర్ల ప్రాంతంను అడవుల పరిధి నుండి తప్పించడం, 5 హెక్టార్లు పైబడిన అటవీ భూములను కేంద్రం ఎవరికి ఇవ్వాలని అనుకొంటే వారికి ఇచ్చే అధికారం దఖలు పరుచుకోవడం, అడవులలో తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసులకు చారిత్రకంగా అన్యాయం జరిగిందని చెపుతూ వచ్చిన అటవీ హక్కుల చట్టం 2006ను పూర్తిగా నీరుగార్చడం, వీటన్నిటి సారాంశం ఏది అటవీ భూమి? ఏది అటవీ భూమి కాదనేది నిర్ణయించే హక్కు, ఇతరులకు కేటాయించే హక్కు, అధికారం కేంద్రప్రభుత్వం తన దగ్గర దఖలు పరుచుకుని ఉండటం – ఇవన్నీ మనలను తీవ్రంగా కలవరపెడుతున్న అంశాలు.

ఆదివాసులపై ఇప్పుడు జరుగుతున్న దాడులు ఇవే మొదలూ కాదూ, చివరా కాదని మనకు తెలుసు. నేడు ఆదివాసులు తాము జీవించే హక్కు కోసం సాగిస్తున్న జీవన్మరణ పోరాటం అన్నది కేవలం వారికోసమే కాదనీ, దేశ ప్రకృతి, పర్యావరణాలను రక్షించడం కోసం కూడా అని మనం విశాల ప్రజానీకానికి చెప్పాలి. ఆదివాసులపై ప్రస్తుత దాడులు రాజకీయ పార్టీల విధానాలు, నాయకుల స్వభావాల బట్టీకాక వీటి మూలాలు ఈ పాలనా వ్యవస్థ పునాదులలోనే ఎలా ఉన్నాయో పరిశీలించాలి. దానిని బట్టి ఆదివాసీ ఉద్యమాలకు అండగా కార్మిక రైతాంగ ప్రజాతంత్ర ఉద్యమాలు ఎంతటి బరువైన, దీర్ఘకాలిక దృష్టితో నిలవాల్సిన అవసరం ఉందన్న అవగాహనను చర్చించడమే ఈ పత్రం ఉద్దేశ్యం.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన థానాభగత్ ఉద్యమం ఈ క్రింది ప్రశ్న వేసింది. "ఈ ప్రకృతి భగవంతుడు సృష్టి. మేము భగవంతుని పిల్లలమే అయితే మధ్యలో ఈ ప్రభుత్వం అన్నది ఎవరు?"

ఎవరిది అడవి అన్న ప్రశ్న భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యం ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు పరిష్కరించబడకుండా కొనసాగుతున్న మౌలిక ప్రశ్న.

**వలస పాలనా కాలంలో అడవులు – ఆదివాసుల పట్ల దృక్పథం – పాలనా విధానం :**

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో ప్రవేశించినప్పుడు వారికి ఆదివాసులతో వ్యవహరించే దగ్గర ఒక కొత్త సమస్య ఎదురైంది. అప్పటివరకు జరిగిన యుద్ధాలు – రాజులు, వాళ్ళ సైన్యాలతో జరిగితే, ఆదివాసీ ప్రాంతాల్లో పిల్లల నుంచి ముసలివారి వరకు ప్రతి ఒక్కళ్ళు, వారి వారి ఆయుధాలతో చనిపోయేంతవరకు పోరాడారు తప్ప లొంగిపోలేదు. ఇలాంటి ఆదివాసీ సమూహాలతో ఎట్లా వ్యవహరించాలన్నది బ్రిటిష్ పాలకులకు శక్తికి మించిన విషయం కింద మారింది. దేశంలో జాతీయోద్యమం ప్రారంభానికి ముందే ఆదివాసులు స్పష్టమైన బ్రిటిష్ వ్యతిరేక వైఖరులను తీసుకొన్నారు. అలాంటి స్థితిలో ఆదివాసీ ప్రాంతాలన్నిటిని జమీందారుల, రాజుల పరిపాలనలో అట్టి పెడుతూనే, తమకు కావలసినంత అడవిని ఆదివాసీ ప్రజానీకానికి వదిలిపెట్టడానికి వీలుగా 1859 మొదలు 1927 అటవీ చట్టం వరకు చేసుకుంటూ వచ్చాడు.

ఈ చట్టాల అమలు కోసం రెవెన్యూ, పోలీసు యంత్రాంగాల పీడక లక్షణాలన్ని రంగరించిన ఫారెస్టు యంత్రాంగాన్ని సృష్టించి వదిలాడు. బ్రిటీషు పాలకులు అందించే "సుపరిపాలన"కు లోబడని ఆదివాసీ సమూహాలను పూర్తిగానో, పాక్షికంగానో పక్కన పెడుతూనే వారి ఆచార వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదన్న విధానంను నాటి పాలకులు చేపట్టారు. ఇంకోపక్క ఆదివాసుల్లో ఉన్న తిరుగుబాటు తత్వాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక ఆదివాసీ సమూహాలన్నిటిని నేరస్తు తెగలుగా వర్గీకరించారు. ఆదివాసులను వారి వారి ప్రాంతాల్లోనే చట్ట ప్రకారం నిర్బంధించే వైఖరిని, వారున్న ప్రాంతాల నుంచి కదలకుండా బిగించే వైఖరిని నాటి ప్రభుత్వాలు తీసుకున్నాయి.

"రూల్సును మాత్రమే నమ్ము, ప్రజలను అసలు నమ్మకు" ("ట్రస్ట్ ది సిస్టం! డిస్‌ట్రస్ట్ ది పీపుల్") అన్న సూత్రమే వలస పాలన అంతటా అన్ని చట్టాల రూపకల్పన, అమలు వెనుక సూత్రం. ప్రజల సమిష్టి ప్రాతినిధ్యం ఏదీ లేకుండా వ్యక్తుల సమస్యలుగా విన్నవించుకోవడమే పౌరుల విధిగా ప్రచారం చేసారు.

**1. వలస పాలకుల దృక్పథం కొనసాగింపే – నేటి పాలకుల ఆదివాసీ విధానానికి పునాది :**

భారతదేశం 1947లో బ్రిటీషు పాలకులు అప్పటివరకూ ఏ అసమాన వ్యవస్థ అయితే అమలులో ఉందో ఆ వ్యవస్థను, దాని విధివిధానాలను యథాతథంగా కాపాడుతామనే ఒప్పందం మీద మన దేశీయులకు అధికారాన్ని మార్పిడి చేశారు.

1947 సందర్భంగా భారత ఉపఖండ దేశాలు, మనదేశంలో రాష్ట్రాలు విభజన జరుగుతున్నప్పుడు ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసుల భౌతిక జీవన విధానాలను, మనోభావాలను ఆ ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోలేదు. వారి రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా దేశ విభజన జరిగింది. విభజన జరగక ముందు ఆయా ఆదివాసీ తెగలు యథేచ్ఛగా సంచరించిన ప్రాంతాలను, ఇప్పుడు వాటిని సరిహద్దుల పేరుతో గీతలు గీసి ఆక్రమణదారుల కింద, నేరస్తుల కింద ప్రకటించారు. ఈశాన్య భారతంలో మణిపూర్, అస్సాం, నాగాలాండ్ తదితర రాష్ట్రాలలో జరుగుతున్నదిదే. ఆంధ్ర, తెలంగాణా, ఛత్తీస్‌ఘడ్, ఒడిషాల మధ్య జీవించే కోయలు, సామంతులు, కోందులు వంటి తెగలు నిరంతరం దశాబ్దాల తరబడి తమ భూమి నుండి, ఊరి నుండి గెంటివేతలకు గురవుతున్నారు. 1950 నాటి రాష్ట్రపతి 'షెడ్యూలు ప్రాంతాల ప్రకటన' ఆదివాసీ తెగలను వారుండాల్సిన ప్రాంతాలకు పరిమితం చేసే విధంగానే రూపొందించబడింది. దీనివల్ల ఒక ప్రాంతానికి పరిమితం చేయడం వల్ల ఇంకో ప్రాంతానికి వెళ్ళిన వారి ఉనికి ప్రశ్నార్థకం చేయబడింది. వారు స్థానికత ధృవీకరణకు నోచుకోలేదు. ఆదివాసీ యువత భవిష్యత్తుకిది గొడ్డలిపెట్టు లాంటిది. "సిస్టాన్ని నమ్ము–ప్రజల్ని నమ్మకు" అన్న వలస కాలపు పాలనా సూత్రమే నేటికీ అమలులో ఉంది.

**2. ఆదివాసుల సాంఘిక జీవన విధానాన్ని ధ్వంసం చేయకుండా అడవిని, పర్వతాలను కొల్లగొట్టడం సాధ్యం కాని పని : అందుకే రక్షక చట్టాలు, సవరణ చట్టాలు పేరుతో ఊరడింపుల ప్రక్రియ అణచివేతల ప్రక్రియగా మారింది.**

బ్రిటిష్ పాలన మన దేశంలో మొట్టమొదట భూమిపై వ్యక్తిగత ఆస్తి హక్కును ఒక విధాన అంశంగా అమలు చేసింది. నాటినుంచి ఉమ్మడి ప్రాకృతిక వనరులన్నీ వ్యక్తిస్వామ్యానికి దఖలు పరచడం అన్నది రాజ్యం యొక్క కర్తవ్యంగా మారింది. కానీ ప్రకృతిలో నిరంతర సంబంధాలలో ఉండే ఆదివాసీ జనాభా మనుగడకు భూమి, అడవి వంటి ప్రాకృతిక వనరులు ఉమ్మడి వనరులుగానే ఉన్నాయి. అందువల్ల వారు సమిష్టి జీవన విధానాన్ని రక్షించుకుంటూ వచ్చారు.

ఈ సమిష్టి జీవన విధానాన్ని దెబ్బతీయటానికే మొత్తం అడవులపై కేంద్రీకృత అధికారం కోసం ప్రయత్నం మొదలైంది, దీని కోసం ఫెడరల్ సూత్రాలను కాలరాయడం జరిగింది. దీనికి 1980 అటవీ సంరక్షణ చట్టమే ఉదాహరణ. 1950ల నాటి రాజ్యాంగం అడవులను రాష్ట్రాల జాబితాలో చేర్చింది. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలనలో చేసిన 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం అడవులు ఉమ్మడి జాబితాలోకి మార్చారు. జనతా పార్టీ, ఇందిరా నిరంకుశ చట్టాలను సరిచేస్తామని షా కమీషన్ వంటివి వేసినా అడవులు ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్రాల జాబితాలోకి మార్చలేదు. అడవులపై కేంద్రీకృత అధికారం అన్నది పాలకుల అందరి ఏకాభిప్రాయం అన్న మాట.

ఆ క్రమంలోనే వచ్చిన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణల నూతన ఆర్థిక విధానాల ఈ కాలంలో ప్రకృతి వనరులన్నీ కేంద్ర ప్రభుత్వ గుప్పిట్లోకి రావాలని అక్కడి నుంచీ ఆ వనరులన్నీ ప్రైవేట్ దోపిడీ కార్పోరేట్లు, విదేశీ గుత్త సంస్థల చేతుల్లోకి వెళ్లాలి. అందుకు అడ్డువచ్చే ఆదివాసులను వివిధ చట్టాల పేరుతో గెంటివేయాలి. 1980 అటవీ సంరక్షణ చట్టం అమలు పేరుతో ఆదివాసులను ఆక్రమణ దారులంటూ, ఇందుకు సుప్రీంకోర్టు ఆదేశాలంటూ 90ల నుంచీ ఇప్పటివరకూ అనేక దఫాలుగా ఆదివాసులను వేలాదిమందిని వారివారి ఆవాసాల నుంచీ దుర్మార్గంగా గెంటివేశారు.

**అటవీ హక్కుల చట్టం –2006 :** ఆదివాసులకు చారిత్రకంగా జరిగిన అన్యాయాన్ని సరిచేయడం కోసమంటూ తెచ్చిన 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక ఆదివాసీకి కేటాయించిన భూమి మాత్రమే అతనిదవుతుంది. అక్కడ చెట్లు కొట్టకుండా అడవిని పరిరక్షిస్తానని, అటవీ అధికారులకు సహకరిస్తానని హామీ మీద 2006 అటవీ హక్కుల చట్టం ఉనికిలోకి వచ్చింది. అది కూడా చిత్తశుద్ధితో అమలు చేయలేదు. అధికార యంత్రాంగం నిర్వాకం వలస ఈ చట్టం అత్యధిక ఆదివాసులను అడవులలో నివసిస్తున్నట్లు గుర్తించనేలేదు. దీని వల్ల గుర్తింపు పొందని వారంతా ఆక్రమణ దారులైపోయారు. దీని ఆధారంగా కూడా ఆదివాసుల గెంటివేతకు సుప్రీంకోర్టు ద్వారా జరిగిన ప్రయత్నాలకు నిరసనలు వెల్లువెత్తాయి. ఈ విశాఖపట్నంలోనే 2019 జూన్‌లో వేలాది మందితో జరిపిన భారీ ఆదివాసీ నిరసన ద్వారా మన అసమ్మతిని తెలియజేశాం. గెంటివేత ప్రమాదం ఇంకా మన ఆదివాసుల నెత్తిన వేళ్ళాడుతున్న కత్తిలానే ఉంది.

**3.ప్రపంచ బ్యాంకు ప్రేరేపిత ప్రభుత్వం అటవీ విధానాలు ఆదివాసులే కాదు, అడవులకు, పర్యావరణానికి, వన్యప్రాణులకు కూడా వ్యతిరేకమే!:**

వాణిజ్యం కోసమే అడవులు అన్నది ప్రపంచ బ్యాంకు ఆదేశం. దాని ప్రకారం ప్రభుత్వాలు క్రమంగా సహజ అరణ్యాలను ఏకరూప వాణిజ్యవనాలుగా మార్చుతూ వచ్చారు.

అడవంటే నేలమీద పాకే నాచు, లతల నుండి పొదలు, చిన్నచిన్న వృక్షాల నుంచీ భారీ వృక్షాలు, తీగలతో అనేకరకాల అంతస్తులుగా ఉండే పర్యావరణ వ్యవస్థ. ఒక్కో అంతస్తులో మొక్కలు తిని బతికే శాకాహార జంతువులు, వాటి మీద ఆధారపడి జీవించే మాంసాహార జంతువులు ఒకదానిపై మరొకటి ఆధారపడుతూ ఒకటి మరోదానిని అదుపు చేస్తూ వస్తాయి.

ఈ సహజ ప్రాకృతిక ధర్మాన్ని విదేశీ బహుళజాతి విధానాలు నాశనం చేయబూనుకున్నాయి. ఏకరూప వాణిజ్య వనాలైన యూకలిప్టస్, టేకు, నీలగిరి వంటి విశాల వనాలుగా మార్చ చూస్తున్నారు. దీనికి తోడు అమెరికా నుంచి దిగుమతైన పార్థీనియం, లాంటానా కమారా వంటి కలుపు మొక్కలు అడవంతా ఆక్రమించుకొని ఉన్నాయి. ఫలితంగా అడవులలో గడ్డిజాతులు నశించి వాటిపై బతికే వన్యప్రాణులు వలసలు పోయాయి. వీటిని తిని బతకాల్సిన మృగాలు, వాటి ఆహార భద్రత దెబ్బతింది. విచ్చలవిడి గనుల తవ్వకం, రోడ్లు, కంచెల నిర్మాణాల వల్ల ఏనుగులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి.

పర్యావరణ విధ్వంసం వల్ల ప్రకృతి సానువులు బలహీన పడుతున్నాయి. అధిక వర్షాల వలన ఈ సానువులు కూలిపోతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర భారతదేశంలో సంభవిస్తున్న ఉధృతమైన వరదలు, విధ్వంసం వీటికి ఉదాహరణ. లాభమే లక్ష్యంగా గల సామ్రాజ్యవాదులకు కనపడుతున్నది. విచ్చలవిడి అమానవీయ విధానాలే కారణం. మన దేశంలో కూడా ఆదివాసులను పూర్తిగా గెంటివేసి అమెరికా తరహా మానవరహిత అడవులుగా మార్చాలనేది పాలకుల ఉద్దేశం. అలా చేయాలని చూస్తే మియామి కార్చిచ్చు వంటివే సంభవిస్తాయి.

ఈనాడు పాలకుల అటవీ, ఆదివాసీ, పునరావాస విధానాలను కార్పోరేట్ల లాభాల కోసం అడవులను, ఆదివాసులను బలిపెట్టేవి. అందుకే జీవవైవిధ్య బిల్లు సవరణ చట్టం, అంతే కాదు వాయు, జల కాలుష్య కారక చట్టాల సవరణలు పర్యావరణానికి ప్రజల జీవితాలను నాశనం చేసే వారిని నేరస్తులుగా పరిగణించకూడదనే వైఖరిని ప్రకటిస్తున్నది. అంటే భోపాల్, ఎల్‌జీ పాలిమర్స్ (విశాఖ) వంటి దుర్ఘటనలో జరిమానాలతో సరిపెట్టేలా చట్టాలను సవరించి వన్యప్రాణుల సవరణ చట్టంలో పంటచేలలో వేటకు వెళ్ళినా తీవ్రమైన కఠినశిక్షలు వేసేలా సవరణ చేశారు. ఎంతటి నేరమైనా నేరస్తులను కాపాడుతూనే వున్నారు కానీ, ఇప్పుడు కర్బన ఉద్ఘారాలను తగ్గించాలంటే ఆదివాసులను అడవుల నుంచి తొలగించాలని అంటున్నారు. ఎంత పెద్ద కుట్ర!

కనుక బతుకు, బ్రతికించు అన్న దేశీయ విధానమేదీ సామ్రాజ్యవాదుల నిఘంటువులో లేదు. ప్రపంచ బ్యాంకు, సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల ప్రేరేపితమైన ప్రభుత్వాల అటవీ విధానాలు యావత్తు దేశానికి, ప్రకృతికి వ్యతిరేకమైనవి. వీటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడటమే ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వాదుల కర్తవ్యం. ప్రజలనూ, ఆదివాసులను వ్యతిరేకించే పర్యావరణ వాదం సారాంశంలో సామ్రాజ్యవాదుల ప్రేరేపితంగానూ కార్పోరేట్లకే సేవ చేసేదిగానూ మారుతుంది. కనుక దీనిని మనం తిరస్కరించాలి.

**మిత్రులారా!**

కొందరి లాభాపేక్షల కోసం అడవులనూ, ఆదివాసులను నిర్మూలించడానికి వ్యతిరేకంగా డాక్టర్ బి.డి.శర్మ గారు నిరంతరం పోరాడారు. ఉమ్మడి ప్రాకృతిక వనరులపై గ్రామ ఆదివాసీ సమాజాల హక్కు, స్వపరిపాలన ఇవి రెండూ ఆదివాసులను రక్షించే ఆవశ్యకాలని భావించేవారు. ఆయనను స్మరించుకొంటూ ఈ ప్రాంగణంలో మనం ఉన్నాం.

మౌలికమైన అంశాలపై నిలబడుతూ ఇక్కడ ఒక విషయం మనం స్పష్టపరుచుకోవాల్సింది ఏమంటే ఈ దేశంలో ఆదివాసులకు అనుకూలమనో, వ్యతిరేకమనో చెప్పబడే ప్రతి చట్టం ఆదివాసుల రక్తంతోనే రాయబడింది. ఆదివాసీ పోరాటాలు–బలిదానాల చరిత్రే. భారతదేశ ఆదివాసీ చట్టాల చరిత్ర. అదే సమయంలో తమ సొంత రాజకీయ విధానాలపై ఆదివాసులు నిలబడితేనే నామమాత్రంగానైనా చట్టాలు అమలులోకి వస్తాయి. వాటి మీద గుడ్డిగా ఆధారపడే వైఖరి చివరకు ఆ చట్టాలకున్న కంతలతో ఏమాత్రం ఉపయోగపడదు. అది జల్లెడతో నీళ్ళు తెచ్చుకోవడంగా, అసంభవంగా మారిపోతుంది.

అదేసమయంలో “ఆదివాసుల కోసం ఆదివాసులే పోరాడాలి. ఎవరి సమస్యల పరిష్కారం కోసం వారే పోరాడాలన్న” తునకల సిద్ధాంతాలు కూడా అణగారిన ప్రజలను విశాల పీడిత ప్రజల నుంచి వేరు చేస్తాయి. ఇప్పుడు బి.జె.పి ప్రతిపాదిస్తున్న మెజారిటీవాదానికి లోబడిపోతాయి. మారుమూల అడవులను కూడా పాలకులు సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టివేశారు. ఆదివాసీ ఉద్యమం ఇంకెంతమాత్రం తనది మాత్రమే కాదు, విశాల పీడిత ప్రజలది. ఆ ఉద్యమంలో ఒక విడతీయరాని భాగం. కనుకనే అందరమూ కలసి అడవుల రక్షణ, ఆదివాసుల రక్షణలకై కదులుదాం! అడవులపై సామ్రాజ్యవాదుల కార్పోరేట్ల పెత్తనాలను తిప్పికొడదాం!

ఆదివాసీలు ఆక్రమణదారులు కాదు;
వారు అడవితల్లి ముద్దుబిడ్డలు

**తీర్మానం - 2**

# ప్రజల పోరాటాల, త్యాగాల ఫలితమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయవద్దు

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను 100% అమ్మాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తేదీ : 27-1-2021న నిర్ణయించింది. ప్రభుత్వ ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా 943 రోజులుగా కార్మిక వర్గం పోరాడుతున్నది. విశాఖకు ఆంధ్రుల హక్కు పేరుతో 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని మరింత ఐక్యంగా కొనసాగించాలని కార్మిక వర్గాన్ని పిలుపునిస్తున్నది. వ్యూహాత్మక అమ్మకం ప్రకటించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను పథకం ప్రకారం సిక్ చేసి బలహీన పరచాలని కుట్ర చేస్తున్నది. విశాఖపట్నం తీర ప్రాంతాన్ని లాజిస్టిక్ హబ్‌గా మార్చి భారతదేశంలోని సహజ వనరులను విదేశాలకు తరలించేందుకు పాడి పరిశ్రమ లాంటి విశాఖ ఉక్కును ప్రైవేటు వారికి అప్పగించాలని చూస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలహీనపరిచే చర్యలను విడనాడి పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు సహకరించాలని, సొంత మైన్స్ కేటాయించాలని, రిక్రూట్‌మెంట్ చేయబట్టి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ అఖిల భారత ఆదివాసీ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

1966లో విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు పేరుతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సాధన కోసం జరిగిన పోరాటంలో విద్యార్థి, రైతు, కార్మికులు, మేధావులు, రాజకీయ నాయకులు చురుకైన పాత్ర పోషించారు. ఈ పోరాటంలో 32 మంది ప్రాణ త్యాగాలు చేశారు. 67 మంది శాసనసభ్యులు, ఏడుగురు పార్లమెంట్ సభ్యులు తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఫలితంగా తేదీ 17-4-1970న నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని ప్రకట ప్రకటించాల్సి వచ్చింది. విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి 20 వేల ఎకరాల భూమిని 64 గ్రామాల రైతులు త్యాగం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్. సాలినా రూ.25 వేల కోట్లకు పైగా టర్నోవర్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నది. తలసరి ఆదాయంలో గాజువాక మన రాష్ట్రంలోనే నెంబర్-1గా ఉందంటే కారణం విశాఖ స్టీల్ ప్లాంట్. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 15000 మంది శాశ్వత కార్మికులు మరో 16,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల పనిచేస్తున్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లక్షల మందిపైగా ఉపాధి పొందుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి రూ.4890 కోట్లు మాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెంట్ల రూపంలో రూ. 54,000 కోట్లు చెల్లించిన ఏకైక సంస్థ. 4 లక్షల కోట్ల ప్రజల ఆస్తిని కారుచౌకగా అమ్మాలని కుట్ర చేస్తున్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ 2021-22 ఆర్థిక సంవత్సరంలో 975 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ లాభాలను ప్లాంట్ ఉత్పత్తి అవసరాలకు వినియోగించకుండా కావాలనే అప్పులకు చెల్లించి ప్లాంట్ నిర్వహణకు డబ్బులు లేవంటూ మోసం చేస్తున్నారు. 2022-23 కాలంలో దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్లకు లాభాలు వచ్చాయి. కేవలం స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే నష్టాలు వచ్చాయి. ఇది ప్రభుత్వ కుట్ర. కావాలనే నష్టాలపాలు చేశారు. 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ 3వ బ్లాస్ట్ ఫర్నెస్‌లో తేది : 27-1-2022 నుండి ఉత్పత్తిని పూర్తిగా ఆపేసింది. రా మెటీరియల్ కొనుగోలుకు సహకరించడం లేదు. అవసరమైన రైల్వే రేకులు కేటాయించడం లేదు. సొంతగనులు లేక మిగిలిన ప్లాంట్లతో పోల్చుకుంటే టన్నుకు అదనంగా రూ.3000 ఖర్చు అవుతున్నది. వడ్డీలకు ప్రతినెల 250 కోట్లు చెల్లించవలసి వస్తున్నది. ఉత్పత్తి కుదించడం మూలంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 3900 కోట్ల నష్టాలు వచ్చాయి.

అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే
నిరంతర కుట్రలను ఓడిద్దాం

## తీర్మానం - 3

# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరకు సమగ్ర శాస్త్రీయ పునరావాసం కల్పించాలి

పోలవరం ప్రాజెక్టు ద్వారా దేశంలోని అత్యధిక సంఖ్యలో ప్రజలు విస్తాపనకు గురవుతున్నారు దాదాపు 300 గ్రామాలకు చెందిన ఐదు లక్షల మందికి పైగా ప్రజానీకం నిర్వాసితులు కాగా వీరిలో అత్యధికులు ఆదివాసి ప్రజానీకమే. నిర్వాసితులకు సరైన పరిహారం, పునరావాసం కల్పించకుండానే ఆదివాసి గ్రామాల నుండి బలవంతాన ప్రభుత్వం వారిని తరలించి వేస్తోంది. ప్రాజెక్టు పూర్తి కాకుండానే ముంపు సమస్యతో ప్రాజెక్టు ఎగువన ఉన్న గ్రామాలు, పొలాలు నెలల తరబడి నీటిలో నిల్వ ఉండే పరిస్థితుల్లో వారంతా అనివార్యంగా పొట్ట చేత పట్టుకొని తరలి వెళ్లాల్సి వచ్చింది. కొండ మొదలు ప్రాంత ఆదివాసులు సంఘ నాయకత్వాన పోరాడి వివిధ ప్రాంతాలలో పునరావాసంలో తమ భూమి హక్కును కాపాడుకున్నారు. అయినప్పటికీ అంగీకృత 'అవగాహన పూర్వక ఒప్పందాన్ని' అమలు చేయడంలో అధికార యంత్రాంగం తాత్సారం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన లక్షలాది మంది ఆదివాసులకు సమగ్ర,శాస్త్రీయ పునరావాసం కల్పించాలని అఖిలభారత ఆదివాసి సదస్సు డిమాండ్ చేస్తోంది


అభినందనలతో....



**శ్రీ చోడి పెంటయ్య**, సర్పంచ్

**కుంతేసు గ్రామ పంచాయితీ,**

**కొమరాడ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా**



**శ్రీ కోడి తిరుపతిరావు**, సర్పంచ్

గంగరేగువల్స గ్రామ పంచాయితీ,

**కొమరాడ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా**



**శ్రీ గంట వెంకటి నాయుడు**, MPTC

గంగరేగువల్స,

**కొమరాడ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా**


అభినందనలతో....
VISAKHA DAIRY®
...The Health of India
విశాఖ డెయిరి
Available Sizes :
100 gms / 200 gms / 300 gms / 400 gms
OSMANIA
BISCUITS

అభినందనలతో... ప్రో॥ బి. రాఘవరెడ్డి



# శ్రీ పావని ఎంటర్ ప్రైజెస్



సెల్ : 9440265670

పుల్లయ్య కాంప్లెక్స్ ఎదురు, బాలకృష్ణాపురం వీధి, తులసీరాం థియేటర్ దగ్గర, కర్నూలు రోడ్డు, ఒంగోలు.

డీలర్స్ : కిర్లోస్కర్, కె.యస్.బి. డెక్కన్, సాబార్, ఎల్లన్, టెక్మో మోటార్స్, అల్యూమినియం,HDPE స్ప్రింక్లర్స్, రెయిన్‌పోర్ట్ పైప్స్, డ్రిప్ ఇరిగేషన్, CI, GI, PVC పైప్స్ & ఫిట్టింగ్స్, L&T, BCH, స్టాటర్స్, ఆక్వా ఏరియేటర్ ఫ్యాన్స్ & స్పేర్స్ లభించును.

Kirloskar KSB DECCAN PUMPSETS sabar PUMPS • MOTORS • PIPES ELLEN Since 1979 TECMO PUMPSETS

అభినందనలతో....

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

# గిరిజన సంక్షేమ శాఖ

**ఎం. రుక్మాంగదయ్య, M.B.A.**

**జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, యన్.టి.ఆర్. జిల్లా**

కార్యనిర్వహణ అధికారి, ఆంధ్రప్రదేశ్ గిరిజన ఆర్థిక సహకార సంస్థ లిమిటెడ్, యన్.టి.ఆర్. జిల్లా

సహాయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులాల విద్యాలయాల సంస్థ, యన్.టి.ఆర్. జిల్లా

సహాయ ప్రాజెక్టు అధికారి, ఐ.టి.డి.ఎ, (మైదాన ప్రాంతాలు), యన్.టి.ఆర్. జిల్లా

వారి కార్యాలయములు - విజయవాడ.




*With Best Compliments from....*

GST No. : 37AABFD5446J1ZC

Agl No. : PKM/44/JDA/FW/2013/7092

**Cell : 9849 100 140 (Veeraiah)**

**Cell : 9849 592 900 (Shop)**

# DESU VEERAIAH SONS

## FERTILIZER DISTRIBUTORS

**#5-425(D), Desu Plaza, 1st Floor,**

**North Bypass Road, ONGOLE - 523002. A.P.**

E-mail : desuveeraiahsons@gmail.com

# RTO ఆదినారాయణ టిప్స్‌తో రహదారి భద్రత పెంపు

**అన్ని రోడ్లపై రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ద్వారా రోడ్డు భద్రతను మెరుగుపరచడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఈ టిప్స్‌ను అనుసరించడం ద్వారా మీరు లాంగ్ లివ్ & పబ్లిక్ లాంగ్ లివ్ కోసం మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ఇవి సమాచారం కోసం కానీ ఏ చట్టపరమైన వాజ్యం కోసం కాదు. నా YouTube.. Road Safety by RTO Adinarayana**

1. మనం విశ్వసనీయత లేకుండా జీవించలేము కాని తల్లిదండ్రులు లేకుండా జీవించగలము అనే మంచి సూత్రాన్ని ఉపయోగించి నేను అభివృద్ధి చెందాను.
2. ఎల్లప్పుడు స్పేర్ కీని ఉంచుకోండి. మీ పిల్లలు కనిపించకుంటే, ముందుగా మీ కారులో తనిఖీ చేయండి. ప్రతి 03 గంటలకు 10 నిమిషాల బ్రేక్ జర్నీ చేయాలి. జంక్షన్‌ల వద్ద & రైల్వే గేట్ లేని వద్ద కూడా ఆగి చూడండి & వెళ్ళండి. ఆటోలలో ప్రయాణం చేస్తూ ఆపదలో ఉన్నప్పుడు అభయం & జి.పి.యస్. వాడండి.
3. ప్రతి 03/06 నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడండి మరియు మీ ఆరోగ్యాన్ని కాపాడండి, మెరుగుపరచుకోండి మరియు Road Accidents (RA)లో మెదడు మరణానికి సంబంధించిన అవయవాలను దానం చేయడం ద్వారా పేద రోగులకు జీవితాన్ని ప్రసాదించి పుణ్యం కట్టుకోండి.
4. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రతి 03 నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రయాణాన్ని ప్రారంభించే ముందు రికార్డులు, డియల్, ఇంజిన్ ఆయిల్, రేడియేటర్ వాటర్, బ్రేక్ ఆయిల్, కూలెంట్, టైర్‌లలో & స్టెప్నీలో కూడ ఎయిర్, జాకీ, టూల్ కిట్ మరియు అన్ని డాష్ బోర్డ్ మీటర్ల పనితనం తనిఖీ చేయండి.
5. మా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లైన (www.aprtacitizen.epragati.org ని పాత, vahan.parivahan.gov.in ని క్రొత్త రిజిస్ట్రేషన్ & saradhi.parivahan.gov.in ని క్రొత్త LLRs & DLs కొరకు) కావలసిన సమాచారాన్ని పొందండి.
6. మన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం (R A) సాక్షులను అనవసర ప్రాసిక్యూషన్ లేదు కావున 108కి డయల్ చేయడం ద్వారా జీవితాలను రక్షిస్తూ Good Samaraterian ప్రశంసాపత్రము & రూ. 5000ల నగదును పొందండి. “జర్నీ” సినిమాని చూడటం ద్వారా స్వీయ మరియు కుటుంబ సభ్యుల జీవితాలను కాపాడుకోండి.
7. హెల్త్ కమ్ అడ్రస్ కార్డ్ మరియు వ్యక్తిగత సెల్ నంబర్ లేదా ఫ్యామిలీ సెల్ నంబర్‌లను ఉంచడం ద్వారా (R A)లో మీ ప్రాణాలను కాపాడుకోండి. యల్‌యల్‌ఆర్ పరీక్షకు హాజరయ్యేముందు యల్‌యల్‌ఆర్ మాక్ టెస్ట్ (మా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. ఉపయోగించండి & డియల్ పరీక్షకు హాజరయ్యే ముందు సిమిలేటర్ అందుబాటులో ఉన్న డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకోండి.
8. మీరు ధూమపానం, మద్యపానం మరియు డ్రగ్స్ లేకుండా దీర్ఘకాలం జీవించడం ద్వారా మీ కుటుంబం నుండి మన భారతదేశం వరకు మీరు అభివృద్ధి చెందాలి, మీరు వాటికి బానిసలైతే డి–అడిక్షన్ తీసుకోండి.
9. ద్విచక్ర వాహనాలు తప్ప వాహనాలు నడుపుతున్నప్పుడు బూట్లు లేదా చెప్పులు ధరించవద్దు. కానీ మెదడుకు అవగాహన కల్పించడానికి సాక్స్‌లను వాడవచ్చు.
10. వృధాను & ఖర్చును తగ్గించండి, ఎందుకంటే? పొదుపు అనేది సంపాదనతో సమానము కావున. రిపేర్ కంటే నివారణ ఉత్తమం కాబట్టి డ్రైవింగ్ చేస్తున్నప్పుడు హెల్మెట్ & సీట్ బెల్ట్ ధరించడం ద్వారా మరియు ఆల్కాహాల్ & సెల్‌ఫోన్ ఉపయోగించకుండా (కానీ అత్యవసరంగా ప్రతి గంటకు వేరొక చెవికి మార్చడం ద్వారా ఇయర్‌ఫోన్ లేదా బ్లూటూత్‌తో వుపయోగిస్తూ రిప్లై కొరకు మాత్రమే) మీ ప్రాణాన్ని కాపాడుకోండి. కారు లేదా మీ ఇంటి ఏసిని & కారు ఏసిని కూడా తక్కువగా వాడి పొల్యూషన్‌ను తగ్గించండి.
11. వివాహాలు & విధులు మరియు యాత్రికుల పర్యటనలలో డ్రైవింగ్ & ఇతర పని రోజుకు 08 గంటలు మించి ఉంటే, స్పేర్ డ్రైవర్‌ని విధిగా ఉపయోగించి క్షేమంగా ఉండండి కానీ దైవాన్ని నిందించవద్దు.

**జి. ఆదినారాయణ, సెల్ : 98485 28364**

LAE, BA, BL, MBA, MATM, DFW, MA(PH), M.Sc.(Psy), MCJ - R.T.O : Gudur

**నా పిహెచ్‌డి కోసం నా ఇ-మెయిల్ ganarayana8@gmail.comకి సలహాలుకు స్వాగతం**




# అడవి, భూమి, నీరుపై ఆదివాసీలదే హక్కు



## ఆదివాసీలు ఆక్రమణదారులు కాదు; వారు అడవితల్లి ముద్దుబిడ్డలు




ఆదివాసులకు, ప్రజలందరికూ వ్యతిరేకమైన 2023 అటవీ సంరక్షణ (సవరణ) చట్టం రద్దుకై పోరాడుదాం!
అఖిల భారత ఆదివాసీ సదస్సు
AIKMKS
ప్రారంభసభ
జిందాబాద్
AIKMKS






అఖిల భారత ఆదివాసీ సదస్సు
AIKMKS
ప్రారంభసభ


ఆదివాసులకు, ప్రజలందరికూ వ్యతిరేకమైన 2023 అటవీ సంరక్షణ (సవరణ) చట్టం రద్దుకై పోరాడుదాం!
అఖిల భారత ఆదివాసీ సదస్సు
AIKMKS
విశాఖపట్నం
ప్రారంభసభ
ప్రాంగణం
ఆదివాసీలదే హక్కు